RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:2 హైదరాబాద్, ఆదివారం, 8 జూన్ 2025 పేజీలు: 12 వెల: 1.00




## తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

హైదరాబాద్, జూన్ 7: గత కొన్ని నెలలుగా తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై ) కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రేపు (ఆదివారం) తెలంగాణ కేబినెట్ విస్తరణ జరుగనుంది. మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురికి చోటు దక్కనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇప్పటి వరకు 12 మంది కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారు. మరో ఆరు స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఏడాదిన్నరకు పైగా కేబినెట్ విస్తరణ జరగలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య పెరిగింది. తమకు అవకాశం ఇవ్వాలంటూ అధిష్టానం చుట్టూ నేతలు తిరుగుతున్న పరిస్థితి.

ఇటీవల మీనాక్షీ నటరాజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన తర్వాత ఆశావాహులంతా కూడా ఆమె కలిసి మంత్రి పదవి కోసం వినతులు చేశారు. కొత్తగా ఎన్నికైన నేతలు, సీనియర్ నేతలు తమకు అవకాశం కల్పించాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలుస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ సంకేతాలు ఇచ్చింది. రేపు మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనిపై ఈరోజు రాజ్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మంత్రి వర్గ విస్తరణకు సంబంధించి ఏర్పాట్లు చేయాల్సిందిగా రాజ్‌భవన్ వర్గాలను సీఎం కోరినట్లు తెలుస్తోంది. రేపు కేబినెట్ విస్తరణలో ముగ్గురికి చోటు దక్కే అవకాశం ఉంది. అయితే ఈ ముగ్గురు ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు అనేక మంది పోటీ పడుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నేతలు, రెడ్డి సామాజిక వర్గం నేతలు మంత్రి వర్గంలో స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఎస్సీ సామాజికవర్గానికి కేబినెట్‌లో ప్రాధాన్యత లేదు. ముదిరాజ్‌లకు కచ్చితంగా అవకాశం ఇస్తానని గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా మైనార్టీలకు కూడా కేబినెట్‌లో చోటు లభించలేదు. ఈ క్రమంలో రేపటి కేబినెట్ విస్తరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు చోటు లభించే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇక రేవంత్ కొత్త టీం ఎవరనేది రేపు (మే 8) తెలిసే అవకాశం ఉంది.

## మ్యాచ్‌ఫిక్సింగ్ అంటూ రాహుల్ గాంధీ పోస్టు.. తీవ్రంగా స్పందించిన భాజపా



్క: మహారాష్ట్రలో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో (%వీఖఫ్ట్రుతీఖంఫ్ట్రతీఖ ఖంంవఎఎశ్రీఎ వశ్రీవష్ఓశీఅం%) విజయం సాధించేందుకు కమలం పార్టీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు ఆ ఎన్నికలు ఓ ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. బిహార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం అవుతుందని విమర్శించారు. దీనిపై భాజపా కౌంటర్ ఇచ్చింది.

ఎన్నికల్లో అక్రమాలు ఎలా..? అంటూ ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ సుదీర్ఘ పోస్టు పెట్టారు. "ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు 2024లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికలు ఒక ఉదాహరణ. ఎన్నికల కమిషన్ నియామకం, నకిలీ ఓటర్ల నమోదు, పోలింగ్‌లో అవకతవకలు, ఆధారాలను దాయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. భాజపా ఎందుకు అలా ప్రవర్తించిందో అర్థం చేసుకోవడం పెద్దకష్టం కాదు. రిగ్గింగ్ అనేది మ్యాచ్ ఫిక్సింగ్ లాంటిది. మోసం చేసే పార్టీ ఆటలో గెలవొచ్చు. కానీ అలాంటి గెలుపు వ్యవస్థలను దెబ్బతీస్తుంది. ఎన్నికల ఫలితాలపై ప్రజల విశ్వాసాన్ని నాశనం చేస్తుంది. ప్రజలంతా ఆధారాలను గమనించి సమాధానాల కోసం డిమాండ్ చేయాలి. ఎందుకంటే మహారాష్ట్ర తర్వాత బిహార్ ఎన్నికలు ఉన్నాయి. ఆ తర్వాత భాజపాకు ఓటమి భయం ఎక్కడుంటుందో అక్కడ ఇవే పునరావృతం అవుతాయి. మ్యాచ్‌ఫిక్సింగ్ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విషం లాంటివి" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.

ఇవే అంశాలను ఆయన ఓ జాతీయ మీడియా కాలమ్‌లో ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఈసీ చాలాసార్లు వివరంగా చెప్పినా.. రాహుల్ గాంధీ మళ్లీ దేశంలోని వ్యవస్థలను బూచిగా చూపే పనిలో ఉన్నారని మండిపడింది. మహారాష్ట్ర శాసనసభకు 288 సీట్లు ఉన్నాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో భాజపా, శివసేన(శిందే), ఎన్‌సీపీ(అజిత్ పవార్) కూటమి 235 సీట్లు గెల్చుకుంది. ఒక్క కమలం పార్టీకే 132 స్థానాలు దక్కాయి. మరోవైపు ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

## యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోంది: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: దేశంలో గత 11 ఏళ్లుగా సుపరిపాలన సాగుతోందని, అందుకే యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా వివరించాలని, వ్యతిరేక ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు.



తెలంగాణకు కేంద్రం అన్ని రంగాల్లో నిధులిచ్చిందని తెలిపారు. "ఉగ్రవాదుల చేతుల్లో వందలమంది చనిపోతే గతంలో కాంగ్రెస్ స్పందించలేదు. ఉగ్రవాదులు పర్యాటకులను చంపితే 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు చేశాం. తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించే పార్టీ భాజపా. కాంగ్రెస్, భారాసలు ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయాయి" అని కిషన్ రెడ్డి విమర్శించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు మావోయిస్టులు మృతి

చర్ల:జూన్ 7: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం గత కొన్ని రోజులుగా కాల్పుల మోతతో దద్దరిల్లుతోంది. బీజాపుర్ జిల్లాలోని నేషనల్ పార్క్‌లో జరుగుతున్న ఆపరేషన్‌లో మూడో రోజు మరో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటనాస్థలిలో రెండు ఏకే 47 రైఫిళ్లు, భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీహైడ్రేషన్, పాముకాటు, తేనెటీగలు దాడి చేయడంతో కొందరు జవాన్లకు అస్వస్థత కలిగింది. గాలింపు సమయంలో మరికొందరు జవాన్లకు గాయాలయ్యాయి. గత మూడు రోజులుగా నేషనల్ పార్క్‌లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆపరేషన్ ( కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. గడిచిన రెండు రోజుల్లో మావోయిస్టు అగ్రనేతలు సుధాకర్, భాస్కర్ మృతి చెందారు. సుధాకర్‌పై రూ.కోటి, భాస్కర్‌పై రూ.25లక్షల రివార్డ్ ఉంది. ప్రస్తుతం ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని భద్రతా బలగాలు వెల్లడించాయి.

80 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నేషనల్ పార్క్ అటవీ ప్రాంతాన్ని మావోయిస్టులు తమకు సురక్షిత ప్రాంతంగా భావించారు. ఈ విస్తీర్ణంలో ఒక్క పోలీస్ స్టేషన్ గానీ.. క్యాంప్ గానీ లేదు. దాన్ని మావోయిస్టులు అవకాశంగా తీసుకుని ఇక్కడ స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. నిఘా వర్గాల పక్కా సమాచారంతో పోలీసులు ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు సమాచారం. ఈ ఆపరేషన్‌లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా దళాలు పాల్గొన్నాయి.



కర్రెగుట్టల నుంచి మొదలుకొని అబూజ్‌మడ్ పర్వతాలతోపాటు నేషనల్ పార్కులో అణువణువూ జల్లెడ పడుతుండటంతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. కొద్దిరోజుల క్రితం పార్టీ దళపతి బస్వరాజ్ ఎదురుకాల్పుల్లో మృతిచెందగా.. నేషనల్ పార్కులో ఇప్పుడు అగ్ర కమాండర్లు మరణిస్తున్నారు. ఇదే ప్రాంతంలో భారత బలగాలకు మోస్ట్ వాంటెడ్ అయిన మావోయిస్టు నేత మడావి హిడ్మా కూడా ఉన్నట్లు సమాచారం. అతడి లక్ష్యంగానే ఆపరేషన్ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

## బాధితులతో దుష్టులు సమానం కాదు.. పాక్‌పై జైశంకర్ ధ్వజం



భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ( పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. దుష్టులు బాధితులతో సమానం కాదని.. భారత్ ఉగ్రవాదాన్ని ఎన్నటికీ సహించబోదని అన్నారు. బ్రిటన్ విదేశాంగశాఖ మంత్రి డేవిడ్ లామీతో ఆయన దిల్లీలో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన బ్రిటన్ ప్రభుత్వానికి జైశంకర్ ధన్యవాదాలు తెలిపారు. "ఉగ్రవాదాన్ని మేం ఎన్నటికీ సహించబోం. ఉగ్రవాదాన్ని సహించకూడదనే విధానాన్ని భారత్ అనుసరిస్తోంది. చెడుకు పాల్పడే వారిని, దానివల్ల బాధితులయ్యే వారిని సమానంగా చూస్తామంటే మేం ఎన్నటికీ అంగీకరించబోం. ఇది మా భాగస్వామ్య దేశాలు కూడా అర్థం చేసుకోవాలని ఆశిస్తున్నాం" అని జై శంకర్ అన్నారు. ఈ భేటీ సందర్భంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యపరమైన చర్చలు జరిపినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

ఇదిలాఉండగా.. పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణహోమాన్ని ప్రపంచ దేశాలు ఖండించాయి. భారత్‌కు మద్దతు ప్రకటించాయి. ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపాయి. ఈ ఘటన తర్వాత భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌పై దాడులు చేసింది. కాల్పుల విరమణ అనంతరం పాకిస్థాన్ ప్రాయోజిత తీవ్రవాదం, ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాలకు వివరించడానికి అఖిలపక్ష బృందాలు ఆయా దేశాలకు వెళ్లిన సంగతి తెలిసిందే.

## కాళేశ్వరం వివాదంలోకి నన్ను లాగుతున్నారు: మంత్రి తుమ్మల

హైదరాబాద్: కాళేశ్వరం వివాదంలోకి తనను కావాలని లాగుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ మంత్రి ఈటల అబద్ధాలు చెప్పారన్నారు. సబ్ కమిటీకి, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేదని.. మేడిగడ్డ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన తర్వాత కమిషన్ వేశారని చెప్పారు. కాళేశ్వరం విషయంలో మాజీ మంత్రి ఈటల చేసిన ప్రకటన పూర్తిగా అవాస్తవమని చెప్పారు.

హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " కమిషన్ ముందు ఈటల అబద్ధాలు చెప్పాల్సిన అవసరమేంటి? ఈటల ఆనాలోచితంగా వాంగ్మూలం ఇచ్చారా? అలాంటి పరిస్థితులు వచ్చాయా? తప్పుడు ప్రకటనలతో ఎక్కువ రోజులు మభ్యపెట్టలేరు. కాళేశ్వరంపై సబ్ కమిటీ ఎప్పుడూ నివేదిక ఇవ్వలేదు. వివరాలన్నీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లాను. నేను సుమోటోగా కమిషన్ ముందుకు వెళ్లాను. ప్రాణహితపై మాత్రమే స్టేటస్ రిపోర్టు ఇచ్చాం. పెండింగ్ ప్రాజెక్టులపై మాత్రమే తెలంగాణ ప్రభుత్వం కమిషన్ వేసింది."అని తుమ్మల స్పష్టం చేశారు.



# డ్వాక్రా మహిళలకు లక్ష

విజయవాడ, జూన్ 7

ఆంధ్రప్రదేశ్‌లోని డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రభుత్వం 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. స్త్రీనిధి బ్యాంకు ద్వారా 4% వడ్డీకే రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందిస్తారు. కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులందరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. దీని ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డ్వాక్రా మహిళల పిల్లల చదువు కోసం ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టింది. సెర్ప్ ఆధ్వర్యంలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తారు. ఈ పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా పేరు పెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. ఇది కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులందరికీ వర్తిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణాన్ని పిల్లల చదువు కోసమే ఉపయోగించాలి. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయొచ్చు. సాంకేతిక విద్యకు కూడా ఈ డబ్బును ఉపయోగించవచ్చు. ఊరి నుంచి దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైకిల్ కొనుక్కోవడానికి కూడా అనుమతి ఉంది. డబ్బును దేనికోసం ఖర్చు చేశారో రసీదులు స్త్రీనిధి అధికారులకు ఇవ్వాలి. ఏపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు 4% వడ్డీకే రుణాలు ఇవ్వనుంది. స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం తీసుకోవచ్చు. పిల్లల చదువుకు భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించవచ్చు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం స్త్రీనిధి డ్వాక్రా సభ్యులకు 11% వడ్డీతో రుణాలు ఇస్తోంది. అయితే, పిల్లల చదువు కోసం వడ్డీ రేటును తగ్గించారు. తల్లిదండ్రులు ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డ్వాక్రా మహిళలు రుణాన్ని వాయిదాల రూపంలో చెల్లించవచ్చు. తీసుకున్న మొత్తాన్ని బట్టి కనీసం 24 నెలల నుంచి గరిష్ఠంగా 36 నెలల వరకు గడువు ఉంటుంది. ఈ పథకం కోసం ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రుల చేతిలో డబ్బులు లేక బయట ఎక్కువ వడ్డీలకు తెచ్చి అప్పులపాలవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం.. వారికి



చేయూతగా నిలిచేందుకు కొత్త పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందని భావిస్తున్నారుమరోవైపు రాష్ట్రంలో 138 అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు రూ.11.52 కోట్లు విడుదలకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. పీఎం జన్ మన్ పథకంలో భాగంగా .. ఒక్కో కేంద్రాన్ని రూ.12 లక్షలతో నిర్మించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించేందుకు ఈ చర్యలు చేపట్టింది.

# భారత శక్తి

## జీడీపీ సరే.. జీవన ప్రమాణాల సంగతేంటీ

భారతదేశం 4 ట్రిలియన్ల డాలర్ల జీడిపి మార్క్‌ను దాటి, జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇది గొప్ప విజయమని వేడుక చేసుకుంటున్నారు. కానీ నిశితంగా పరిశీలిస్తే ఆనందాన్ని తగ్గించే ముఖ్యమైన ఆర్థిక సవాళు వెల్లడవుతాయి. ఈ వృద్ధి చేరిక గురించి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. తక్కువ తలసరి జీడిపి ద్వారా దెబ్బతిన్న మైలురాయి భారతదేశం మొత్తం జీడిపి 1.4 బిలియన్లకు పైగా ఉన్న, అధిక జనాభాను ప్రతిబింబిస్తున్నప్పటికీ, దాని తలసరి జీడిపి వేరే కథను చెబుతుంది. భారతదేశం 2,878 డాలర్ల వద్ద ఉంది. జపాన్ 33,138 డాలర్లు, యుకె 55,000 డాలర్లు కంటే చాలా వెనుకబడి ఉంది. ఈ స్పష్టమైన అసమానత ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు సగటు పౌరుడికి చేరడం లేదని, వ్యక్తిగత శ్రేయస్సు కోట్లాది మందికి అందుబాటులో లేదు. రైతాంగం, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగస్థులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారుఆర్థికమాంద్యం సంకేతాలు ఇటీవల డేటాని పరిశీలిస్తే ఆందోళనకరమైన చిత్రాన్ని చిత్రీకరిస్తుంది. గృహ పొదుపులు ఫైనాన్షియల్ ఇయర్ 2020లో 11.61 లక్షల కోట్ల నుంచి ఫైనాన్షియల్ ఇయర్ 25లో 6.52 లక్షల కోట్లకు పడిపోయాయి. ఇది తగ్గిన ఆర్థిక భద్రతను సూచిస్తుంది. ఫైనాన్షియల్ ఇయర్ 25 లో బంగారంపై రుణాలు 71% పెరుగుదల చాలా మంది భారతీయులు ప్రాథమిక అవసరాలను తీర్చడానికి ఆస్తులు రద్దు చేస్తున్నారు అని సూచిస్తుంది. వినియోగదారు మార్కెట్ కూడా ఇబ్బందిపడుతున్నాయి. ఫైనాన్షియల్ ఇయర్ 2025లో ఆటో అమ్మకాలు 6% స్వల్పంగా పెరిగాయి. ద్విచక్ర వాహనం, వినియోగ వస్తువులు (ఎఫ్ఎంసిజి) అమ్మకాలలో మందగమనంతోపాటు, బలహీనమైన డిమాండ్‌ను సూచిస్తున్నాయి. ఆర్థిక బాధ, మానవ నష్టం ఈ నవాళ్ల మానవ నష్టం ఆందోళనకరమైనదిఆర్థిక సంక్షోభం రోజుకు 19 ఆత్మహత్యలతో ముడిపడి ఉంది. ప్రతి గంటకు ఇద్దరు రైతులు తమ ప్రాణాలను బలిగొంటారు. ఈ గణాంకాలు వ్యవసాయంలో లోతుగా పాతుకుపోయిన సమస్యలను విస్తృతమైన ఆర్థిక ఒత్తిడిని సూచిస్తున్నాయి. అప్పు, నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి లక్ష్యంగా చేసుకున్న జోక్యాల అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి. మధ్యతరగతి పోరాటాలు, తక్కువ వేతనాలు భారతదేశ మధ్యతరగతి, తరచుగా ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా పరిగణించబడుతుంది. తీవ్ర ఒత్తిడిలో ఉంది. సగటు మధ్య తరగతి ఆదాయం సంవత్సరానికి రూ. 2.6 లక్షలు (నెలకు రూ. 22,000). ఇది 1820లో వలస రాజ్యాల ముందు భారతదేశంతో పోల్చదగిన స్థాయి. ద్రవ్యోల్బణంతో కలిసిన ఈ స్తబ్ధత కొనుగోలు శక్తిని తగ్గించింది. అదనంగా, భారతదేశం సగటు గంట వేతనం ప్రపంచవ్యాప్తంగా ఐదవ అత్యల్ప స్థానంలో ఉంది. ఇది నైపుణ్యం కలిగిన, నైపుణ్యం లేని కార్మికులను తక్కువ ఆదాయ చక్రంలో బంధిస్తుంది. వ్యవస్థాగత సమస్యలు కఠినమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఆర్థిక కథనం వ్యవస్థాగత సవాళ్లతో మరింత క్లిష్టంగా ఉంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఉద్యోగాలకు పెరుగుతున్న డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర నిరుద్యోగాన్ని సూచిస్తుంది. జనాభాలో దాదాపు 60% మంది 800 మిలియన్లకు పైగా భారతీయులకు ప్రభుత్వం ఉచిత రేషన్ పంపిణీ విస్తృతమైన పేదరికం, ఆహార అభద్రతను హైలైట్ చేస్తుంది. సమగ్ర వృద్ధికి పిలుపు భారతదేశంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం గర్వకారణం అయినప్పటికీ, జీవన ప్రమాణాలను మెరుగుపరచకపోతే జీడిపి పరిమాణం మాత్రవే ఖాళీ కొలమానం అని నిపుణులు తెలుపుతున్నారు. ప్రజల శ్రేయస్సులో పురోగతికి సరైన అర్థం ఉండాలి. దేశంలో కోట్లాది మంది ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతుంటే, దేశం నాలుగవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయింది అని సంబరపడాలా?. విధాన నిర్ణేతలు సమగ్ర వృద్ధిని నిర్ధారించడం, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడం ఆదాయ అసమానతలను పరిష్కరించడం వంటి సవాలును ఎదుర్కొంటున్నారు. ఈ ప్రయత్నాలు లేకుండా, భారతదేశ ఆర్థిక మైలురాయి దాని పౌరుల వాస్తవాల నుండి డిస్‌కనెక్ట్ చేయబడిన గణాంకాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలకు విద్య, ఆరోగ్యం, ఆహారం, పర్యావరణం, మెరుగైన జీవనం, సాధికారత వైపు అడుగులు వేయకుండా కేవలం అంకెల గారడీ నమ్ముకొని సంబరపడితే తీవ్ర అనర్థాలకు దారితీస్తుంది. వాపును చూసుకొని బలమనుకుంటే అంతే సంగతి.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

విజయవాడ, జూన్ 7,

ఆంధ్రప్రదేశ్‌లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లను రాష్ట్రంలో ఆవిష్కరణ, స్టార్టప్‌లు, నైపుణ్య అభివృద్ధి, , ఉపాధి సృష్టిని ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ హబ్‌లు రాష్ట్రంలో సిలికాన్ వ్యాలీ తరహా ఇకోసిస్టమ్‌ను సృష్టించడానికి రూపొందించడానికి ప్లాన్ చేశారు. రాజమండ్రి బొమ్మూరు ప్రాంతంలో ఈ ఇన్నోవేషన్ హబ్ నిర్మాణం జరుగుతోంది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం వంటి ఇతర నగరాలతో పాటు రాజమండ్రి ఒక కీలక కేంద్రంగా ఎంపికైంది. ఈ హబ్‌ను ఈ నెలలోనే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్‌ల ప్రోత్సాహం కోసం ఈ హబ్ ఒక కేంద్రంగా పనిచేయనుంది. యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం , ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ హబ్ ప్రధాన లక్ష్యాలు. ఈ ప్రాజెక్టులో ×× గ్రీన్‌కో ఎనర్జీ , , అవంతి గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు గవర్నింగ్ కమిటీలో భాగస్వాములుగా ఉన్నాయి. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం ద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు. రాజమండ్రిని ఒక స్టార్టప్ కేంద్రంగా మార్చడంలో ఈ హబ్ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. సెంటర్ నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక బాధ్యత కింద దిగ్గజ పారిశ్రామిక సంస్థలు నిధులు సమకూరుస్తాయి. వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వం వంటి వాటిలో ట్రైనింగ్ ఇ ఇస్తారు. పౌర సేవలందించే ప్రభుత్వ కార్యక్రమాలలోనూ ఆర్‌టీఐహెచ్ భాగస్వామ్యం అవుతుంది. భవిష్యత్తు టెక్నాలజీలైన క్వాంటమ్, ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిల్లో స్టార్టప్‌లకు సహకారం అందిస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లోనూ, ఆక్వా, మెరైన్ రంగాల్లోనూ సేవలు అందిస్తుంది. టెక్స్‌టైల్ ఇన్నోవేషన్, అపెరల్, ప్రత్యామ్నాయ ఫైబర్, ఇంధనం, క్లీన్‌టెక్, పునరుత్పాదక ఇంధన రంగాలు, లైఫ్‌సైన్స్, ఫార్మా అండ్ హెల్త్ రంగాలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని ప్రభుతవం చెబుతోంది. పట్టణ రవాణా, సముద్ర రవాణా, సామాజిక వ్యాపారం, గ్రామీణ ఔత్సాహిక మహిళా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు శిక్షణను ఇస్తుంది. ఏపీలో ఐదు సంవత్సరాల్లో 20,000 స్టార్టప్‌లను ఏర్పాటు చేస్తారు. ఇందులో తయారీ, సాంకేతిక వ్యవసాయం, టెక్స్‌టైల్స్, డిజిటల్, క్లీన్ ఎనర్జీ, ఆరోగ్య రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఒక్కో స్టార్టప్‌లోనూ రూ. 10 లక్షల నుంచి కోటి రూపాయల దాకా మొత్తంగా రూ. 1,000 కోట్ల పెట్టుబడులు సమీకరిస్తారు. ఈ స్టార్టప్‌ల్లో మహిళలకు, యువత, నైపుణ్యం కలిగినవారికి ప్రాధాన్యం ఇస్తారు. స్టార్టప్‌లతో వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది.

## ఈ ఏడాది నుంచే విద్యార్థులకు అందుబాటులోకి రానున్న బాలుర గురుకుల పాఠశాల

బ్రహ్మంగారిమఠం

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కృషితో ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తొట్లపల్లె నందలి బాలుర గురుకుల పాఠశాల అందుబాటులోకి రానున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలిపారు శనివారం పలు శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహా గురుకులం బాలుర పాఠశాలలో సందర్శించారు ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మా ప్రియతమ నేత

మైదుకూరు ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ గారి ఆదేశాల మేరకు బ్రహ్మంగారిమఠం మండలం తొట్లపల్లె నందలి డాక్టర్.బి. ఆర్. అంబేద్కర్ మహా గురుకులం బాలురు స్కూల్ ను సందర్శించి అక్కడ చేపట్టవలసిన అభివృద్ధి పనుల కొరకు సంబంధిత అధికారులతో చర్చించామని మండల అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బా రెడ్డితెలిపారు

పాఠశాల నందు కావాల్సినటువంటి విద్యుత్ సరఫరా, రోడ్లు, క్రీడా మైదానం మరియు నీటి సౌకర్యం తదితర పనులు వెంటనే ప్రారంభించి ఈ నెల 12 వ తేదీలోపు పూర్తి చేయవలసినదిగా సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే గారు ఆదేశించారని ఆయన తెలిపారు ఈకార్యక్రమంలో

విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు మైదుకూరు ఏఈ శ్రీకాంత్, బద్వేల్ ఏఈ కుళాయప్ప , పంచాయతీరాజ్ ఆఇ మధు, కాంట్రాక్టర్ సందీప్, ప్రిన్సిపాల్ ఉమ మహేష్ మరియు టీడీపీ నాయకులు నాగయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు

# ఆ పది మంది నేతలేనా....

విజయవాడ, జూన్ 7,

అధికారంలో లేనప్పుడు గుర్తింపును నేతలు కోరుకుంటారు. ఈసారి అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మంత్రి పదవి దక్కుతుందని భావిస్తారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా యాక్టివ్ గా ఉన్న నేతలకు ఈసారి చంద్రబాబు కేబినెట్ లో ఎక్కువ మందికి అవకాశం దక్కిందంటారు. నిమ్మల రామానాయుడు, సవిత, హోంమంత్రి వంగలపూడి అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్ లాంటి వారికి చంద్రబాబు మంత్రివర్గంలో అవకాశం ఇచ్చారు. వీరంతా కేవలం గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యాక్టివ్ గా ఉండి, అనేక కేసులు ఎదుర్కొనడమే కాకుండా తెగించి పోరాటం చేయడమే కాకుండా పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడాలనే ఈ అవకాశం ఇచ్చారు.. జర జాగ్రత్త పోరాడిన వారికి... సామాజికవర్గాలను కొంత తూకం పాటించినా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాడిన వారికి ఖచ్చితంగా అధికారంలోకి వస్తే ప్రాధాన్యత దక్కుతుంది. అది రాజకీయాలను గమనిస్తున్న వారికి ఎవరికైనా తెలుసు. కానీ వైసీపీలో మాత్రం నేతలు అలా యాక్టివ్ గా ఉండేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. అధికారంలోకి వచ్చినా తమకు మంత్రి పదవి అవసరం లేదన్న భావనలో ఉన్నట్లుంది. కొందరు మాత్రమే యాక్టివ్ గా ఉంటున్నారు. ఆర్కే రోజా, అంబటి రాంబాబు, పేర్ని నాని, కారుమూరి నాగేశ్వరరావు, గుడివాడ అమర్ నాథ్, భూమన కరుణాకర్ రెడ్డి లాంటి వాళ్లు మాత్రమే యాక్టివ్ గా ఉంటున్నారు. మిగిలిన వారు పెద్దగా కనిపించడం లేదు. అంతే కాదు పార్టీ పిలుపు నిచ్చిన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మినహా వారి భాగస్వామ్యం అంతగా లేదు. నేతల పెర్ ఫార్మెన్స్ చూసి... ఇప్పుడ వైసీపీ అధినేత జగన్ ఈ విషయంలో ఒకింత సీరియస్ గానే ఉన్నారని తెలిసింది. అన్ని నియోజకవర్గాల నుంచి నేతల పెర్ ఫార్మెన్స్ పై నివేదికలను తెప్పించుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల అంటే జూన్ 4వ తేదీన వైఎస్ జగన్ ఏపీ వ్యాప్తంగా వెన్నుపోటు దినంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. కానీ అందులో కొందరు నేతలు అలా వచ్చి ఇలా వెళ్లారని తెలిసింది. కేవలం పది మంది వరకూ నేతలు మాత్రమే బాగా కష్టపడి కార్యకర్తలను సమీకరించడంలో కానీ, జనంలోకి తమ కార్యక్రమాన్ని తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారని వైఎస్ జగన్ కు నివేదికలు అందినట్లు తెలిసింది. మిగిలిన వారు కొందరు అసలు కార్యక్రమంలో పాల్గొనకుండా తమ ముఖ్య అనుచరులచేత మమ అనిపించి ఫొటోలు కేంద్ర కార్యాలయానికి పంపినట్లు పసిగట్టారు.. దీంతో మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే ఈసారి కష్టపడిన నేతలకు మాత్రమే కేబినెట్ లో స్థానం కల్పించే అవకాశముందన్న ప్రచారం ఊపందుకుంది. అయినా నేతలు మాత్రం కేసులకు భయపడి బయటకు రావడం లేదు. 175 నియోజకవర్గాల్లో కేవలం ఇరవై నుంచి పాతిక నియోజకవర్గాల్లోనే నేతలు యాక్టివ్ గా ఉన్నట్లు వైసీపీ అధినేతజగన్ కు అందిన నివేదికలలో తేలిందని తెలిసింది. ఈ నివేదికలను చూసిన జగన్ కూడా ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారట. రాయలసీమ ప్రాంతంలో కూడా కొందరు నేతలు బయటకు రాకపోవడంపై జగన్ సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. వారిని పిలిచి క్లాస్ పీకాలా? లేక ప్రత్యామ్నాయంగా మరొక నేతకు నియోజకవర్గ బాధ్యతలను అప్పగించాలన్న దానిపై ఆలోచిస్తున్నారని పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు.

## 3318 అయుష్మాన్ ఆరోగ్య మందిర్ లకు 1060 కోట్లు

విజయవాడగత సంవత్సర కాలంలో మంత్రిత్వ శాఖ చేసిన కృషి, విజయాల్ని వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ మీడియాకు వివరించారు. విజయవాడ, గుణదలలోని హోటల్ హయత్ ప్లేస్ లో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినందున చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని వివరించారు. ఇన్సెంటివ్ కింద ఎన్ హెచ్ ఎం నుండి కేంద్రం రూ. 100 కోట్లు ఇచ్చింది. 3318 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లకు రూ. 1060 కోట్లు కేంద్రం ఇవ్వనుందని మంత్రి అన్నారు.

## కాంక్రీట్ పిక్కలో మృతదేహం

పెందుర్తిపెందుర్తి మండలం లో దారుణం జరిగంది. ముదపాక జగనన్న కాలనీలోఇంటి నిర్మాణం కోసం వేసిన కాంక్రీట్ పిక్క కుప్పలో వ్యక్తి మృతదేహం లభ్యం అయింది.

జగనన్న కాలనీ నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కాంక్రీట్ పిక్క కుప్పలో మృతదేహం లభ్యం కాగ, పెందుర్తి పోలీసులు క్లూస్ టీం ఘటనా స్థలం చేరుకున్నారు. మృతుడు విజయనగరం జిల్లా నల్లబంద గ్రామానికి చెందిన పక్కి సూరి (50) గా స్తానికులు గుర్తించారు. సూరి గత మూడు రోజుల నుండి కనబడలేదని స్థానికులు, కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

# అనకాపల్లిలో నేతల ఎత్తులు

కాకినాడ, జూన్ 7,

అనకాపల్లిలోనే అసలు కథంతా నడుస్తుంది. ఇక్కడ కూటమి పార్టీలకు చెందిన ముగ్గురు నేతల మధ్య పెద్దగా సఖ్యత లేనట్లు కనిపిస్తుంది. గత ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలసి ఆంధ్రప్రదేశ్ లో పోటీ చేశాయి. అయితే అనకాపల్లి విషయానికి వచ్చే సరికి శాసనభకు జనసేన నుంచి సీనియర్ నేత కొణతాల రామకృష్ణ పోటీ చేశారు. ఇక అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా బీజేపీకి చెందిన సీఎం రమేష్ ఉన్నారు. ఇక టీడీపీ నుంచి కూడా దాడి వీరభద్రరావు వంటి నేత ఉన్నారు. ముగ్గురి నేతల మధ్య మాత్రం సమన్వయం లేనట్లు కనిపిస్తుందంటున్నారు. పార్టీ క్యాడర్ విషయంలోనూ ఒకింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాన్న ఫిర్యాదులు మూడు పార్టీల కేంద్ర కార్యాలయాలకు అందుతున్నట్లు తెలిసింది. విస్తుపోతున్న లీడర్లు ఎంపీగా ఉన్నప్పటికీ... అనకాపల్లి పార్లమెంటు సభ్యుడిగా సీఎం రమేష్ కడప నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేసి కూటమికి వీచిన హవాతో గెలుపొందారు. ఆయన అనకాపల్లిలోనే పూర్తి స్థాయి రాజకీయాలు కేంద్రీకరించరు. ఆయన అనుచరులు అక్కడ పెత్తనం చేస్తున్నారని చెబుతున్నారు. సీఎం రమేష్ అప్పుడప్పుడు అనకాపల్లికి వస్తున్నప్పుడు మాత్రం అందరినీ కలుస్తూ ఆయన కూటమి పార్టీల నేతల మధ్య విభేదాలు లేకుండానే చేస్తున్నారు. కానీ ఆయన అనుచరులమని చెప్పుకునే కొందరు మాత్రం సీఎం రమేష్ పేరు చెప్పుకుని కొన్ని పనులు తీసుకోవడంతో పాటు సిఫార్సులు చేయడంలో ముందుండటంతో పాటు పదవుల విషయంలోనూ వారికే ప్రాధాన్యత దక్కుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి ఇక సీనియర్ నేత కొణతాల రామకృష్ణ అనకాపల్లి నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచారు. గత ఎన్నికలకు ముందు ఆయన వైసీపీలో చేరి టిక్కెట్ తెచ్చుకోగలిగారు. తర్వాత ఆయనకు కేబినెట్ లో చోటు దక్కలేదు. కొణతాల రామకృష్ణ అనకాపల్లి ఎమ్మెల్యే అయినప్పటికీ ఉత్తరాంధ్ర సమస్యలపై గతంలో ఎక్కువ ఫోకస్ పెట్టేవారు. ఉత్తరాంధ్రకు సాగు, నీరు అందించే ప్రాజెక్టును తీసుకు రావాలని కొంతకాలం ఉద్యమాన్ని కూడా నిర్వహించిన కొణతాల ఆయన ఎక్కువగా ఆ ప్రాంత సమస్యలపైనే ఫోకస్ పెట్టారట. అయితే కొణతాల రామకృష్ణ ఎక్కువగా విశాఖపట్నంలో ఉండటంతో అనకాపల్లిలో ఆయన ప్రధాన అనుచరులు హవా కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అనేక పార్టీలు మారిన సీనియర్ నేత దాడి వీరభద్రరావు సయితం తనకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎలాంటి పదవులు రాకపోవడంపై అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. అందుకు సీఎం రమేష్, కొణతాల రామకృష్ణ కారణమని ఆయన నమ్ముతున్నారు. సీఎం రమేష్ తో కాకపోయినా కొణతాల తో దాడి వీరభద్రరావు విభేదాలు ఈనాటివి కావు. దాడి వీరభద్రరావు బహిరంగంగానే కొణతాలపై విమర్శలు చేస్తుండటం, పార్టీ పదవులను కూడా టీడీపీ వారికి దక్కకుండా చేస్తున్నారని, చివరకు తమ కుటుంబాన్ని పక్కన పెట్టిన విషయంలోనూ కొణతాల ఉన్నారని దాడి వీరభద్రరావు అనుమానిస్తున్నారు. అందుకే మూడు పార్టీల నేతల మధ్య విభేదాలు అనకాపల్లిలో మూడు ముక్కలాటగాతయారైందంటున్నారు.

# నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రతి సంవత్సరం జూన్ 8న ప్రపంచవ్యాప్తంగా సముద్ర దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సముద్ర రక్షణ గురించి ప్రజల్లో అవగాహన పెంచడంకోసం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. 1992లో బ్రెజిల్ లోని రియో డి జనీరోలో జరిగిన ధరిత్రి సదస్సులో సముద్రాలమీద కూడా అవగాహన పెంచడంకోసం ప్రతి ఏటా సముద్ర దినోత్సవం జరపాలని కెనడా ప్రతిపాదించగా, దాని ప్రకారం కొన్ని ఐరోపా దేశాలు నామమాత్రంగానే సాగర దినోత్సవాన్ని నిర్వహించాయి. 2005లో సునామీ వచ్చినపుడు జరిగిన అనర్థాలను దృష్టిలో ఉంచుకొని ఐక్యరాజ్యసమితి 2008, జూన్ 8న తొలిసారిగా ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహించింది. సముద్రంలో దొరికే వివిధ రకాల వస్తువుల సేకరణ, బీచ్, ఒడ్డును కాపాడుకోవడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి బీచ్‌ను శుభ్రం చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం, ప్రతి ఒక్క దేశం, ప్రతి ఒక్కరూ సాగరశాస్త్రానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంచుకోవడం, సముద్రాలను కాపాడుకునే దిశగా ప్రపంచ దేశాలు తమ విధానాలు నిర్ణయించుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

# 500 మంది జనాభా 3 కిలోమీటర్ల దూరం ఉంటేనే కొత్త పంచాయితీ.

హైదరాబాద్‌కొత్త పంచాయతీల ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది గత ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు పంచాయతీలు ఏర్పాటు చేయడంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయని ఆరోపిస్తున్నది.

ఈ మేరకు కొత్త పంచాయతీల ఏర్పాటుకు పక్కా గైడ్లెన్స్ రూపొందించి ముందుకెళ్లాలని నిర్ణయించింది. ప్రధానంగా 500 కంటే తక్కువ జనాభా ఉన్న పల్లెలను పంచాయతీలుగా మార్చడంతో ప్రభుత్వానికి అదనపు భారమే తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని ఆఫీసర్లు చెప్తున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త పంచాయతీల ఏర్పాటు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి పెద్దసంఖ్యలో ప్రతిపాదనలు వచ్చాయి. కొత్త పంచాయతీలు ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల టైమ్లో హామీ ఇచ్చినట్లు నేతలు చెప్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై వీళ్లంతా ఒత్తిడి తీసుకొస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీల కోసం 250 వరకు పంచాయతీరాజ్శాఖకు దరఖాస్తులు వచ్చాయి. అప్లికేషన్లతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సు లేఖలు కూడా జతచేసి ఉన్నాయి. దీనిపై పంచాయతీ రాజ్యాధి అధికారులు క్షేత్రస్థాయి నుంచి వివరాలు తెప్పించారు. చాలా దరఖాస్తులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లేకపోవడంతో పెండింగ్ లో పెట్టినట్లు తెలిసింది.

3 కిలో మీటర్ల దూరం ఉండాలి:

రాష్ట్రంలో ప్రస్తుతం 12,777 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్త పంచాయతీల కోసం సుమారు 250 దరఖాస్తులు రాగా.. అందులో 37 గ్రామాల్లో మాత్రమే 500 జనాభా ఉన్నట్లు తేలింది. మిగిలిన గ్రామాల్లో 500లోపు జనాభా ఉంది. వికారాబాద్ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో కేవలం 90 కుటుంబాలు ఉన్న ఓ పల్లెను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని అక్కడి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ పంపినట్లు తెలిసింది.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయాలంటే కనీసం 500 జనాభా ఉండాలని, పల్లెకు, పల్లెకు మధ్య 3 కిలో మీటర్ల దూరం ఉండాలని పంచాయతీరాజ్ చట్టంలో స్పష్టంగా ఉంది. దీంతో ఇలాంటి దరఖాస్తులను పెండింగ్ లో పెట్టారు. త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కొత్త పంచాయతీల ఏర్పాటు సాధ్యం కాదని పంచాయతీరాజ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# రాజధాని మహిళల నిరసన

అమరావతితుళ్లూరు లో రాజధాని మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. సాక్షి ఛానల్ తో పాటు కృష్ణంరాజు అనే వ్యక్తి పై ఫిర్యాదు చేసారు. కృష్ణంరాజు, అమరావతి మహిళల పై అసభ్యంగా మాట్లాడారని ఆరోరపించారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. కృష్ణంరాజు తో పాటు సాక్షి ప్రతినిధి కొమ్మినేని చిత్ర పటాలను చెప్పుతో కొట్టి నిరసన వ్యక్తం చేసారు.

# శత్రువులు ఎక్కడో ఉండరు... టీడీపీ నేతలకు పక్కలో బల్లెంగా నేతలు

గుంటూరు, జూన్ 7, (

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుంది. ఈ ఏడాదిలోనే తెలుగుదేశం పార్టీకి చెందిన అనేక మంది కార్యకర్తలు, నేతలు హత్యకు గురయ్యారు. అయితే అనేకచోట్ల టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఈ హత్యలకు కారణమని గుర్తించారు. ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరి హత్య కేసును పరిశీలించినా, తర్వాత జరిగిన పల్నాడు జంట హత్య కేసులను చూసినా.. తర్వాత తాజాగా అనంతపురంలో టీడీపీ నేత సుధాకర్ నాయుడు హత్యకు కుట్ర కోణం పరిశీలించినా వీటి వెనక ఒకే పార్టీకి చెందిన నేతలుండటం విశేషం. ఆధిపత్య పోరు, అనేక విషయాల్లో భాగస్వామ్యం మధ్య తలెత్తిన విభేదాలు వంటివి ఈ ఘటనలకు కారణాలుగా చెబుతున్నారువీరయ్య చౌదరి హత్యను పరిశీలిస్తే మద్యం, ఇసుకతో పాటు అనేక కాంట్రాక్టు పనులకు తమకు అడ్డుతగులుతున్నారని సొంత సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలే హత్యచేయించారు. పల్నాడు జంట హత్యలు చేసింది కూడా టీడీపీ నేతలే. అయితే దీని వెనక వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు అతని సోదరుడు ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ జంట హత్యలకు పాల్పడింది మాత్రం టీడీపీకి చెందిన వారే కావడం విశేషం. ఇక తాజాగా అనంతపురంలో సుధాకర్ నాయుడును హత్య చేయడానికి భారీ స్కెచ్ వేశారు. దీని వెనక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు ఉన్నారన్న ఆరోపణలు బలంగా వినిపించడంతో అధినాయకత్వం కూడా సీరియస్ అయింది. గత ఎన్నికల్లో ప్రభాకర్ చౌదరిని కాదని దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు అధినాయకత్వం టిక్కెట్ ఇచ్చింది. కూటమికి గత ఎన్నికలలో ఫుల్లు హవా రావడంతో దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎన్నికయ్యారు. మొన్నటి ఎన్నికల్లో దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ గెలుపు కోసం సుధాకర్ నాయుడు తీవ్రంగా శ్రమించారు. సుధాకర్ నాయుడుకు కూడా దగ్గుబాటి ప్రసాద్ ఎన్నికల సమయంలో ప్రాధాన్యత ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. ఇద్దరూ టీడీపీ నేతలే కావడంతో పెద్దలకు ఈ సమాచారాన్ని పోలీసులు అందించారు. సుధాకర్ నాయుడును ఎస్పీ జగదీశ్ పిలిచి విచారించారు. సుధాకర్ నాయుడును హత్య చేసేందుకు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచరులు ప్లాన్ చేశారని పోలీసులు రహస్యంగా విచారణ జరిపి నివేదిక పంపారు. దీంతో ఇద్దరు టీడీపీ నేతలు కావడంతో పాటు ఇద్దరి నేతల అవసరం పార్టీకి ఉండటంతో టీడీపీ నాయకత్వం అమరావతికి రావాలని పిలిచినట్లు తెలిసింది. ఇద్దరిలో ఎవరిది తప్పు అన్నది తేల్చి క్లాస్ పీకే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాణాలు తీసుకునేంత స్థాయిలో విభేదాలు ఎందుకు వస్తున్నాయన్న దానిపై ప్రస్తుతం టీడీపీ నాయకత్వం దృష్టి పెట్టింది. ఇసుక, మద్యం వ్యాపారాలతో పాటు మరికొన్ని కాంట్రాక్టు పనుల విషయంలోనే వివాదాలు పెరిగి అవి కక్ష పెంచుకునేందుకు దారి తీస్తున్నాయని భావించిన అధినాయకత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి పరిస్థితులు ఉన్న చోట్ల ముందు జాగ్రత్తలు తీసుకుని నేతల మధ్య విభేదాలను తొలగించే బాధ్యతను ఇన్ చార్జి మంత్రులకు అప్పగించే అవకాశముంది.

# బిల్డర్లకు అదిరిపోయే గుడ్ న్యూస్

నెల్లూరు, జూన్ 7,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాభివృద్ధి కోసం బిల్డర్లకు బంపరాఫర్ ప్రకటించింది. బహుళ అంతస్తులకు సంబంధించిన డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ ఛార్జీలను బిల్డర్లు ఇకపై వాయిదా పద్ధతిలో చెల్లించే అవకాశం కల్పించింది. ఇంపాక్ట్ ఫీజు, లేబర్‌సెస్ వంటివి విడతలవారీగా వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం డెవలప్‌మెంట్, బెటర్‌మెంట్ ఛార్జీలను కూడా ఇదే పద్ధతిలో చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. దీనికి సంబంధించి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం రూ.15 లక్షలలోపు ఫీజులైతే ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది.. రూ.15 లక్షల నుంచి రూ.75 లక్షలలోపు ఫీజు 12 నెలల్లో నాలుగు విడతలుగా చెల్లించాల్సి ఉంటుంది.. 12% వడ్డీ ఉంటుంది. అలాగే రూ.75 లక్షలపైన ఉంటే 24 నెలల్లో 8 వాయిదాల్లో 12% వడ్డీతో సమాన వాయిదాల్లో చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బహుళ అంతస్తుల నిర్మాణ ప్రాంతంలో ఇప్పటివరకూ 10% పురనగరపాలక సంస్థలకు తనఖా పెడుతున్నారు.. ఇకపై 15 శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకేసారి ఛార్జీలను చెల్లించాల్సి రావడం తమకు ఆర్థికంగా ఇబ్బంది అవుతోందని.. ఈ రుసుముల్ని వాయిదా పద్ధతిలో జమ చేసే అవకాశం కల్పించాలని ఇటీవల ప్రభుత్వాన్ని బిల్డర్లు రిక్వెస్ట్ చేసింది. వెంటనే ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుంది. ఛార్జీల పెంపుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ స్వాగతించారు, హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బహుళ అంతస్థుల యజమానులకు ఊరట దక్కనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్, బిల్డర్ల కోసం కీలక నిర్ణయాలు తీసుకుంది. భవన నిర్మాణాలతో పాటుగా పన్నుల చెల్లింపుల విషయంలో కొన్ని వెసులుబాటు కల్పించారు. తాజాగా రుసుముల చెల్లింపుల విషయంలో కూడా వెసులుబాటు కల్పించారు. బిల్డర్లు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆనందంలో ఉన్నారు.. ఈ రుసుముల్ని వాయిదాల పద్ధతిలో చెల్లించడం తమకు సులభంగా ఉంటుందని

===============

# 5 లక్షల మందితో యోగా

విశాఖపట్టణం, జూన్ 7

జూన్ 21వ తేదీన ప్రధాని మోదీ ఆధ్వర్యంలో విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఏపీ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అక్కడ ఒకేరోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా ఈవెంట్ చేపట్టనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజును భారీ స్థాయిలో యోగా కార్యక్రమాలను చేపట్టనుంది. విశాఖలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకానున్నాయి. ఒక్క విశాఖలోనే ఒకే రోజు 5 లక్షల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం ఉంది. 25 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందజేయాలని భావిస్తోంది. ఇదే విషయాన్ని తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. యోగా మన జీవితంలో భాగం కావాలని? ఆయుష్ ద్వారా యోగాను ప్రతి ఒక్క ఇంటికి చేర్చేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. లక్ష కేంద్రాల్లో యోగా సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా యోగా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నారు. విశాఖపట్నంలోని ఆర్‌కె బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు జరిగే యోగా ప్రదర్శనలో భారీ ఎత్తున ప్రజలు భాగస్వాములవుతారని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రధాన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో 2 కోట్ల మందిని భాగస్వాములను చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పేర్ల నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే కోటిపైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 నాటికి 2 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ఇలా?.

యోగాంధ్ర కార్యక్రమంలో భాగమయ్యేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందుకోసం ముందుగా వెబ్ సైట్ లోకి వెళ్లాలి. ఇక్కడ ఫామ్ అందుబాటులో ఉంటుంది. మీ వివరాలను నమోదు చేయాలి. జూన్ 21న నిర్వహించే యోగా కార్యక్రమంలో ఎక్కడ పాల్గొంటారనేది సెలెక్ట్ చేయాలి. ఓటీపీ ప్రాసెస్ తర్వాత? రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

# నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతత

కాకినాడ

వివిధ వృత్తులలో పని చేస్తున్న ప్రతి ఒక్కరు నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన 5000 మందితో ప్రత్యేక యోగా కార్యక్రమం శనివారము కాకినాడ మెయిన్ రోడ్డు టూ టౌన్ పోలీస్ నుంచి ఎల్ఐసీ బిల్డింగ్ సెంటర్ వరకు నిర్వహించారు.

ఈయోగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ మానిష్ పాటిల్ దేవరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావు, పాడా పీడీ చైత్ర వర్షిణి, కాకినాడ ఆర్డీవోఎస్.మల్లిబాబు తదితరులు యోగాసనాలు సాధన చేశారు.

ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత నెల మే 21 నుంచి ఈ నెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నమన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి ఇప్పటివరకు 8.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం జిల్లాలో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల ఉపాధ్యాయులతో భారీ స్థాయిలో యోగా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 7 వేల మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ యోగ సాధన కేవలం అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు వరకు మాత్రమే పరిమితం కాకుండా నిత్య జీవితాల్లో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగాను రోజు సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతోపాటు వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారు మరింత సమర్థతతో విధులు నిర్వర్తించేందుకు యోగ దోహద పడుతుందని ఆయన తెలిపారు.

జిల్లా అంతటా ఈ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతొందని తెలిపారు. జూన్ 21న జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో యోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రోజు జరిగిన యోగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగానికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులను ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లా అధికార యంత్రాంగానికి పూర్తి సహకారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు. ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం మాట్లాడుతూ..మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంల్లో భాగస్వామ్యం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్క పౌరుడికి ఆరోగ్యం చాలా అవసరమని, నిత్యం వివిధ రకాల మందులు వాడుతూ ఆరోగ్యం పాడు చేసుకోకుండా యోగ సాధన చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. గౌరవ దేశ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో దృఢ సంకల్పంతో యోగ కార్యక్రమాలు నిర్వహించుకోవడం శుభ పరిణామని ఆయన తెలిపారు. యోగ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో అత్యంత ప్రతిష్టంగా నిర్వహిస్తున్న జిల్లా అధికార యంత్రాంగాన్ని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర మంతట పండుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి.. పరిశుభ్రత, పచ్చదనం వంటి కార్యక్రమాలతో పాటు అందరి ఆరోగ్యంపైన కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తు యోగాంధ్ర కార్యక్రమం కార్యక్రమాన్ని ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ గుర్తు చేశారు. మన పూర్వీకులు యోగాను సాధన చేయడం ద్వారానే ప్రశాంతమైన జీవనాన్ని గడిపారన్నారు.

# నేటి నుండి మృగశిర కార్తె ప్రారంభం

## -మృగశిర కార్తె రోజు చేపలు ఎందుకు తింటారో తెలుసా..? -అసలు కారణం ఏమిటి..?

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

జూన్ 8 నుంచి మృగశిర కార్తె ప్రారంభం కానుంది. ఈ కార్తె రోజు ప్రతి ఇంట్లో చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీని వెనుక ఆరోగ్య రహస్యం దాగివుంది. రోళ్లు పగిలే ఎండలను మోసుకొచ్చిన రోహిణికార్తె ముగిసి.. చల్లబరిచే మృగశిర మొదలవుతుంది. మృగశిర కార్తె అంటే.. ఆశ్విని మొదలుకుని రేవతి వరకూ మనకున్న 27నక్షత్రాల్లో సూర్యుడి ప్రవేశం ఆధారంగా కార్తె నిర్ణయం జరుగుతుంది. భారతీయ జ్యోతిష సాంప్రదాయం ప్రకారం.. ఒక్కో కార్తెలో ఒక్కో విధంగా ప్రకృతిలో మార్పులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించి నాటి నుంచి నైరుతి రుతుపనాలు వస్తాయి. వాతావరణం ఒక్కసారి చల్లబడటం, ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకునే నేపథ్యంలో అనేక రకాల చెడు సూక్ష్మక్రిములు వంటివి పునురుత్పత్తి అవుతాయి. మానవునిలో రోగ నిరోధకశక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయి. మృగశిర కార్తెలో చేపలు తినడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపించబడింది. చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు, ఆస్తమా, మధుమోహ వ్యాధి ఉన్న వారు, గర్భిణులు ఈ సమయంలో చేపలు తింటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఈ నేపథ్యంలో మనిషి శరీరంలో మార్పులు జరిగి వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. గుండెజబ్బులు, ఆస్తమా తదితర అనారోగ్యసమస్యలు ఉత్పన్నమవుతాయి. వీటన్నింటికి అడ్డుకట్ట వేయాలంటే చేపలు తినాల్సిందే. అసలు మృగశిర కార్తెకు ఉన్న సంబంధం ఏమిటి..?వ్యాధుల నియంత్రణకు చేపలు మృగశిర కార్తె రోజు చేపలు ఎందుకు తింటారో తెలుసా..? రోకండ్లను సైతం పగులగొట్టే ఎండలు తగ్గిపోతాయి. వర్షాలు మొదలవుతాయి. 15 రోజుల పాటు ఈ కార్తె ఉంటుంది. మృగశిర కార్తె చేపలు తినడాన్ని మన పూర్వీకుల నుంచి ఆనాదిగా వస్తోంది. ఎండకాలం తర్వాత వాతావరణం చల్లబడటంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఈ క్రమంలో వేడి ఉండేందుకు చేపలను తింటారు. దీని వల్ల గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. ఇదేకాక ఈ సీజన్‌లోచాలా మందికి జీర్ణశక్తితోపాటు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంటుంది. జ్వరం, దగ్గు బారిన పడతారు. ఇలాంటి నుంచి గట్టెక్కాలంటే చేపలు తినాల్సిందే. పూర్వీకులు శాఖాపరమైన ఇంగువను బెల్లంలో కలుపుకొని ఉండలు.. ఉండలుగా చేసుకుని తినేవారు. మాంసాహారులైతే చేపలను ఇంగువలో, చింత చిరుగులో పెట్టుకుని తినేవారు. ఈ రోజు ఏ ఇంటా చూసినా చేపల పులుసే. చేపల కూర వంటకాలే కనిపిస్తుంటాయి. పులుసో, ఫ్రై చేసుకుని ఖచ్చితంగా తింటుంటారు. చేపలలో పోషకాలు: చేపలలో ఎన్నో పోషకాలున్నాయంటున్నారు వైద్య నిపుణులు. చేపలలో అనేకమైన మాంసకృతులతో పాటు శరీరానికి మేలు చేసే గుణాలు ఎన్నో ఉన్నాయి. కాల్షియం, పాస్పరస్, ఐరన్, మెగ్నీషియం, కాపర్, జింక్ వంటి ఖనిజ పోషకాలు ఎన్నో లభిస్తాయి. చేపలు కొవ్వులు చాలా సులభంగాజీర్ణమై శక్తిని అందిస్తాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎవరైనా తినవచ్చు. చేపల్లో ఉన్న కొవ్వు మన శరీరంలో రక్త పీడనంపై మంచి ప్రభావం చూపుతాయి. ఓమేగా 3 కొవ్వు ఆమ్లాలలో డీహెచ్ఏ, ఈపీఏ వంటివి కంటి చూపునకు ఎంతో మేలు చేస్తాయి. అలాగే జ్ఞాపకశక్తిని కూడా పెంచుతాయి. చేపల్లో బీ12 విటమిన్, రైబోఫ్లవిన్, నియాసిన్, బయెటిక్, థయామిన్ తదితర విటమిన్లు లభిస్తాయి. సముద్ర చేపల కాలేయంలో విటమిన్ఏ,డీ, ఈ వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. చేపలు గుండెకు సంబంధిత వ్యాధులకు, ఆస్తమా, షుగర్ వ్యాధి గ్రస్తులకు మంచి ఆహారంగా పని చేస్తుంది. ముఖ్యంగా గర్భిణులు, పిల్లల తల్లులకు ఎంతో మేలు. పిల్లల్లో జ్ఞాపకశక్తి, నాడీ వ్యవస్థ అభివృద్ధి చేస్తాయి చేపలు. మన రాష్ట్ర చేపల్లో కొర్రమీనులో లభించే ఆరాఖిడోనిక్ ఆమ్లం ఉంటుంది. ఇది గాయాలైనప్పుడు రక్తం తొందరగా గడ్డకట్టించే స్వభావం ఉంటుంది.

# హైదరాబాద్ చేరుకున్న కేటీఆర్

హైదరాబాద్ జూన్ 7,

టిఆర్ఎస్ నేత మాజీ మంత్రి కేటీఆర్ లండన్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోగ్యం క్షీణించడంతో అర్ధాంతరంగా తన పర్యటన ముగించుకొని వచ్చారు. ఇదే విషయం మీడియా వివరణ కోరగా వద్దులే అంటూ వెళ్లిపోయారు

# కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఇద్దరు మృతి

మేడ్చల్ జూన్ 7,

ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ లో కరెంటు స్తంభాన్ని హ్యుండాయ్ క్రెటా కారు ఢీ కొట్టింది. కారులో నలుగురు వ్యక్తులు భార్గవ్ యాదవ్, వర్షిత్, ప్రవీణ్, దినేష్ వున్నారు. ఈ ప్రమాదంలో భార్గవ్ యాదవ్, వర్షితులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రవీణ్ కు తీవ్ర గాయాలు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దినేష్ కు ఎలాంటి గాయాలు కాలేదు. మృతవదేహాలను గాంధీ హాస్పిటల్ కి తరలించారు. వీరంతా ఎదులాబాద్ లోని విహారి ఫామ్ హౌస్ లో బస చేసినట్లు సమాచారం.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్ధనలు

కడప జూన్ 7,

త్యాగం, కరుణ, సహనాన్ని చాటిచెప్పే బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు కడప జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దీంతో జిల్లాలో ఉండే ఈద్గా మొత్తం ముస్లిం సోదరులతో కిక్కిరిసి పోయాయి. కడప నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న ఈద్గాలో ఈదుల్ ఆదా నమాజు, ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. తరువాత ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు ఆలింగణం చేసుకుని, ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

# త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.

,గోదావరిఖని:

త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని శనివారం శారదా నగర్, రామగుండం, ఫోరిక్లయిన్ ఈద్గాలల్లో జరిగిన బక్రీద్ కార్యక్రమంలో పాల్గొని ముస్లిం సోదరులతో కలసి ప్రార్థనలు చేశారు.. ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బక్రీద్ అనేది



త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కి విధేయతకు ప్రతీక. ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) చేసిన త్యాగం మనందరికి నిస్వార్థత, ధైర్యం, భక్తి అనే విలువల్ని గుర్తు చేస్తుంది. ఈ పండుగ సారాంశం మనం పంచుకునే ప్రేమలో, సహనంలో, మానవత్వంలో ఉంటుంది.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోంది. ఆయన దృష్టిలో ప్రతి మతస్తుడూ సమానంగా గౌరవించబడతాడు. మైనారిటీల కోసం విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో అనేక పథకాలు తీసుకొచ్చారు. ముస్లిం సోదరులకు కావలసిన మౌలిక వసతులు, మసీదు అభివృద్ధి, గురుకుల పాఠశాలలు ప్రభుత్వం ప్రాధాన్యతగా చూస్తోందాని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రామగుండం నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

రామగుండం నియోజకవర్గంలో ఉన్న ఈద్గాలు కామ్రస్థాన్ ల అభివృద్ధికి సింగరేణి నుండి 95లక్షలు, ప్రభుత్వం నుండి 4 కోట్ల 11లక్షల రూపాయల నిధులు విడుదల చేపించడం పట్ల ముస్లిం సోదరులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు అధ్యక్షులు తదితరులున్నారు

# అంగరంగ వైభముగా స్వామి వారి నిత్య కల్యాణం

సింహాచలం ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు.

# ఢిల్లీని దాటేసిన బైర్నిహట్

షిల్లాంగ్, జూన్ 7,

ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరంగా అందరూ భావించే ఢిల్లీ కాలుష్య నగరాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. కజకిస్థాన్ లోని కరగండా మూడో స్థానంలో, ముల్లాన్ పూర్ (పంజాబ్) నాలుగో స్థానంలో, లాహోర్ (పాకిస్థాన్) ఐదో స్థానంలో నిలిచాయి.స్విస్ గ్రూప్ ఐక్యూఎయిర్ 2024 వార్షిక కాలుష్య నివేదిక ప్రకారం.. మేఘాలయలోని బైర్నిహాట్ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య పట్టణంగా నిలిచింది. అయితే, భారతదేశ రాజధాని ఢిల్లీ ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కూడా బైర్నిహాట్ ను వరుసగా రెండవ సంవత్సరం భారతదేశంలో అత్యంత కలుషితమైన పట్టణ ప్రాంతంగా ప్రకటించింది, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) 302 తో, దీనిని “చాలా పేలవమైన” కేటగిరీలో ఉంచింది.ఢిల్లీ తరచుగా అత్యంత కలుషితమైన నగరంగా భావించబడుతున్నప్పటికీ, ఇది రెండవ స్థానంలో ఉంది, తరువాత కజకిస్తాన్ లోని కరగండ మూడవ స్థానంలో ఉంది. భారతదేశంలోని పంజాబ్ లోని ముల్లాన్ పూర్ నాల్గవ స్థానంలో, పాకిస్తాన్ లోని లాహోర్ ఐదవ స్థానంలో ఉన్నాయి. పాకిస్థాన్ లోని డేరా ఇస్మాయిల్ ఖాన్ ఆరో స్థానంలో, చాద్ లోని నజామెనా ఏడో స్థానంలో, భారత్ లోని ఉత్తరప్రదేశ్ లో ఉన్న లోని పట్టణం ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. న్యూఢిల్లీ తొమ్మిదో స్థానంలో, హర్యానాలోని ఫరీదాబాద్ 10వ స్థానంలో నిలిచాయి.2024లో ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల జాబితాలో పాకిస్థాన్ లోని ముల్తాన్ 11వ స్థానంలో, పెషావర్ 12వ స్థానంలో, ఫైసలాబాద్ 13వ స్థానంలో నిలిచాయి. పాకిస్థాన్ లోని సియాల్ కోట్ 14వ స్థానంలో ఉంది. హర్యానాలోని గురుగ్రామ్, రాజస్థాన్లోని శ్రీ గంగానగర్ వరుసగా 15, 16 స్థానాల్లో నిలిచాయి. చైనాలోని హోతాన్ 17వ స్థానంలో నిలవగా, గ్రేటర్ నోయిడా (ఉత్తరప్రదేశ్), భివాడి (రాజస్థాన్) 18, 19 స్థానాల్లో నిలిచాయి. ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్ నగర్ 20వ స్థానంలో నిలిచింది.రాజస్థాన్ లోని హనుమాన్ గఢ్ 21వ స్థానంలో, ఉత్తరప్రదేశ్ లోని నోయిడా 22వ స్థానంలో నిలిచాయి. పాకిస్థాన్ లోని పిండి భటియన్ 23వ స్థానంలో, బల్లాబ్ గఢ్ (హర్యానా), మండి గోవింద్ గఢ్ (పంజాబ్ ) వరుసగా 24, 25 స్థానాల్లో నిలిచాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా 26వ స్థానంలో, హర్యానాలోని బహదూర్ గఢ్ 27వ స్థానంలో నిలిచాయి. బంగ్లాదేశ్ లోని శ్రీపూర్ 28వ స్థానంలో, పాకిస్తాన్ లోని చార్సద్దా29వ స్థానంలో నిలిచాయి

# 7,000 లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ లతో స్టార్‌లింక్

న్యూఢిల్లీ జూన్ 7,

ఎలాన్ మస్క్ కంపెనీ స్టార్‌లింక్ భారత్ లో ఇంటర్నెట్ సేవలు అందించడానికి అవసరమైన లైసెన్స్ పొందింది. స్పేస్‌ఎక్స్ ద్వారా అందించే శాటిలైట్ ఇంటర్నెట్ , భారతదేశంలో శాటిలైట్ కమ్యూనికేషన్ (సాట్‌కామ్)సేవలను అందించడానికి భారత ప్రభుత్వం నుండి ఆమోదం పొందింది. స్టార్‌లింక్‌కు భారతదేశ టెలికమ్యూనికేషన్స్ విభాగం నుండి గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ బై శాటిలైట్ లైసెన్స్ లభించింది. ఇప్పటి వరకు ఇలాంటి లైసెన్స్ యూటెల్‌సాట్ వన్‌వెబ్ , జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ కు మాత్రమే ఉన్నాయి.స్టార్ లింగ్ ఈ లైసెన్స్ పొందిన మూడవ సంస్థ2025 మే 7న ఆనీ స్టార్‌లింక్‌కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ అయింది. భద్రతా నిబంధనలను, డేటా సెక్యూరిటీ, జాతీయ భద్రతా మార్గదర్శకాలను పాటించేందుకు స్టార్‌లింక్ హామీ ఇచ్చింది. మరికొన్ని షరతులను పూర్తి చేయడంతో పాటు ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ నుండి అదనపు అనుమతులు స్టార్ లింక్ పొందాల్సి ఉంటుంది. 2025 మార్చిలో, స్టార్‌లింక్ భా రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్ తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యాలు స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను పంపిణీ చేయడానికి నగర, గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ కవరేజ్‌ను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి. జియో , ఎయిర్‌టెల్ తమ రిటైల్ స్టోర్‌లు , ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా స్టార్‌లింక్ సేవలను అందిస్తాయి, వీరి మార్కెట్ వాటా కలిపి భారత టెలికాం మార్కెట్‌లో 70 శాతం కంటే ఎక్కువ.స్టార్‌లింక్ సుమారు 7,000 లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్‌లను ఉపయోగిస్తుంది. అధిక-వేగం, తక్కువ లేటెన్సీ బ్రాడ్‌బ్యాండ్‌ను అందిస్తుంది. సాంప్రదాయ జియోస్టేషనరీ శాటిలైట్‌లకు భిన్నంగా, ఒఇఖా శాటిలైట్‌లు 550 కి.మీ ఎత్తులో ఉంటాయి, లేటెన్సీని తగ్గిస్తాయి.మరియు స్ట్రీమింగ్, గేమింగ్, వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి వాటికి ఈ ఇంటర్నెట్ బాగా ఉపయోగకరం. ఇది పూర్తి వైర్ లెస్. సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులో ఉండని గ్రామాలకు ఉపయోగపడుతుంది.స్టార్‌లింక్ కిట్ కొంటెనే ఇంటర్నెట్ కనెక్షన్ పెట్టించుకోగలరు. ఇందులో శాటిలైట్ డిష్, వై-ఫై రూటర్, కేబుల్స్, పవర్ సప్లై ఉంటాయి. ఈ కిట్ 30 నుంచి యాభై వేల వరకూ ఉంటుంది. నెలావారీ ఇంటర్నెట్ చార్జీలు కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వైర్లు లేకుండా చిన్న శాటిలైట్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందుతాయి. మరో ఏడాదిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది దేశంలో స్టార్ లింక్ సేవలు ప్రారంభించేందుకు అవసరమైన ట్రయల్ స్పెక్ట్రమ్‌ను దరఖాస్తు చేసిన 15 నుంచి 20 రోజుల్లోగా మంజూరు చేస్తామని టెలికాం శాఖ తెలిపింది. స్టార్ లింక్ ఇప్పటికే 125 దేశాల్లో సేవలను అందిస్తోంది. ప్రస్తుతం దేశంలో చాలావరకు సంప్రదాయ ఇంటర్నెట్ సేవలు వైర్ లెస్ లేదా ఫైబర్ కేబుల్స్ ఆధారంగా అందుతున్నాయి. ఇవి భూమికి సుదూరంగా భూ స్థిర కక్ష్యలో ఉండే ఉపగ్రహాలపై ఆధారపడి ఉన్నాయి. స్టార్ లింక్ సంస్థ తక్కువ ఎత్తులో ఉండే కక్ష్యలో ఉండే ఉపగ్రహాల ద్వారా ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది. ప్రస్తుతం స్టార్‌లింక్‌కు చెందిన 6వేల శాటిలైట్లు భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో పరిభ్రమిస్తున్నాయి. స్టార్‌లింక్ అందించే ఇంటర్నెట్ వేగంకూడా ఎక్కువగా ఉండనుంది. ప్రారంభంలో స్టార్‌లింక్ ఇంటర్నెట్ వేగం 100-200 ఓఃఖూ వరకు ఉంటుందని, భవిష్యత్తులో ఇది 600-700 ఊఃఖూ బ్యాండ్ విడ్త్‌తో అత్యధిక వేగాన్ని అందిస్తుందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

# రైతులకు అండగా పతంజలి

ముంబై,జూన్ 7,

భారతదేశపు ప్రసిద్ధ స్వదేశీ సంస్థ, పతంజలి ఆయుర్వేద్ రైతులకు మద్దతు ఇవ్వడంలో , గ్రామ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇది సేంద్రీయ వ్యవసాయాన్ని

ప్రోత్సహించడమేకాకుండా న్యాయమైన వాణిజ్యం ద్వారా రైతుల జీవితాలను మెరుగుపరుస్తోంది. పతంజలి తన ‘కిసాన్ సమృద్ధి కార్యక్రమం’ రైతులకు సేంద్రీయ ఎరువులు, మంచి నాణ్యమైన విత్తనాలు ,తెగులు నియంత్రణ పద్ధతులను అందిస్తోందని కంపెనీ ప్రకటించింది. ఇది భూమి సారాన్ని పెంచుతుంది. పర్యావరణానికి హాని కలిగించదు. పతంజలి ఆయుర్వేద సంస్థ సేంద్రీయ వ్యవసాయం మరియు న్యాయమైన వాణిజ్యం ద్వారా రైతులకు సాధికారత కల్పిస్తోందని పేర్కొంది. దాని వినూత్న పరిష్కారాలు , డిజిటల్ సాధనాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని చెబుతున్నారు.పతంజలి వాణిజ్య నమూనా రైతులకు వారి పంటలకు మంచి ధర వచ్చేలా చూస్తుంది. మధ్యవర్తులను తొలగించడం ద్వారా , రైతుల నుండి నేరుగా కొనుగోలు చేయడం ద్వారా, కంపెనీ వారి ఆదాయాన్ని పెంచడంలో సహాయపడుతుంది. అదనంగా, పతంజలి కాంట్రాక్ట్ వ్యవసాయ పథకం రైతులకు ఆర్థిక భద్రతను అందిస్తుంది. ఇది రైతులకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా గ్రామాల్లో ఉపాధి , అభివృద్ధిని కూడా ప్రోత్సహిస్తుంది.” అని పతంజలి సంస్థ ప్రకటించింది.పతంజలి టెక్నాలజీ రంగంలోకి కూడా అడుగుపెట్టింది. భూమి, వాతావరణ నవీకరణలు , మార్కెట్ ధరల గురించి సమాచారాన్ని అందించే రైతుల కోసం డిజిటల్ అప్లికేషన్‌లను అభివృద్ధి చేసింది. ఈ సాధనాలు రైతులు తమ వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచుకోవడానికి , మార్కెట్‌లో పోటీతత్వాన్ని కొనసాగించడానికి సహాయపడతాయి. పతంజలి జైవిక్ ప్రోమ్ వంటి ఉత్పత్తులు భూసారాన్ని పెంచుతాయి. అన్ని రకాల పంటలకు ఉపయోగపడతాయి.” అని కంపెనీ ప్రకటించింది. పతంజలి చేసిన ఈ ప్రయత్నం వ్యవసాయాన్ని మారుస్తోంది. పర్యావరణాన్ని కూడా కాపాడుతోంది. దాని పథకాలు రైతులకు వారి సామాజిక బాధ్యతలను నెరవేరుస్తూనే ఆర్థిక ప్రయోజనాలను అందిస్తున్నాయి. ఈ విధంగా, పతంజలి కొత్త పద్ధతులు , న్యాయమైన వాణిజ్య పద్ధతులు భారతీయ వ్యవసాయాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నాయి” అని కంపెనీ పేర్కొంది.

# 7500 మందిపై కత్తి...

న్యూయార్క్, జూన్ 7,

ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, ఇరాక్, లిబియా, సోమాలియా, సూడాన్, సిరియా, యెమెన్ వంటి ముస్లిం దేశాల పౌరులపై నిషేధం విధించిన తర్వాత, నేపాల్ విషయంలో కూడా అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది.అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేపాల్‌కు ఇచ్చిన బహిష్కరణ రక్షణను రద్దు చేశారు. ఈ నిర్ణయం తర్వాత, ఇప్పుడు 7,500 మంది నేపాలీలు వెంటనే అమెరికాను విడిచి వెళ్ళవలసి ఉంటుంది.న్యూస్‌వీక్ కథనం ప్రకారం,నేపాల్‌లో పరిస్థితి ఇప్పుడు 2015లో ఉన్నట్లు లేదని, కాబట్టి దాని బహిష్కరణ రక్షణను రద్దు చేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం చెబుతోంది. నేపాల్‌లో భూకంపం కారణంగా అప్పటి అమెరికా ప్రభుత్వం నేపాలీ పౌరులకు ఈ రక్షణను అందించింది. అమెరికాలో దీనిని తాత్కాలిక రక్షిత స్థితి లేదా టిపిఎస్ అంటారు. దీనిలో, తమ దేశంలోని చెడు పరిస్థితుల దృష్ట్యా అమెరికాలోకి వెళ్లి నివసించాలనుకునే వారికి అమెరికా ప్రభుత్వం రక్షణ హామీ ఇస్తుంది.బహిష్కరణ రక్షణ కింద, ఇతర దేశాల ప్రజలకు పని చేసే హక్కు మాత్రమే ఉంటుంది. అంటే, వారికి పౌరసత్వం లభించదు. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే, ఇప్పుడు ఏ దేశానికీ అలాంటి రక్షణ ఇవ్వబడదని ఆయన సూచించారు. ఇదిలావుంటే, టిపిఎస్ కింద 7500 మంది నేపాల్ పౌరులు అమెరికాలో నివసిస్తున్నారు. దీనిని రద్దు చేసిన తర్వాత, వారు వెంటనే తమ దేశానికి తిరిగి రావాల్సి ఉంటుంది. లేకపోతే, అమెరికా ప్రభుత్వం వారిని బలవంతంగా నేపాల్‌కు తిరిగి పంపవచ్చు.2017లో అధ్యక్షుడైన తర్వాత డొనాల్డ్ ట్రంప్ దానిని అంతం చేయాలని కోరుకున్నారు. కానీ ఇమ్మిగ్రేషన్ విభాగం దానిని వ్యతిరేకించింది. ట్రంప్ చివరి వరకు దీనికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. కానీ విజయం సాధించలేకపోయారు. నేపాల్‌లో పరిస్థితి ఇప్పుడు అలాగే లేదని, కాబట్టి బహిష్కరణ రక్షణకు అర్థం లేదని ట్రంప్ పరిపాలన చెబుతోంది.రెండు రోజుల క్రితమే అమెరికా అధ్యక్షుడు 12 దేశాల ప్రజలను నిషేధించాలని నిర్ణయించారు. ఈ దేశాలలో ఉగ్రవాదం విజృంభిస్తోందని ట్రంప్ సర్కార్ చెబుతోంది. ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్ వంటి దేశాలు ట్రంప్ నిర్ణయంపై స్పందించకపోగా, చాడ్ ఖచ్చితంగా దీనికి వ్యతిరేకంగా పెద్ద నిర్ణయం తీసుకుంది. చాడ్ తన దేశంలోకి అమెరికన్ పౌరుల ప్రవేశాన్ని నిషేధించాలని నిర్ణయించింది. మన ఆత్మగౌరవాన్ని అమ్ముకుని అమెరికాతో మాట్లాడలేమని చాడ్ అధిపతి అంటున్నారు. ఖతార్ నుంచి అందుకున్న బహుమతి గురించి చాడ్ అధ్యక్షుడు ప్రస్తావించారు.

===========================

# తాండూరులో ఘనంగా బక్రీద్ వేడుకలు

త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఆనందోత్సవాలతో నిర్వహించుకున్నారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని తాండూరు నియోజకవర్గంలోని ఈద్గాల్లో వారు ప్రత్యేక ప్రార్థనలు చేసి, బక్రీద్ విశిష్ఠత గురించి వివరించారు.ఈద్ - ఉల్ - జిహా (బక్రీద్) సందర్భంగా తాండూరు పట్టణంలోని చెనెగే?షపూర్ ఈద్గాకు ముస్లీంలు తరలి వచ్చి సామూహిక ప్రార్థనలు చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా సామూహిక ప్రార్థనలకు హజరయ్యారు. చెనెగే?షపూర్ రోడ్డులోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌లు ముస్లింలను ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

# పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- మొదటి విడతలో ఇళ్లు రానివారు ఆందోళన చెందొద్దు..
- అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ఇస్తాం.
- వివిధ గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పత్రాల పంపిణి
- బడిబాట కార్యక్రమ పోస్టర్ ను విడుదల చేసిన ఎమ్మెల్యే.

జయశంకర్ భూపాలపల్లి

పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. కమలాపూర్, నాగారం, ఆజంనగర్, నందిగామ, పంబాపూర్, దూదేకులపల్లి, గొల్లబుద్దారం, రాంపూర్, ఆముదాలపల్లి, కొంపల్లి, గుడాడ్ పల్లి, గొర్లవీడు, వజినేపల్లి, నేరేడుపల్లి, ఎస్.యం కొత్తపల్లి, మోరంచపల్లి, శ్యాంనగర్ గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాలను జిల్లా హౌసింగ్ పీడీ లోకీలాల్ ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సభా వేదికలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదవాడి సొంతింటి



కలను నిజం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన బాగుంటుందన్నారు. గత పాలకులు ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాల మీద పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇండ్లపై పెట్టలేదని, పేద ప్రజల సొంతింటి కలను విస్మరించిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రభుత్వం రూ.22 వేల 500 కోట్ల రూపాయలను పేద ప్రజల సొంతింటి కల కోసం ఈ సంవత్సరం కేటాయించిందని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం అజెండాగా పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ఇండ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయపార్టీలకు అతీతంగా పేద, నిరుపేదలకు మొదటి విడతలో నిరోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం పెట్టే ప్రతీ రూపాయి కూడా పేదలకు ఉపయోగపడాలని తాము ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారులు పలువురు మాట్లాడుతూ... గత పదేళ్లుగా సొంతింటి కోసం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ తమకు ఇళ్లు మంజూరు కాలేదని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహాయంతో తమకు ఇండ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.కమలాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ పోస్టర్ ను విడుదల చేసిన ఎమ్మెల్యే..రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు విద్యాశాఖ ఈరోజు నుండి 19వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాగా, ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కమలాపూర్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ నెల 19వరకు ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఆ కార్యక్రమాలను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు

తాండూర్:తాండూర్ మండలంలో ముస్లిం సోదరులుఅత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.. ఐబి, తాండూర్ తదితర ఏరియాలోని మసీదుల్లో నమాజులు చేసిన ముస్లింలు ఒకరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందూ ముస్లిం భాయి భాయి అని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానికి బక్రీద్ పండుగ ప్రతీక అని ముస్లిం సోదరులు పేర్కొన్నారు.

# మూడు రోజులుగా సెర్చ్ ఆపరేషన్.. మరో ఇద్దరు మావోయిస్టుల హతం

బీజాపూర్‌డ జూన్ 7,

ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లా నేషనల్ పార్కులో ఎన్ కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. గత 3 రోజులుగా ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. కాగా ఇదే ఏరియాలో గురువారం మావోయిస్టు పార్టీ మరో అగ్రనేత తెంటు లక్ష్మీనరసింహా అలియాస్ గౌతమ్, నిన్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అడెల్లు అలియాస్ భాస్కర్ హతమయ్యారు.

# పాఠశాల ప్రహారీ గోడ నిర్మాణం కోసం అలుపెరుగని పోరాటం

- 51 రోజులుగా పాఠశాల ఎదుట దీక్ష
- స్పందించని ప్రజా ప్రతినిధులు-అధికారులు

మండపేట డ జూన్ 7,

ఆమె ఒక సోషల్ వర్కర్. గ్రామంలో ఏ సమస్యలున్నా పరిష్కరించడానికి ముందుంటారు. ఆమె వల్లూరి శ్రీవాణి, సోషల్ వర్కర్,కేశవరం గ్రామం. శ్రీవాణి తన స్వార్ధం కోసం,ప్రభుత్వ పధకాల కోసం నిరహారదీక్ష చేపట్టలేదు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట రూరల్ మండలం మేజర్ గ్రామ పంచాయితీ ఐన కేశవరం గ్రామంలో 8.62 ఎకరాలలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చుట్టూ రక్షణ గోడ(ప్రహారీ) గోడను నిర్మించాలనీ గత 51 రోజులుగా ఒంటరిగా రిలే నిరహార దీక్ష చేపట్టారు. ప్రతీ రోజూ ఉదయం నుంచీ సాయంత్రం వరకూ సత్యాగ్రహం గాంధీ మార్గంలో చేపట్టడం విశేషం. ఎన్నికల ముందు శాసనసభ్యుడు చేసిన హామీ అమలు చేయాలనీ తాను గత 51 రోజులుగా ఈ దీక్ష చేపట్టాననీ సోషల్ వర్కర్ వల్లూరి శ్రీవాణి పేర్కొన్నారు.

# బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేష్

తాడేపల్లి డ జూన్ 7,

త్యాగం, అనురాగం, దాన గుణాలను పెంపొందించే పండుగ ఈద్ అల్ అదా (బక్రీద్) సందర్భంగా మంత్రి లోకేష్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. నిస్వార్ధమైన ఆత్మీయ అనుబంధాలను వ్యాపింపజేయడమే బక్రీద్ పండుగ ముఖ్యోద్దేశం. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుందామని అయన అన్నారు.

# చంద్రపల్లిలో బడిబాట కార్యక్రమం

### ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ బడులు

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన

### పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ

తాండూర్ జూన్ 7, (

తాండూర్ మండలంలోని చంద్రపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి, 5 సంవత్సరాలు పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన విద్య, మరియు మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వారు తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమం వల్ల గ్రామంలో విద్య కోసం ప్రజలలో మరింత ఆసక్తి పెరిగింది, మరియు ప్రభుత్వ పాఠశాలలకు ఉన్న విద్యార్థుల సంఖ్య పెరగాలని ఆశించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శారద,పాఠశాల చైర్మన్ పెండ్యాల చంద్రకళ,పిల్ల తల్లిదండ్రులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్ జూన్ 7, (

శ్రీనగర్ కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి నూతన కమిటీని దేవాదాయశాఖ ప్రకటించిన నేపథ్యంలో కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. 15 మంది సభ్యులతో కూడిన కమిటీని దేవాదాయ శాఖ ప్రకటించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. సభ్యులతో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ మధు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులుగా ఎన్. దినేష్ కుమార్, ఉన్నం సుబ్బారావు, గొంటి నర్సింగ్యాదవ్, గొట్టిపర్తి శరత్ బాబు, సిపిరి అర్జున్ యాదవ్, జి.కళ్యాణి, కటకం రాజేష్, యల్వర్తి జగదీష్, మోట విజయ్కుమార్, కె. లక్ష్మణ్, ఎక్స్ అఫిషియో మెంబర్ ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర శర్మ నియమితుల య్యారు. త్వరలోనే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకుంటుమని కమిటీ సభ్యులు తెలిపారు.

# కవిత నెక్స్ట్ ఏంటీ...

హైదరాబాద్, జూన్ 7,



కొన్ని రోజులుగా తాను అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని కేసీఆర్..ఆయనకు మద్దతుగా ధర్నా చేశాక కచ్చితంగా స్పందిస్తారని కవిత భావించారట.ఒక్క లేఖ. బీఆర్ఎస్‌తో ఆమె బంధంపై సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తోంది. కవిత బీఆర్ఎస్‌లో ఉన్నారా.? వీడారా అన్నది తేలని ప్రశ్నగా ఉంది. ఇదే సమయంలో ఆమె పొలిటికల్ ఫ్యూచర్ కూడా డైలమాలో పడిందన్న టాక్ వినిపిస్తోంది. తన అసంతృప్తి గళంతో కేసీఆరే పిలిచి మాట్లాడుతారని ఊహించారట కవిత. కానీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందంటున్నారు. గులాబీ బాస్ కేసీఆర్ కవిత కామెంట్స్ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని టాక్. ఏదైనా సమస్య ఉంటే డైరెక్టుగా తన దగ్గరకు వచ్చి చెప్పి ఉంటే బాగుండేదని..లెటర్ రాసి రాద్ధాంతం క్రియేట్ చేసిందనే ఆగ్రహంతో ఉన్నారట గులాబీబాస్ కేసీఆర్.పార్టీలో లోటుపాట్లపై కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత..తండ్రి కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని కామెంట్స్ చేసి పెద్ద చర్చకు దారితీశారు. తాను కేసీఆర్‌కు రాసిన లేఖ ఎలా లీక్ అయ్యిందో తేల్చాలని పట్టుబట్టారు. ఇదే సమయంలో సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ పలు వ్యాఖ్యలు చేసింది కవిత. ఈ క్రమంలో కవిత ఏదో పెద్ద నిర్ణయం తీసుకోబోతున్నారన్న చర్చ జరిగింది. అంతలోనే మళ్లీ రూట్ మార్చిన కవిత? తండ్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులిచ్చిన అంశంపై..హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర నిరసన తెలిపింది. అయితే ఆ ధర్నా చేయడం వెనుక కవిత ప్లాన్ వేరే ఉందని..ఆ స్ట్రాటజీ వర్కౌట్ అయినట్లు కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది.బీఆర్ఎస్‌లో కేసీఆరే సుప్రీం లీడర్. అందులో ఎవరికీ అనుమానాలు లేవు. అలాంటి కేసీఆర్‌కు మద్దతుగా కవిత ధర్నా చేస్తే అక్కడ ఒక్క గులాబీ జెండా కూడా కనిపించలేదు. కవిత ఇన్వైట్ చేశారో లేదో..లేక ఆమె పిలిచినా ఎవరు రాలేదేమో కానీ..ఒక్క బీఆర్ఎస్ లీడర్ కూడా ఆమె నిర్వహించిన ధర్నా వైపు రాలేదు. గతంలో కవిత ఎప్పుడు కార్యక్రమాలు నిర్వహించినా పోటా పోటీగా వచ్చి అటెండెన్స్ వేయించుకునే గులాబీ పార్టీ నేతలు ఇప్పుడు మాత్రం మొహం చాటేశారు.అయితే కవిత ఇన్ని రోజులు చేసిన కార్యక్రమాలు ఒక ఎత్తు. ఇప్పుడు కేసీఆర్‌కు మద్దతుగా నిర్వహించిన మహాధర్నా మరో ఎత్తని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. తెలంగాణ జాగృతి పేరుతో వందల కార్యక్రమాలు చేసిన కవితకు ప్రతీ సందర్భంలో మద్దతుగా వెంట నడిచింది బీఆర్ఎస్ క్యాడర్. ఎక్కడైనా..ఎప్పుడైనా కవితను నెత్తిన పెట్టుకుని చూసుకున్నారు గులాబీ పార్టీ కార్యకర్తలు. కానీ తండ్రి కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ లీక్ తరువాత సీన్ మొత్తం మారిపోయింది.కేసీఆర్ అంటే బీఆర్ఎస్, బీఆర్ఎస్ అంటే కేసీఆర్. అలాంటి ఆయనకు మద్దతుగా చేసిన ధర్నాలో గులాబీ జెండాలు, కండువాలు పెట్టకపోవడమంటే కవిత తనకు తానుగా పార్టీకి దూరం అవుతున్నారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. ఇన్నాళ్లు కవిత ఏం మాట్లాడినా, లేఖలు రాసినా ఆమె ప్రయాణం మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉంటుందని అనుకున్నారంతా. కానీ రోజు రోజుకు ఆమె తీరు చూస్తోంటే మాత్రం బీఆర్ఎస్‌తో తెగదెంపులు చేసుకున్నట్టే కనిపిస్తోందన్న చర్చ జరుగుతోంది.కవిత కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ తర్వాత ఆమె అమెరికా నుంచి వచ్చినప్పటి నుంచి ఏ కార్యక్రమంలో పాల్గొన్నా బీఆర్ఎస్ జెండా కానీ, ఆ పార్టీ నేతలు గాని ఆమె కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించడం లేదు. దీన్ని బట్టే పార్టీ కవితను దూరం పెట్టేసిందని, ఆమె ఇప్పుడు ఒంటరి అయ్యారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నేతలు కనీసం కవిత పేరే ఎత్తడం లేదంటున్నారు.ఎమ్మెల్సీ కవిత జోలికి ఎవ్వరూ వెళ్లొద్దని పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశించిందన్న అన్న టాక్ వినిపిస్తోంది. లేదంటే ఎందుకొచ్చిన గొడవ అనుకుంటూ నేతలే ఆమెతో గ్యాప్ మెయింటెన్ చేస్తున్నారా అన్న చర్చ జరుగుతోంది. ఇక కేసీఆర్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా ఇందిరాపార్క్ దగ్గర చేపట్టిన దర్నాకు బిఆర్ ఎస్ కేడర్ పూర్తిగా దూరంగా ఉండటం?ధర్నాకు కూడా పెద్దగా స్పందన లేకపోవడానికి తోడు కనీసం కేసీఆర్ నుండి పిలుపుకూడా రాకపోవడంతో ఇప్పుడేం చేయాలో పాలుపోక కవిత టీం ఆందోళన చెందుతోందట కొన్ని రోజులుగా తాను అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని కేసీఆర్..ఆయనకు మద్దతుగా ధర్నా చేశాక కచ్చితంగా స్పందిస్తారని కవిత భావించారట. కానీ ఫామ్ హౌజ్ నుంచి మాత్రం నోరెస్పాన్స్. దీంతో కవిత చాలా నిరాశ చెందారనే చర్చ తెలంగాణ జాగృతి వర్గాల్లో జరుగుతోంది. దీంతో కవితను పార్టీ వద్దనుకుంటోందా.? లేక ఆమెనే పార్టీకి దూరంగా ఉంటున్నారా అన్న చర్చ మొదలైంది. ఏదేమైనా కవిత నెక్స్ట్ స్టెప్ ఏంటి అంటే ఇప్పటికిప్పుడైతే ఏం చెప్పలేని పరిస్థితి అంటున్నారు. ఆమె రాజకీయ భవితవ్యం ఏంటన్నది ఎవ్వరికి అంతుపట్టడం లేదంటున్నారు. బీఆర్ఎస్‌తో కవిత బంధం తెగినట్లేనా.? లేక ఆమెనే ఓ మెట్టు దిగి కేసీఆర్ గతంలో చెప్పినట్లు సైలెంట్ అయిపోతారా అన్నది వేచి చూడాలి.

# సిటీలో మరో 3 ఫ్లైఓవర్లు

హైదరాబాద్, జూన్ 7, (

హైదరాబాద్‌ని విశ్వ నగరంగా అభివృద్ధి చేసి.. ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించడం కోసం మౌలిక వసతులను డెవలప్ చేయడం కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. అలానే నగరంలో ప్రధాన సమస్య అయిన ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం.. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)ని ప్రారంభించిన సంగతి తెలిసిందేదీనిలో భాగంగా నగరం మొత్తం మీద 16 ప్రాంతాల్లో 20.14 కిలోమీటర్ల మేర రూ.2400 కోట్లతో వంతెనలు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ పనులకు సంబంధించిన ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించనున్నారు. ఈప్రాజెక్ట్‌లో భాగంగా భాగ్యనరంలో విపరీతంగా రద్దీ ఉండే మూడు ప్రాంతాల్లో ఫ్లైఓవర్‌లు నిర్మించేందుకు రెడీ అవుతోంది. మరి ఆ ప్రాంతాలు ఏవి అంటే..హైదరాబాద్ సిటీలో.. వాహనాల రద్దీతో విపరీతమైన ట్రాఫిక్ ఉండే మూడు జంక్షన్లకు పరిష్కారం లభించబోతోంది. రేవంత్ ప్రభుత్వం హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ.360 కోట్లతో మూడు ఫ్లైఓవర్‌లు, ఓ అండర్‌పాస్ నిర్మాణానికి అంగీకారం తెలిపింది. ఈక్రమంలో జీహెచ్ఎంసీ ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇంతకు ఆ ఏరియాలు ఏవి అంటే.. బంజారహిల్స్ రోడ్డు నం.3లోని ది లీలా హోటల్ జంక్షన్, పంజాగుట్ట నాగార్జున సర్కిల్ (ఎన్‌ఎఫ్‌సీఎల్)లో నిర్మాణం చేపట్టబోయే ఫ్లైఓవర్‌ల కోసం రూ.210 కోట్లు కేటాయించింది.అలానే రసూల్‌పుర ఎన్టీఆర్ చౌరస్తాపై.. బేగంపేట మెయిన్ రోడ్డును, మినిస్టర్ రోడ్డును కలుపుతూ నిర్మించబోయే ఫ్లైఓవర్‌కు గాను రూ.150 కోట్ల ఖర్చవతుందని అంచనా వేశారు. దీనికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పూర్తి కాగానే.. టెండర్లు పిలుస్తామని జీహెచ్ఎంసీ చెప్పుకొచ్చింది. ఈ ఫ్లైఓవర్లు అందుబాటులోకి వస్తే.. ఈ మూడు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు



పరిష్కారం లభించనుంది అంటున్నారఎన్‌ఎఫ్‌సీఎల్ చౌరస్తాలో నిర్మించబోయే ఫ్లైఓవర్ పొడవు నిర్మాణం 900 మీటర్లు. ఈ నిర్మాణ పనుల కోసం 13 ఆస్తులను సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. బంజారహిల్స్ రోడ్డు నం.1 నుంచి నాగార్జున సర్కిల్ మీదుగా రోడ్డు నం.3 వైపు వెళ్లే వాహనాల కోసం రెండు లైన్ల ఫ్లైఓవర్ రానుంది. దీని పొడవు 900మీటర్లు. అలానే పంజాగుట్ట నుంచి బంజారహిల్స్ రోడ్డు నం.3 మీదుగా శ్రీనగర్‌కాలనీకి రెండు లైన్ల అండర్‌పాస్ రాబోతుంది. దీని పొడవు 340 మీటర్లు.వీటితో పాటుగా కేబీఆర్ పార్కు నుంచి పంజాగుట్ట వైపు లీలా హోటల్ జంక్షన్ వద్ద మూడు లైన్ల ఫ్లైఓవర్ రానుంది. దీని పొడవు 600 మీటర్లు. ఈ రెండు నిర్మాణ పనుల కోసం 46 ఆస్తులను సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అలానే బేగంపేట నుంచి సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డుకు వెళ్లే దారిలో.. ఎన్టీఆర్ జంక్షన్‌లో మెట్రో మార్గం మీదుగా ఫ్లైఓవర్‌ని నిర్మించబోతున్నారు. దీని పొడవు 740 మీటర్లు.. ఇందుకోసం 8 ఆస్తులను సేకరించాల్సి ఉంది. దీనిపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ భూసేకరణపై క్షేత్రస్థాయి పరిశీలన కూడా చేపట్టారు.

# ఆఫీసులో ఉద్యోగుల ముద్దులు..

వరంగల్, జూన్ 7,

ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి, జీతం ఇచ్చి.. పనులు చేయండ్రా అని పంపితే .. వారు చేస్తున్న పనులు మాత్రం వేరే ఉన్నాయి. కుర్చీలో కూర్చుని పని చేయకుండా.. తోటి ఉద్యోగినితో ముద్దు ముచ్చట్లు పెట్టుకుంటున్నాడు. ఇద్దరూ కొత్తగా చేరిన వారే. ప్రేమలో ఉన్నారో.. దోమలు కుడుతున్నాయని కంగారు పడుతున్నారో కానీ.. ఉద్యోగానికి వచ్చినప్పటి నుండి అదే పని. దాంతో చిరాకేసిన కొంత మంది కిటికీ నుంచి వీడియో తీసి.. వారి బాగోతాన్ని సోషల్ మీడియాలో పెట్టారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. విధులు నిర్వహించాల్సిన వీరు ముద్దు ముచ్చట తో రాసలీలల్లో మునిగిపోయారు. నిత్యం వేలాది మంది ప్రజలు వివిధ పనులకోసం కార్పొరేషన్ కార్యాలయానికి వస్తూంటారు. వారు అదే పనిగా తిరగడం తప్ప పనులు కావు. ఎందుకంటే.. ఉద్యోగులు ఇలాంటి పనులు చేస్తూంటారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఎకౌంట్స్ విభాగంలో రెగ్యులర్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆ ఇద్దరూ అకౌంట్స్ సరి చేసుకోవడానికే సమయం ఉండదు. ఇక ఇతర పనులు ఎక్కడ చేస్తారు. బిల్లులు రావాల్సిన వారు.. మంజూరు కావాల్సిన వారు అదేపనిగా కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంటారు. పనులు కావు. వీరినిర్వాకాలు చూసి చాలా మంది గుట్టు బయట పెట్టాలనుకున్నారు. రాసలీలల్లో మునిగిపోయిన సమయంలో కార్యాలయానికి వచ్చిన ఎవరో వీడియో చిత్రీకరించారు. అయితే ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. రాసలీలల పై ఇద్దరు ఉద్యోగులను ఉన్నతాధికారులు మందలించారు.ఈ ఉద్యోగుల అనుచిత ప్రవర్తన మొదట ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినప్పుడు, వారిని కేవలం మందలించి విడిచిపెట్టినట్లు సమాచారం. అయితే, ఈ హెచ్చరికలను వారు ఏ మాత్రం లెక్కచేయకుండా, తమ తీరును మార్చుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. కార్యాలయ ప్రాంగణాన్ని తమ వ్యక్తిగత ప్రవర్తనలకు వేదికగా మార్చుకోవడం పట్ల తోటి ఉద్యోగులు కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సేవకు అంకితం కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు ఇలాంటి అసాంఘిక చేష్టలకు కేంద్రంగా మారడం బల్దియా గౌరవానికి భంగం కలిగిస్తుందని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు ఇకనైనా కళ్ళు తెరిచి, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తోటి ఉద్యోగులు, నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుచిత ప్రవర్తనకు పాల్పడిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఇలాంటి ఘటనలను అరికట్టవచ్చని, కార్యాలయ వాతావరణంలో వృత్తిపరమైన ప్రమాణాలను పునరుద్ధరించవచ్చని సూచిస్తున్నారు. రాసలీలలు పాల్పడిన ఇద్దరి పై అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటారా.. లేక మందలించి వదిలేస్తారా వేచి చూడాలి.ఈ ఇద్దరూ ఉద్యోగులు కొత్తగా చేరిన వారని చెబుతున్నారు. తాము ప్రేమలో ఉన్నామని వారు సమర్థించుకునే ప్రయత్నం చేసినట్లుగా చెబుతున్నారు. ప్రేమలో ఉంటే ఆపీసులో ముద్దులు పెట్టుకోవడం ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి

# ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారేనా!

గోదావరిఖని : డ జూన్ 7,

తెలంగాణ రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారేనా ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరి ఒక తాటి మీదికి తెచ్చి వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ ఉద్యోగ భద్రత కలిగిస్తానని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భరోసా కల్పించారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడంలేదని ఉద్యోగులు మనోవేదన గురి అవుతున్నారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా ఉద్యోగ భద్రత తో పాటు కుటుంబ సభ్యులందరికీ ఇ. స్. ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు వర్తిస్తాయి. అలాగే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వలన జీతభత్యాలు కూడా పెరుగుతాయని, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్లో అక్కడి ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వలన వారికి ఉద్యోగ భద్రత తో పాటు అక్కడి ప్రభుత్వం అన్ని సదుపాయాలు అందిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులంతా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేడుకుంటున్నారు.

ప్రభుత్వ కార్యాలయంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగులబెట్టి చాకిరి శ్రమదోపిడి.

ప్రభుత్వ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే వారితో రోజు 14 గంటలు పని చేయించుకుంటూ చెమదోపిడి గురి అవుతున్నారు. . ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో సమయపాలన లేకుండా పై అధికారులు వారితో పని చేయించుకోవడం కాకుండా వారిని సూటి పోటీ మాటలతో చులకనగా చూడడం వివిధ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పై అధికారులతో మానసిక వేదన గురవుతున్నారని అంటున్నారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారేనా!

తెలంగాణ రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంవత్సరాలకు కొద్ది చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారుతాయా! మాకు రోజులు వస్తాయా అంటూ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద మనసు తో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ఉద్యోగులంతా వేడుకుంటున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆదుకోవాలి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. వివిధ ప్రభుత్వ కార్యాలయంలో సుమారు 4 లక్షలకు పైన విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగులను వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కొని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారిని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్.. ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి

ఈద్ ఉల్-అధా (బక్రీద్) పర్వదినం సందర్భంగా శనివారం ముస్లిం సోదరులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాంబులగడ్డ, గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని ఈద్గా లల్లో జరిగిన బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... త్యాగానికి, సహనానికి, భక్తి విశ్వాసాలకు బక్రీద్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. శాంతి, కరుణ, సహనం, సామరస్యం, ఐకమత్యం, సోదరభావం స్ఫూర్తితో ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా భాగస్వామ్యం, దానధర్మం, గౌరవం, అవసరమైన వారికి సాయం చేయడం బక్రీద్ పండుగ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని సందేశాన్ని బక్రీద్ తెలుపుతుందన్నారు. బాంబులగడ్డ, చెల్పూర్ ఈద్గా లల్లో వివిధ అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమాలల్లో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులు ఉన్నారు.

# శ్రీవారి మెట్టు మార్గాన కాలినడకన వెళ్లే భక్తులకు అలిపిరిలో దివ్యదర్శనం టోకెన్ల జారీ ప్రారంభం

తిరుపతి జిల్లా ప్రతినిధి, జూన్ 7( భారత శక్తి):తిరుమల శ్రీవారి దర్శనార్థం శ్రీవారి మెట్టు మార్గాన కాలినడకన వెళ్లే భక్తులకు శుక్రవారం సాయంత్రం నుండి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శనం టోకెన్ల జారీని టిటిడి ప్రారంభమైంది.ఈ సందర్భంగా అదనపు ఈఓ శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి మెట్టు దివ్యదర్శనం టోకెన్ కేంద్రాన్ని శ్రీవారి మెట్టు నుండి అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చడంపై భక్తుల నుండి స్పందన అపారమని అన్నారు.శ్రీనివాస మంగాపురం ఆలయంలో కౌంటర్లను ఏర్పాటు చేయడానికి భారత పురావస్తు శాఖ అనుమతి రావాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుండటంతో భక్తుల సౌకర్యార్థం టోకెన్ కౌంటర్లను తాత్కాలికంగా భూదేవి కాంప్లెక్స్‌కు మార్చామన్నారు. భూదేవి కాంప్లెక్స్ లో ఇప్పటికే పూర్తిస్థాయిలో ఎస్ ఎస్ డి టోకెన్లను జారీ చేసే మౌలిక సదుపాయాలు, మానవవనరులు ఒకే చోట చాలా కాలంగా ఉండడం వల్ల ఇక్కడ నుండి జారీ చేస్తున్నామన్నారు. శ్రీవారి మెట్టు డీడీ టోకెన్లను జారీ చేయడానికి నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, టీటీడీ ఏర్పాట్లపై భక్తులు కూడా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు.రవాణా వ్యవస్థ కూడా బాగా ఉందని, బస్ స్టాండ్ కూడా అలిపిరిలోనే ఉందన్నారు. కాబట్టి భక్తులు శ్రీవారి మెట్టు చేరుకోవడానికి సౌకర్యంగా ఉంటుందని ఆయన తెలిపారు.

భక్తులకు సేవలు అందించడానికి శ్రీవారి సేవా వాలంటీర్లతో పాటు పరిపాలనా, నిఘా, అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించామన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా డీడీ టోకెన్లను జారీ చేయడానికి టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జేఈఓ శ్రీ వి వీరబ్రహ్మం, సీవీ%డ%ఎస్ఓ శ్రీ కె.వి. మురళీకృష్ణ మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బోనకల్లో యువ చైతన్య సైకిల్ యాత్ర కు సంఘీభావం తెలియజేస్తున్న సిపిఎం నాయకులు పొన్నం, ఎస్సై పొదిలి వెంకన్న.



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), జూన్ 07:ఖమ్మం జిల్లా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, మద్యం మొదలగు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న యువ చైతన్య సైకిల్ యాత్ర శనివారం 9వ రోజు బోనకల్ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా వారికి స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ పొదిలి వెంకన్న, సిపిఎం మండల కమిటీ, డివైఎఫ్ఐ మండల కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీలు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. బోనకల్ సబ్ ఇన్స్పెక్టర్ పొదిలి వెంకన్న, సిపిఎం సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు యువ చైతన్య సైకిల్ యాత్ర రథసారుదులకు అభినందనలు, సంఘీభావ సందేశం ఇచ్చారు.డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అనగాని వెంకటేష్, సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకులు చేడే వెంకటేశ్వరరావు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు గుగులోతు రామకృష్ణ, బోనకల్ సిపిఎం శాఖ కార్యదర్శి ఉప్పర శ్రీను, కందికొండ శ్రీనివాసరావు, దొండపాటి సత్యనారాయణ, బూర్గుల అప్పచారి, బిల్లా విశ్వనాథం, గద్దె రామారావు, గంగుల శివ, కాంగ్రెస్ పార్టీ బోనకల్ గ్రామ యువజన సంఘం సహాయ కార్యదర్శి మల్లెల ఉపేంద్ర, అంబటి సంపత్, ఏసు పోగు బాబు, ఉప్పర గోపి, దారగాని కృష్ణ, కొమ్మినేని సీతారాములు, కిచోక యశ్వంత్ తదితరులు యువ చైతన్య సైకిల్ యాత్ర రథసారధులకు అభినందనలు, సంఘీభావం తెలియజేశారు.

# హన్మకొండ నగరంలో ముగిసిన చదరంగం పోటీలు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూన్7:హన్మకొండ నగరం హంటర్ రోడ్డు విద్యుత్ నగర్ కాలనీలోని వంశీ ట్రస్ట్ భవన్ లో హనుమకొండ చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్ 15 చదరంగం పోటీలను శనివారం నిర్వహించారు.ఈ చదరంగం పోటీలలో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ చెస్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ నుండి పదవ స్థానం వరకు గెలిచిన చెస్ క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్ఆర్ఐ పాటిపెల్లి వివేక్ షీల్డ్స్,మెడల్స్ ప్రదానం చేశారు.అనంతరం ఎన్ఆర్ఐ పాటిపెల్లి వివేక్ మీడియాతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ చెస్ కోచర్ చిన్న రాములు శ్రీనివాన్, క్రీడాకారులు,తల్లిదండ్రులు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమమైనా... సహాయమైనా పొంగులేటి ముందంజ





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), జూన్ 07:సంక్షేమమైనా... సహాయమైనా అందించడంలో తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముందంజలో ఉంటారని ఆయన క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని బారుగూడెం, గొల్లగూడెం, ఏదులాపురం, వరంగల్ క్రాస్ రోడ్డు, మద్దులపల్లి, జలగంనగర్, నాయుడుపేట, కేబీఆర్ నగర్, రాజీవ్ గృహకల్ప, రెడ్డిపల్లి, ముత్తగూడెం ప్రాంతాల్లో ఇటీవల మృతి చెందిన 20మంది వ్యక్తుల కుటుంబాలను ఓదార్చి పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున ఒక్కో కుటుంబానికి రూ. 10వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రిగా ఒకవైపు ప్రభుత్వం తరుపున సంక్షేమ కార్యక్రమాలను ప్రజల దరిచేర్చుతూనే... ఇంకోవైపు తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లోనూ ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు, బాణోతు కిశోర్, భూక్యా సురేష్ నాయక్, బండి జగదీశ్, అజ్మీరా అశోక్ నాయక్, వెంపటి రవి, తమ్మినేని నవీన్, కందుకూరు వెంకట నారాయణ, యాకుబ్, తిప్పిరెడ్డి వీరా రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మహేశ్ , బానోతు దివ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బారుగూడెంలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన కార్యక్రమంలో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రెస్ అకాడమీ చైర్మన్ నాయకత్వం వహించాలి : జాప్ డిమాండ్

## -సాక్షి టీవీ లో అమరావతి మహిళ పై అనుచిత వ్యాఖ్యలు

అమరావతి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 7: సాక్షి టీవీ డిబేట్ లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు పైన, అయన వ్యాఖ్యలను అనుమతించిన యాంకర్ కే శ్రీనివాసరావు లపైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఉద్యమస్తున్న అమరావతి మహిళలకు అండగా ఉంటూ వారికీ నాయకత్వం వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ ను జాప్ అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఎందుకు అంటే అయన అమరావతి ఉద్యమం జాయింట్ యాక్షన్ కమిటీ ( జేఏసీ) నుంచి ఆయన చైర్మన్ పదవి పొందారు. ఆ విషయం ప్రభుత్వం కూడా ప్రెస్ నోట్ లో తెలిపింది. కావున అయన పూర్తి భాధ్యత వహించి అమరావతి మహిళలకు పూర్తి మద్దతుగా ఉద్యమం చేయాలనీ కోరారు. ఈ విషయంలో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ (, జాప్) పూర్తి గా సహకరిస్తుందని తెలియజేశారు.

అమరావతి మహిళలు ఎక్కువ శాతం అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతూ ఉంటారని బాధ్యత గల జర్నలిస్ట్ లే చర్చలు నిర్వహించడం ఏమాత్రం అంగీకారం ఇచ్చే అంశం కాదు. అలాంటి చర్చలు జరుగుతున్నా సాక్షి యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం మంచిది కాదు. వెంటనే కె. శ్రీనివాస రావు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మహిళ అయిన హోమ్ మినిస్టర్ వెంటనే స్పందించాలని జాప్ అధ్యక్ష, కార్యదర్శులు కోరారు.

# పల్లె పోరుపై ఉత్కంఠ..

పెద్దపల్లి) స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ నెలకొన్నది. ఏడాది కాలంగా ఇప్పుడు, అప్పుడు అని ఊరిస్తూ వస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తున్నది. ఈ ఎన్నికల్లో ముందు పంచా యతీ ఎన్నికలను నిర్వహిస్తారా, మండల, జిల్లా పరి షత్ ఎన్నికలను నిర్వహిస్తారా అనే విషయమై డైలామా నెలకొన్నది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంటుందని అంతా వేచి చూశారు. కానీ ఆ సమావేశంలో దీని గురించి చర్చించ లేదని తెలుస్తున్నది. ఈ నెల 15న జరిగే ప్రత్యేక కేబినెట్ సమావేశంలో స్థానిక ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కనబడుతున్నాయి. బీసీ రిజర్వేషన్లపై ఎటూ నిర్ణయం తేలక పోవడంతో ఈ ఎన్నికలు జరగడం లేదు. దీంతో స్థానిక సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయి. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నప్పటికీ, అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. రావాల్సిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావడం లేదు.



ప్రత్యేక అధికారుల పాలనలోనే స్థానిక సంస్థలు..

గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ముగిసింది. ఆ వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సిన ప్రభుత్వం నిర్వ హించకుండా ప్రత్యేక అధికారుల పాలన తీసుక వచ్చింది. ఏడాదిన్నర గడుస్తున్నా కూడా ఎన్నికలు నిర్వహించడం లేదు. జూన్, జులై మాసంలో మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాలు, ఈ ఏడాది జనవరి నెలాఖరుతో మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన తీసుకవచ్చారు. ప్రాథమిక సహకార సంఘాల పదవీ కాలం కూడా ముగియడంతో పాలక వర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు పొడిగించారు. స్థానిక సం స్థల ఎన్నికలను సకాలంలో నిర్వహించక పోవడంతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రిజర్వేషన్ల వల్లనే ఆలస్యం..

ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన చేపడతా మని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్, నవంబర్‌లో కుల గణన చేపట్టింది. రాష్ట్రంలో అత్యధికంగా బీసీ కులాలకు చెందిన వాళ్లే ఉన్నారని తేలింది. ఈ కులగణన వల్ల ఎన్నికలు ఆలస్యం అయ్యాయి. అలాగే దీనిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టబద్ధత తీసుకవచ్చారు. రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయాల పరంగా స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. దానిపై కేంద్ర ప్రభుత్వం ఇంకా ఆమోదం తెలపలేదు. జనాభా లెక్కలతో పాటు కుల గణన చేస్తామని ప్రకటించింది. చట్టపరంగా బీసీలకు ఇప్పట్లో 42 శాతం రిజర్వేషన్లు దక్కే అవకాశాలు న్నాయి. అప్పటి వరకు ఎన్నికల నిర్వహణ ఆపితే ప్రభుత్వంపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చే అవకాశా లున్నాయి, పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నది. ఈ నెల 15వ తేదీన జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మంత్రులు కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. అప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందు పంచాయతీ ఎన్నికలా, మండల జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తారా అనే విషయమై వివిధ రాజకీయ పార్టీల నేతల్లో నెలకొన్న ఉత్కంఠ వీడేలా లేదు.

# నాలా విస్తరణకు అడ్డంకులు



కార్పొరేషన్, భద్రకాళి మత్తడి నిర్మాణ పనులకు కొందరు ప్రైవేటు వ్యక్తుల నుంచి అడ్డంకులు మొదలయ్యాయి. నాలా విస్తరించకుండా ప్రజాప్రతినిధుల ద్వారా నీటిపారుదలశాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దానికి బలం చేకూర్చేలా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

హనుమకొండ కాపువాడ మత్తడి నుంచి అలంకార్ పెద్దమోరీ వరకు కచ్చా నాలాను విస్తరించి వరదనీటి కాలువ నిర్మాణానికి హనుమకొండ జిల్లా నీటిపారుదలశాఖ ప్రతిపాదించింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 100 అడుగుల వెడల్పుతో కాలువలు, ఇరువైపులా గోడలు కట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. హంటర్‌రోడ్ బొందివాగు నాలా వరదనీరు నేరుగా భద్రకాళి చెరువులోకి మళ్లించేందుకు ప్రతిపాదించారు. అత్యవసర పరిస్థితుల్లో అతి తక్కువ సమయంలో చెరువును ఖాళీ చేసేందుకు కాపువాడ మత్తడి ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. దీంతోపాటు నాలా విస్తరణ చేపట్టేందుకు నిర్ణయించారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా కచ్చా నాలాను కుదించేశారు. విస్తరణ పనులు చేపడితే స్థలాలు పోతాయని కొందరు పెద్దలు పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

ఎమ్మెల్యే ఆదేశించినా కదలడం లేదు

హనుమకొండ కాపువాడ మత్తడి నాలా ఆక్రమణలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. నాలుగు నెలల క్రితం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నాలాను పరిశీలించారు. రెవెన్యూ, భూమి కొలతలు, గ్రేటర్ వరంగల్ అధికారులు బృందంగా ఏర్పడి సర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. వరదనీటి ప్రవాహాన్ని అంచనా వేసి ఎన్ని అడుగుల నాలా అవసరమో తేల్చాలని కోరారు. ప్రభుత్వశాఖ అధికారులు ఇంత వరకు కదలడం లేదని స్థానికులు అంటున్నారు.

# చిక్కుముడులకు.. భూభారతి చెక్

మహబూబాబాద్: కొత్త రెవెన్యూ చట్టం ద్వారా భూమి సమస్యల పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో వివరాల నమోదులో దొర్లిన పొరపాట్లు.. సరైన పత్రాలు లేకుండా భూమి క్రయవిక్రయాలు, సాగులో ఉన్నా హక్కులు పొందలేక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు.. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 14న అమల్లోకి తెచ్చిన కొత్త ఆర్వోఆర్ చట్టం భూ భారతితో తొలగించేందుకు ప్రయత్నం జరుగుతోంది.

వెంకటాపూర్‌లో 1841 సమస్యలకు పరిష్కారం

భూభారతి చట్టాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు తొలుత రాష్ట్రంలోని నాలుగు మండలాలను ఎంపిక చేయగా ఇందులో ములుగు జిల్లా వెంకటాపూర్‌కు చోటు కల్పించారు.

ఏప్రిల్ 17 నుంచి 30 వరకు నిర్వహించిన గ్రామ సభల్లో వచ్చిన 4,551 అర్జీల్లో దాదాపు 2487 పరిష్కారమైనట్లు అధికారులు తెలిపారు. అర్జీల్లో భూమి కొలతల్లో హెచ్చుతగ్గులు, సర్వే నెంబరు లేకపోవటం, నిషేధిత జాబితాల్లో నమోదవ్వటం, డిజిటల్ సంతకం మ్యూటేషన్ పెండింగ్, సాదాబైనామాలతో భూమి కొనుగోళ్లు, పేర్లు తప్పులు దొర్లటం, వారసత్వ పేచీలు వంటి సమస్యలున్నాయి. వీటిల్లో పేర్లు, వివరాలు సరిచేయటం, వారసత్వ హక్కుల కల్పన, కొలతలు, సర్వే నెంబరు గుర్తింపు వంటి సమస్యలకు సంబంధించి 1841 అర్జీలను పరిష్కరించారు.

మరో 646 సమస్యలకు పరిష్కారం చూపే ప్రక్రియ పూర్తి చేశారు. అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన వారు 503 మంది, చాలా ఏళ్లుగా భూమిని సాగుచేసుకుంటున్నా హక్కు పత్రాలు లేని వారు 143 మంది అర్జీలు పెట్టుకున్నారు. 2017 డిసెంబరు 31కి ముందు అసైన్డ్ భూమి కొనుగోలు చేసినట్లు ఆధారాలుంటే అర్హులుగా పరిగణిస్తారు. ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్న వారు పేదలైతే హక్కు పత్రాలు జారీ చేయొచ్చు. ఈ రెండు నిబంధనలకు లోబడి ఉన్న 646 అర్జీలను ఎంపిక చేశారు. దరఖాస్తుదారుల పేర్లపైకి భూమి బదలాయింపు, హక్కులు కల్పించే ప్రక్రియను ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటికే పూర్తి చేశారు. మార్గదర్శకాలు విడుదల అయ్యాకే వివరాలు బహిర్గతం చేయనున్నారు.

దంతాలపల్లిలో తిరస్కరణకు గురైనవే అధికం..

భూభారతి చట్టం అమలులో భాగంగా రెండో దఫా మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లి మండలాన్ని ఎంపిక చేశారు. 625 దరఖాస్తులు రాగా.. పరిశీలనకు రెండు టీములను ఏర్పాటు చేశారు. దరఖాస్తుల్లో చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయి. అర్జీలతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జత చేయకపోవటం, జత చేసినవి సరైనవి కాకపోవటమే ఇందుకు కారణం. ఇప్పటి వరకు 30 అర్జీలు మాత్రమే అర్హమైనవిగా గుర్తించి సమస్యలను పరిష్కరించారు.

వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన సర్వే నెంబరు 359లో దాదాపు 600 ఎకరాల భూమి విషయంలో వివాదం నెలకొంది.

## 'ఆమె'కు అక్షర వెలుగులు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 7: అతివల్లో అక్షరాస్యత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏటా నిరక్షరాస్యుల గుర్తింపునకు సన్నద్ధమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చదవడం, రాయడం రానివారిని గుర్తించి వారికి పాఠాలు చెప్పించడమే ప్రధాన లక్ష్యం. కాగా ఈసారి ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులపై దృష్టి సారించింది. 19 ఏళ్లు నిండిన వారిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ అన్ ఇన్ సొసైటీ) పేరిట ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మహిళా స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీ) నిరక్షరాస్యులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. జిల్లా విద్యాశాఖ, డీఆర్డీవో అధికారులు ఉల్లాస్‌ను సంయుక్తంగా చేపడుతున్నారు.

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో 22,494 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వారి వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది. సర్వే వివరాలను, వారు చదివిన తరగతుల వారీగా పొందుపర్చారు. పదో తరగతి లోపు మానేసిన వారిని సార్వత్రిక పది, పదో తరగతితో అపేస్తే సార్వత్రిక ఇంటర్ చేసేలా ప్రోత్సహిస్తారు. ఇంటర్ ఉత్తీర్ణత ఉంటే డిగ్రీ చేయించాలని నిర్ణయించారు. పూర్తిగా నిరక్షరాస్యులు ఉంటే



సంఘంలోనే చదువు వచ్చిన వారిని వలంటీరుగా నియమించి అక్షరాలు నేర్పిస్తారు. ఒకవేళ సంఘాల్లో ఎవరు చదువుకున్నవారు లేకుంటే పిల్లలతో ఈ ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించారు. తద్వారా మహిళా సంఘాల సభ్యులు పూర్తిగా అక్షరాస్యత పెరిగి భవిష్యత్‌లో ఉపాధి పొందవచ్చు.

### ఓపెన్ స్కూలింగ్ ద్వారా బోధన..

కేంద్ర ప్రభుత్వం 2009లో సాక్షర భారత్ కార్యక్రమాన్ని పదేళ్ల కాల పరిమితితో ప్రారంభించగా 2018లోనే ముగిసింది. ఆ తర్వాత 2020లో కొత్త విద్యా విదానం అమలులోకి వచ్చింది. దీని ద్వారా అందరికి విద్య అందించేందుకు 2022 నుంచి 2027 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్‌ఐఎల్‌పీ)లో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ 'ఉల్లాస్'కు రూపకల్పన చేసింది. ప్రాథమిక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత కల్పించడంతో పాటు ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమంపై అవగాహన, జీవన నైపుణ్యాలు పెంపొందించి తద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'ఉల్లాస్'ను తెచ్చింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోను కార్యాచరణ ప్రారంభమైంది. 100 శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యానికి అనుగుణంగా ముందుకు వెలుతోంది.

నిరక్షరాస్యులకు రోజులో రెండు గంటల చొప్పున 200 గంటలు బోధిస్తారు. తరగతుల నిర్వహణకు పాఠశాలలు, ప్రభుత్వ కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి డిజిటల్ కంటెంట్‌తో కంప్యూటర్, టీవీలను సమకూర్చనున్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కార్యాచరణ తయారు చేశాం. ఇది వరకే గ్రామసభలు నిర్వహించి ప్రత్యేక సర్వే చేపట్టాం. ఇందులో ఏఏ స్థాయికి చెందిన వారు ఎంత వరకు చదివి ఉన్నారో గుర్తించాం. పూర్తి స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల, జిల్లాస్థాయి అధికారులను సమన్వయ పరుస్తాం. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలు సైతం భాగస్వాములు కావాలి.

## కీలక పోస్టు భర్తీలో జాప్యం..

ఏటూరునాగారం, ే: ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో సహాయ ప్రాజెక్ట్ అధికారి(జనరల్) పోస్టు భర్తీకి నోచుకోవడం లేదు. ఇక్కడ ఏపీవో(జనరల్)గా సుదీర్ఘకాలం పనిచేసిన వసంతరావు బదిలీపై ఉట్నూరు ఐటీడీఏకి వెళ్లిన తర్వాత అక్కడ పని చేస్తున్న కనక భీంరావును ఇక్కడ నియమించారు. ఆయన కొంతకాలం పనిచేసిన తర్వాత గతేడాది డిసెంబర్ 25న అనారోగ్యం కారణంగా కాలం చేశారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంటోంది. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా.. పట్టించుకునే వారు లేరు. ఈ పోస్టుపై రాజకీయపరంగా ఒత్తిడి ఉన్నందునే భర్తీకి నోచుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

పదోన్నతుల్లోనూ ఆలస్యమే.. : గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న అర్హులైన పలువురు అధికారులుండగా, వారి తొలి, చివరి జాబితాలను సిద్ధం చేశారు. అభ్యంతరాలను సైతం స్వీకరించారు. డీపీసీ(డిపార్ట్‌మెంట్ ప్రమోషనల్ కమిటీ) నిర్వహించడంలో ఆలస్యం జరుగుతోంది. కమిటీ సమావేశం పూర్తి చేసి అర్హత కలిగిన వారికి ఏపీవో(జనరల్)గా పదోన్నతి కల్పించి పోస్టింగు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను పూర్తి చేయడంలో గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్రస్థాయి కార్యాలయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పాలకులు సైతం దీనిపై పెదవి విప్పడం లేదు. ఏపీవో జనరల్‌గా పని చేస్తున్న ఎవరినో ఒకరిని ఏటూరునాగారం ఐటీడీఏలో డిప్యుటేషన్ వేయాలని పాలకులు చూస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎంతో కీలకం.. : ఐటీడీఏ పరిపాలన విభాగంలో పీవో తర్వాత అత్యంత కీలకమైన పోస్టు ఏపీవో(జనరల్). ఈ పోస్టు ఇంతకాలం ఎప్పుడూ ఖాళీగా లేదు. కేవలం పాలకులు తమకు అనుకూలమైన వారిని నియమించుకోవాలనే ఉద్దేశంతో భర్తీ చేయకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఆరు నెలలుగా ఖాళీగా ఉండడంతో గిరిజనాభివృద్ధి సైతం కుంటుపడుతోంది. అడవి బిడ్డలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు అందడం లేదు. ఇప్పటికైనా అర్హులైన వారిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని రోజులుగా ఏపీవో(జనరల్) పోస్టు ఖాళీగా ఉన్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదనలో ఉంది. త్వరలోనే భర్తీ చేస్తాం.

# 60 డివిజన్లు..1.79లక్షల ఓటర్లు

మంచిర్యాల, జూన్ 7: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తుదిరూపం దిద్దుకోనుంది. ఇప్పటికే కార్పొరేషన్‌గా ప్రకటిస్తూ గెజిట్ కూడా విడుదలైంది. మొత్తంగా లక్ష79వేల 516 మంది ఓటర్లతో 60 డివిజన్లుగా అవతరించనుంది. ఇందుకు సంబంధించిన డివిజన్ల ప్రక్రియ పూర్తికాగా ఈ నెల 11 వరకు అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అలాగే 12 నుంచి 16వ తేదీ వరకు స్వీకరించిన అభ్యంతరాలపై కసరత్తు చేసి కలెక్టర్ ఆమోదం తీసుకోనున్నారు. 19న పురపాలకశాఖకు నివేదించి, 21వ తేదీన




తుది ముసాయిదా జాబితా విడుదల చేయనున్నారు. దీంతో డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పూర్తి కానుంది. ఒక్కో డివిజన్‌లో 2700 నుంచి 3300 వరకు ఓటర్లను కేటాయించారు.

మున్సిపాలిటిగా ఉన్న మంచిర్యాలలో సమీప గ్రామాలు, నస్పూర్ మున్సిపాలిటీని కలిపి ప్రభుత్వం కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. సమీప గ్రామాలైన వేంపల్లి, కొత్తపల్లి, ముల్కల్ల, గుడిపేట, నర్సింగాపూర్, చందనాపూర్‌తో పాటు నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్, సీతారాంపల్లి, సీసీసీ, నస్పూర్ గ్రామాలను విలీనం చేశారు. ప్రస్తుతం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 2,48,283 మంది జనాభా ఉన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో ప్రభుత్వం ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తోంది. వార్డుల విభజన ప్రక్రియ పూర్తికాగానే రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికలకు సమాయత్తం కావాలని సీఎం సూచించిన నేపథ్యంలో అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ముందే పురపాలక సంఘాల సమరానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. జూలై మూడోవారంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు 2025 జనవరి 28న ముగిసింది. దీంతో అప్పటి నుంచి మున్సిపాలి టీలు ప్రత్యేక అధికారుల పాలనలో నడుస్తున్నాయి. దీంతో అధికారులపైన అదనపు భారం పడి అభివృద్ధిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు మున్సిపల్ కార్పొరేషన్‌కు పాలకమండళ్లు లేకపోవడంతో కేంద్రప్రభుత్వం ప్రతీ సంవత్సరం విడుదల చేసే నిధులు కూడా నిలిచిపోయాయి. దీంతో అభివృద్ధి కుంటుపడుతుందని భావిస్తున్న ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం ద్వారా మున్సిపాలిటీలను బలోపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే గ్రామాలు పంచాయతీల్లో వార్డుల విభజన ప్రక్రియ ముగియగా ఓటరు జాబితాలు సైతం సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో పట్టణాల్లో వార్డుల విభజన చేపట్టగా ఆ ప్రక్రియ పూర్తికాగానే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు భావిస్తున్నాయి. రిజర్వేషన్లు కూడా త్వరలో ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

మంచిర్యాల కార్పొరేషన్‌లో వార్డుల విభజన ముగియడం త్వరలో రిజర్వేష న్ ప్రక్రియ కూడా చేపట్టనుండడంతో వివిధ డివిజన్లకు పోటి చేసే ఆశావహు లు అందుకు సిద్ధపడుతున్నారు. కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను టికెట్లు పొందేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

# జిల్లాలో సరిపడా సన్నబియ్యం నిల్వలు

నస్పూర్, జూన్ 7: జిల్లాలో సన్న బియ్యం నిల్వలు పంపిణీకి సరిపడా ఉన్నాయని, కార్డుదారులు ఆందోళన చెందాల్సినవరం లేదని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని 5,8 నంబర్ల రేషన్ షాపులను గురువారం కలెక్టర్ సందర్శించి బియ్యం పంపిణీ



ప్రక్రియను పరిశీలించారు. కార్డుదారు లతో కలెక్టర్ మాట్లాడారు. పంపిణీ జరుగుతున్న తీరు ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబందించిన రేషన్ బియ్యంను ఈ నెల 30వ తేదీ వరకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తామన్నారు. సాంకేతిక సమస్య తలెత్తితే ఈ-పాస్ ఇంజనీర్లు పరిష్కారం చేస్తారని, సజావుగా పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకుంటమన్నారు. సన్న బియ్యం నిల్వలు పంపిణీకి సరిపడా ఉన్నయని, కార్డుదారులు ఆందోళన చెందాల్సినవరం లేదన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉంటుం దని, నిల్వలు అవసరం ఉన్నట్లయితే వెంటనే సంప్ర దిస్తే తక్షణమే సరఫరా చేస్తామని కలెక్టర్ అన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుం టున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్‌లో గల ఈవీం గోదామును ప్రత్యేక ఉపపాలనాధికారి డి చంద్రకళ, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లా డుతూ ఈవీఎం గోదాంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సంబంధిత సామగ్రిని భద్రపరిచి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. త్రైమాసిక పరిశీనలో భాగంగా అధికారులు, పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎంలను పరిశీలించామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవే క్షించడం జరుగుతుందని, భద్రత సిబ్బంది పర్యవేక్షణ లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

లక్షెట్టిపేట, జూన్ 7 పర్యావరణం కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి డి రమమోహన్ రెడ్డి అన్నారు. లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్‌తో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ పర్యావరణం పెంపొందించాలంటే విధిగా ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని కూడా పూర్తిగా తగ్గించుకోవాలని సూచించారు. మొక్కలు, చెట్లు లేకపోవడంతోనే రోజు రోజుకు



భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని, అడవుల్లో చెట్లు లేక జంతువులు జనవాసాల్లోకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట అటవీక్షేత్ర అధికారి అత్తె సుభాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ఏజీపీ సత్యం, సీనియర్ న్యాయవాదులు అక్కల శ్రీధర్, కారుకూరి సురేందర్, రవీందర్‌రావు, నళినికాంత్, నేరెళ్ల పద్మ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో బాగంగా మున్సిపాలిటీ ఆద్వర్యంలో పలు వార్డుల్లో సిబ్బంది మొక్కలను నాటారు. ప్రజలకు తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్స్ ప్రశాంత్, నరేష్ తో పాటు సిబ్బంది కట్ల రాకేష్, శంకరయ్య ఉన్నారు.

మంచిర్యాలకలెక్టరేట్: ప్రతీ పౌరుడు ప్రకృతిని, పర్యా వరణాన్ని పరిరక్షించేందుకు పాటుపడాలని వాల్టా అథారిటీ సభ్యుడు గుండేటి యోగేశ్వర్ సూచించారు. గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్‌మణికుమార్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. పరిసరాల్లో పలు మొక్కలను నాటారు. జీవ జాతులకు హాని చేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని, ప్రకృతి పర్యావర ణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, డీజీఎం అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: ప్రతీఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు తెలిపారు. గురువారం ప్రపం చ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అ నంతరం మొక్కలు నాటారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు ముందుండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపెల్లి శంకర్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులతో మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాలకలెక్టరేట్: మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మంచి ర్యాలలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడే దిశగా ముం దుకు వెళ్లాలని సూచించారు. దుర్గం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం

రుద్రంగి, జూన్ 7 : పేద ప్రజలకు ఉచిత వైద్యం అందజేయడం ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో కోటి 43 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న 30పడకల ఆసుపత్రి పనులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుందని అన్నారు. వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, అందుకోసం ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం ముం దుకు పోతోందన్నారు. ఆనాడు రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజలకు ఉచిత వైద్యం అందజేయాలని ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేస్తే, ప్రజా ప్రభు త్వంలో ముఖ్యమంత్రి



రేవంత్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచారన్నారు. వైద్యపరంగా పేదలకు మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రుద్రంగి మండల కేంద్రానికి రూ.42 కోట్లతో ఏటీసీ సెంటర్, రూ.200 కోట్లతో వేములవాడ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశా మని, పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రుద్రంగి మండలకేంద్రంలో ఆసుపత్రి నిర్మా ణం పూర్తయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగక రంగా ఉంటుందని, 10 సంవత్సరాలుగా ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డులను మంజూరుచేశా మన్నారు. ఈప్రాంతంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించు కుంటూ ముందుకు పోతున్నామన్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్‌వోసీల ద్వారా సుమారు 20 కోట్ల రూపాయలు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వేముల వాడ నియోకవర్గంతో పాటు రుద్రంగి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకలు తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేశిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, కొమిరె శంకర్, పల్లి గంగాధర్, ఎర్రం రాజలిం గం, స్వర్గం పరంధాములు, పిడుగు లచ్చిరెడ్డి, దయ్యాల శ్రీనివాస్, గండి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం..

వరంగల్ విద్యావిభాగం,లప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజే ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. గతేడాది పుస్తకాల పంపిణీలో ఆలస్యం కావడంతో ఈ ఏడాది ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. రాష్ట్ర విద్యాశాఖ



నుంచి హనుమకొండ కిషన్‌పురలోని గోదాంకు పాఠ్య పుస్తకాలు చేరాయి. వాటిని జిల్లాలోని 14 ఎమ్మార్సీలకు పంపిణీ చేశారు. అక్కడి నుంచి బడులకు సరఫరా చేశారు. దశల వారీగా పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది.

జిల్లాలో 304 ప్రాథమిక, 60 ప్రాథమికోన్నత, 128 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో మొత్తం 30,922 మంది చదువుతున్నారు. గతేడాది వరకు 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు రాత పుస్తకాలు అందించారు. ఈ ఏడాది ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు సైతం అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.ప్రభుత్వం బాల బాలికలకు ఏకరూప దుస్తులు అందిస్తోంది. జిల్లాలో బాలురు 14,852 మంది, బాలికలు 16,070 మంది ఉన్నారు. ఒక జత దుస్తులను అందించనున్నారు. రెండో జత ఆగస్టులో అందించడానికి ప్రణాళిక చేశారు. ఇప్పటికే కొలతలు తీసుకొని డీఆర్‌డీఏ, మెపా మహిళ సమాఖ్య సంఘాల ద్వారా 96 శాతం దుస్తులు కుట్టించారు. ఎమ్మార్సీలకు సరఫరా చేయడానికి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని ఎమ్మార్సీలకు పాఠ్య పుస్తకాలు చేరాయి. అటు నుంచి పాఠశాలలకు సిబ్బంది చేరవేస్తున్నారు. రాత పుస్తకాలను ప్రత్యేక వాహనాల్లో నేరుగా బడులకు తరలిస్తున్నారు. 90 శాతం సరఫరా చేసినట్లు డీఈవో వాసంతి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# బంగారు రుణాలపై ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలు విడుదల



దిల్లీ: బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటి ప్రకారం రుణదాతలు ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల ఆధారంగా రుణాలను మంజూరు చేయడానికి వీల్లేదు. బంగారం నాణ్యతతోపాటు, తాకట్టు తేదీకి తొలి 30 రోజుల్లో నగటు ముగింపు ధరను పరిగణనలోకి తీసుకోవాలి. లేదంటే ముందురోజు ముగింపు ధర ప్రకారమైనా రుణ గ్రహీతకు ఎంత మొత్తం అప్పుగా ఇవ్వొచ్చన్నది లెక్కించుకోవచ్చు. రూ.2.5 లక్షల కంటే తక్కువ రుణాలు తీసుకునే వారికి లోన్-టు-వాల్యూ (ఎల్‌టీవీ) 85 శాతంగా ఆర్బీఐ నిర్ణయించింది. అలాగే, రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 80 శాతం, రూ.5 లక్షలు దాటిన రుణాలకు 75శాతంగా నిర్ణయించింది.

తాకట్టు పెట్టే బంగారం వస్తువుల రూపంలో ఉంటే ఒక కేజీ, వెండి అయితే 10 కేజీలకు మించకూడదు.

గోల్డ్ కాయిన్స్ రూపంలో ఉంటే ఒక్కో కాయిన్ 50 గ్రాములకు, వెండి కాయిన్స్ అయితే 500 గ్రాములకు మించరాదు.

ఒక వేళ రుణాన్ని తిరిగి చెల్లిస్తే.. అదే రోజున తాకట్టు పెట్టిన బంగారాన్ని ఇవ్వాలి.

కొన్ని సందర్భాల్లో గరిష్ఠంగా ఏడు పని దినాలకు మించకుండా బంగారాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది.

అంతేకాకుండా రుణదాతకు, రుణ గ్రహీతకు మధ్య జరిగిన ఒప్పందంలో ఉండాల్సిన వివరాలను కూడా ఆర్బీఐ స్పష్టం చేసింది.

తాకట్టు పెట్టే వస్తువుల వివరాలను, వాటి విలువను కచ్చితంగా పేర్కొనాలి.

అప్పు తిరిగి చెల్లించకపోతే వేలం ప్రక్రియ ఎలా ఉంటుంది? దానికి సంబంధించిన వివరాలు డాక్యుమెంట్‌లో స్పష్టంగా ఉండాలి

వేలానికి ముందు అప్పును తిరిగి చెల్లించేందుకు రుణ గ్రహీతకు ఇవ్వాల్సిన నోటీసు వ్యవధిని కూడా పేర్కొనాలి.

ఒక వేళ తిరిగి చెల్లించకపోతే.. వేలం నుంచి మిగిలిన మొత్తాన్ని చెల్లించే వివరాలను కూడా డాక్యుమెంట్‌లో పేర్కొనాలి.

కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సూచన మేరకు ఆర్‌బీఐ తన మార్గదర్శకాలను సవరించినట్లు సమాచారం. పసిడి రుణాల విషయంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఒకేతరహా నిబంధనలు ఉండాలన్న ఉద్దేశంతో ఆర్‌బీఐ ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసిన సంగతి తెలిసిందే.

# ముంబయి ఐసీటీకి ముకేశ్ అంబానీ రూ.151 కోట్ల భారీ విరాళం



ముంబయి: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. తాను చదువుకున్న ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి రూ.151 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించారు. ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎంఎం శర్మ జీవిత చరిత్ర 'డివైన్ సైంటిస్ట్' పుస్తకావిష్కరణ సభకు హాజరైన సందర్భంగా ఈ ప్రకటన చేశారు. ఈ మొత్తాన్ని దేనికైనా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. 1970లో ఐసీటీ నుంచి ముకేశ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. గతంలో దీన్ని యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీగా వ్యవహరించేవారు.

ఐసీటీలో మూడు గంటలకు పైగా గడిపిన ముకేశ్ అంబానీ.. తన ప్రసంగంలో యూడీసీటీలో తాను చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రొఫెసర్ శర్మతో అనుబంధం, తర్వాతి కాలంలో ఆయన భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు ఎలా శ్రీకారం చుట్టిందీ వెల్లడించారు. భారత పరిశ్రమను లైసెన్స్ పర్మిట్ రాజ్ నుంచి విముక్తి కలిగిస్తేనే భారతదేశం పారిశ్రామిక దేశంగా వృద్ధి చెందుతుందని, ప్రపంచంలోని ఇతర దేశాలతో పోటీపడడం సాధ్యమవుతుందని శర్మ చెప్పేవారన్నారు. ఇదే విషయాన్ని పాలకులకు వివరించడంలో సఫలీకృతులయ్యారని పేర్కొన్నారు. తన తండ్రి ధీరూబాయ్ అంబానీలానే దేశాన్ని పారిశ్రామికంగా ఉన్నతంగా తీర్చిదిద్దాలని తపించేవారని పేర్కొన్నారు. ఆయనను 'గురు ఆఫ్ భారత్'గా కొనియాడారు. ఆయనకు గురుదక్షిణగా ఐసీటీకి రూ.151 కోట్లు విరాళం ఇస్తున్నట్లు అంబానీ ప్రకటించారు.

# నూనెలపై సుంకం తగ్గింపుతో ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీలకు జోష్



దిల్లీ: పామాయిల్, సోయా, పొద్దుతిరుగుడు పువ్వు నూనె వంటి వంటనూనెలపై దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయం ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల్లో జోష్ నింపనుంది. ఈ నిర్ణయం వల్ల ఆయా కంపెనీల మార్జిన్లు మెరుగుపడడంతో పాటు, ముడి పదార్థాల వ్యయాలు స్థిరంగా కొనసాగగలవని విశ్లేషకులు పేర్కొన్నారు. 2025 మే 31 నుంచి అమల్లోకి వచ్చేలా ముడి వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని కేంద్రం గత వారం 10% తగ్గించిన సంగతి తెలిసిందే.

ఎందుకు ప్రయోజనమంటే: పామాయిల్‌ను సబ్బులు, ఆహార ఉత్పత్తుల తయారీలో కీలక ముడివనరుగా ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలు వినియోగిస్తుంటాయి. ఆహార కంపెనీల ముడిపదార్థాల వ్యయాల్లో 25-30% వాటా పామాయిల్‌దే. సబ్బు తయారీ కంపెనీలకు వాడే పామ్ ఫాటీ యాసిడ్ డిస్టిలేట్ (పీఎఫ్ఏడీ) ధరలూ తగ్గుతాయి. అదే సమయంలో వినియోగదార్లు సైతం పామాయిల్‌ను వంటనూనెగా వినియోగిస్తుంటారు కాబట్టి వారి నెలవారీ ఖర్చు తగ్గుతుంది.

ఈ కంపెనీలకు ఊరట: ఆహార వ్యాపారంలో ఉన్న బీకాజీ ఫుడ్స్, బ్రిటానియా, నెస్లే, ఐటీసీ వంటి ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలకు ప్రయోజనం. అలాగే పీఎఫ్ఏడీ ధరలు తగ్గడం వల్ల సబ్బులు తయారు చేసే హెచ్‌యూఎల్, గోద్రేజ్ కన్జ్యూమర్‌లకూ ఊరట దక్కినట్లే.

ద్రవ్యోల్బణంపైనా ప్రభావం: పామాయిల్ ధరలు పెరగడంతో ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలు మార్చి త్రైమాసికంలో తమ ఉత్పత్తుల ధరలను పెంచాల్సి వచ్చింది. అయితే వ్యయ భారాన్ని మొత్తం వినియోగదార్లకు బదిలీ చేయలేదు. ఇపుడు సుంకం తగ్గింపు వల్ల ఇక ధరల పెంపు ఉండదు. దీని వల్ల ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుంది.

# ఇన్ఫోసిస్‌కు ఊరట.. రూ.32 వేల కోట్ల జీఎస్‌టీ నోటీసు నుంచి క్లీన్ చిట్




దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ కు భారీ ఊరట లభించింది. రూ.32,403 కోట్ల జీఎస్‌టీ నోటీసుకు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ ( నుంచి క్లీన్ చిట్ వచ్చింది. ఈ విషయాన్ని ఇన్ఫోసిస్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. 2018-19 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ప్రీ-షో కాజ్ నోటీసు ప్రొసీడింగ్స్‌ను మూసివేస్తున్నట్లు డీజీజీఐ నుంచి తమకు సమాచారం అందినట్లు పేర్కొంది.

2017 నుంచి 2022 మధ్య ఇన్ఫోసిస్ విదేశీ శాఖల్లో జరిగిన వ్యయాలకు సంబంధించి రూ.32,403 కోట్ల జీఎస్‌టీ నోటీసు 2024 జులైలో ఇన్ఫోసిస్ అందుకుంది. ఈ ప్రీ-షోకాజ్ నోటీసును కర్ణాటక రాష్ట్ర జీఎస్‌టీ అధికారులు జారీ చేశారు. విదేశీ శాఖల నుంచి దిగుమతి చేసుకున్న సేవలపై రివర్స్ ఛార్జ్ మెకానిజం కింద ఈ నోటీసు పంపారు. ఈ మొత్తం 2025 జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయంలో 85 శాతానికి సమానం. డీజీజీఐ జారీ చేసిన నోటీసులపై ఇన్ఫోసిస్ అప్పట్లోనే స్పందించింది. గతంలో తమపై ఉన్న అన్ని జీఎస్‌టీ బాకీలను చెల్లించామని, కేంద్ర, రాష్ట్ర నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నట్లు తెలిపింది. తాజాగా ఈ నోటీసుకు సంబంధించి ప్రొసీడింగ్స్‌ను మూసివేసినట్లు డీజీజీఐ వెల్లడించడంతో ఆ మేర ఇన్ఫోసిస్‌కు ఊరట లభించింది.

# రేట్ల కోతతో సూచీలు రయ్.. రయ్..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రేట్లను 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించడం.. మన స్టాక్ మార్కెట్లో జోష్ నింపింది. నగదు నిల్వల నిష్పత్తిలో (సీఆర్ఆర్) 1% కోత విధించడం వల్ల డిసెంబరు కల్లా బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.2.50 లక్షల కోట్ల అదనపు నిధులు వచ్చే వీలుండటంతో వడ్డీ రేట్ల ప్రభావిత రంగాల షేర్లు దూసుకెళ్లాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 747 పాయింట్ల మేర లాభపడగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ తిరిగి 25,000 పాయింట్ల ఎగువకు వెళ్లింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 11 పైసలు పెరిగి 85.68 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.62% పెరిగి 66.39 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, తైవాన్ మినహా మిగతా ప్రధాన దేశాల స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లూ లాభాల్లోనే మొదలయ్యాయి.

స్వల్ప నష్టాల్లో మొదలైనా..

బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం రోజు ముగింపు (81,442.04)తో పోలిస్తే స్వల్ప నష్టంతో 81,434.24 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత వెంటనే లాభాల్లోకి వచ్చి, చివరివరకు అదే ఒరవడిలో సాగింది. ఒక దశలో 82,299.89 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరినా, చివరకు 746.95 పాయింట్ల లాభంతో 82,188.99 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 252.15 పాయింట్లు పెరిగి 25,003.05 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,671.45 పాయింట్ల వద్ద కనిష్ఠాన్నిబీ 25,029.50 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

రెండు మినహా మిగతావి రాణింపు

సెన్సెక్స్ 30 షేర్లలో సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగతా 28 కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్ 4.93%, యాక్సిస్ బ్యాంక్ 3.15%, మారుతీ సుజుకీ 2.77%, ఇండస్ఇండ్ బ్యాంక్ 2.5%, ఎటెర్నల్ 2.10%, ఎంఅండ్ఎం 2.02%, టాటా స్టీల్ 2.01%, టైటన్ 1.64%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.6% చొప్పున పెరిగాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో స్థిరాస్తి 4.74%, ఆర్థిక సేవలు 1.79%, లోహ 1.56%, వాహన 1.5%, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1.3%, బ్యాంకెక్స్ 1.25% రాణించాయి. ఇండస్ట్రియల్స్, భారీ యంత్రపరికరాల సూచీలు డీలాపడ్డాయి.

# అదానీ ఎయిర్‌పోర్ట్‌తో ఆకాశ ఎయిర్ ఒప్పందం

%ముంబయి: అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ (ఏఏహెచ్ఎల్)తో ఆకాశ ఎయిర్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఏడాది ఆగస్టులో కార్యకలాపాలు ప్రారంభమయ్యే అదానీకి చెందిన నవీ ముంబయి విమానాశ్రయం నుంచి ఆకాశ ఎయిర్ విమానాలు నడపనుంది. తొలుత నవీ ముంబయి ఎయిర్‌పోర్ట్ నుంచి 15 దేశీయ సర్వీసులు నిర్వహిస్తామని, శీతాకాల షెడ్యూల్ చివరికి ఈ సంఖ్యను 50కు పెంచుతామని ఆకాశ ఎయిర్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ వినయ్ దూబే పేర్కొన్నారు. ఇప్పటికే ఇండిగో కూడా కొత్త ఎయిర్‌పోర్ట్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అదానీతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దిల్లీ విమానాశ్రయంలో 3 నెలల పాటు విమాన సర్వీసుల రద్దు: దిల్లీ విమానాశ్రయంలో రన్‌వే ఆధునికీకరణ పనుల కారణంగా ఈనెల 15 నుంచి సెప్టెంబరు 15 వరకు పలు విమాన సర్వీసులు రద్దు కానున్నాయి. వివిధ సంస్థల సర్వీసులు ఇందులో ఉన్నాయి. మొత్తం రోజువారీ విమాన సర్వీసుల్లో 7.5 శాతానికి సమానమైన 114 విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు దిల్లీ విమానాశ్రయాన్ని నిర్వహించే డయల్ తెలిపింది.

# ఐపీఓ క్యాలెండర్: 3 సబ్‌స్క్రిప్షన్లు.. ఒక్కటే లిస్టింగ్




స్టాక్ మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు వచ్చే వారంలో మూడు కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి వస్తున్నాయి. ఈ మూడు సంస్థలు ఎస్ఎంఈ విభాగం నుంచే రానున్నాయి. ఇక ఇప్పటికే సబ్‌స్క్రిప్షన్ పూర్తి చేసుకున్న ఓ కంపెనీ వచ్చే వారంలో లిస్ట్ కానుంది. గత నెలలో ఏడు కంపెనీలు మెయిన్‌బోర్డ్ లిస్టింగ్‌లు రాగా.. వచ్చే వారంలో ప్రధాన బోర్డు నుంచి ఒక్క ఐపీఓ కూడా లేదు.

సచీరోమ్ లిమిటెడ్

ఎస్ఎంఈ విభాగం నుంచి సచీరోమ్ లిమిటెడ్ ఐపీఓకు వస్తోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా మొత్తం రూ.61.62 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ జూన్ 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఈ ప్రక్రియ మొత్తం తాజా షేర్ల జారీ ద్వారా నిర్వహించనుంది. 60.41 లక్షల షేర్లు జారీ చేయనుంది. ధరల శ్రేణి రూ.96-102గా నిర్ణయించారు.

జైనిక్ పవర్ అండ్ కేబుల్స్ లిమిటెడ్

అల్యూమినియం వైర్ రాడ్స్ తయారీ సంస్థ జైనిక్ పవర్ అండ్ కేబుల్స్ లిమిటెడ్ (%జీఱఅఱష ూశీషవతీ ఖఱఅ జుఎజీవం ౹ఱఎఱ్‌వం%) పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.51.30 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతోంది. ధరల శ్రేణి రూ.100- 110గా ఉంది. ఈ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ జూన్ 10న ప్రారంభమై 12తో ముగుస్తుంది. ఇష్యూలో భాగంగా 46.63 లక్షల తాజా షేర్లను జారీ చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా తాజా షేర్ల జారీ ద్వారా జరగనుంది.

మోనోలిథిష్ ఇండియా లిమిటెడ్

రూ.82.02 కోట్లు సమీకరించాలనే లక్ష్యంతో ఎస్ఎంఈ విభాగం నుంచి మోనోలిథిష్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఐపీఓలో భాగంగా 57.36 లక్షల షేర్లు జారీ చేయనుంది. సబ్‌స్క్రిప్షన్ జూన్ 12న ప్రారంభమై 16న ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.135-143గా కంపెనీ నిర్ణయించింది.

# మౌనంగా చూస్తూ ఉండలేం: బెంగళూరు తొక్కిసలాట ఘటనపై బీసీసీఐ సీరియస్

ఆర్సీబీ విజయోత్సవ పరేడ్ వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. 11మంది మృతికి కారణమైన ఈ ఘటనను బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వేడుకల నిర్వహణకు మార్గదర్శకాల జారీకి ఆలోచన చేస్తోంది. ఈమేరకు బీసీసీఐ (%దీజజ×%) సెక్రటరీ దేవాజిత్ సైకియా మీడియాతో మాట్లాడారు



“మేం మౌనంగా చూస్తూ ఉండలేం. ఏదోఒకటి చేయాలి. ఇది ఆర్సీబీకి సంబంధించిన ప్రైవేటు వ్యవహారం. కానీ ఈ దేశంలో క్రికెట్ వ్యవహారాలకు మేం బాధ్యత తీసుకోవాల్సిందే. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రయత్నిస్తున్నాం” అని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై టీమ్ఇండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించిన సంగతి తెలిసిందే. “నేను ఆడేటప్పుడైనా.. ఇప్పుడైనా, భవిష్యత్తులోనైనా సరే.. విజయోత్సవ ర్యాలీలను నేను సమర్థించను. ఇలాంటివి ప్రజల జీవితాలను ప్రమాదంలో పడేస్తాయి. గెలవడం ముఖ్యం.. వేడుకలు కాదు. అన్నింటికంటే వ్యక్తులు జీవితాలు ముఖ్యం. కాబట్టి మనం ఎలాంటి పరిస్థితులకైనా సిద్ధంగా లేకపోతే.. ఈ రోడ్‌షోలు నిర్వహించకపోవడమే మంచిది” అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

బుధవారం సాయంత్రం చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. తాజాగా కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఇ.ఎస్. జైరాం తమ పదవులకు రాజీనామా చేశారు. ఆర్సీబీ (%=జదీ%) యాజమాన్యం, కేఎస్‌సీఏ (%ఖూజాూ%) అధ్యక్షుడు రఘురామ్ భట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్‌ను బాధ్యులుగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇప్పటికే బెంగళూరు నగర కమిషనర్ బి.దయానంద్‌ను సస్పెండ్ చేయగా.. సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శిని విధుల నుంచి తొలగించారు. మరికొందరు ఉన్నతాధికారులపైనా బదిలీ/సస్పెన్షన్ వేటు పడింది.ఇక, ఈ ఘటనకు సంబంధించిన ఆర్‌సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసలెతో పాటు డీఎన్ఏ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు సునీల్ మ్యాథ్యూ, కిరణ్, సుమంత్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

# ఓపెనర్‌గా రాహుల్ వద్దు.. శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో రావాలి: ఆసీస్ మాజీ కెప్టెన్

: ఇంగ్లాండ్, భారత్ మధ్య జూన్ 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టును ప్రకటించారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా 18 మంది సభ్యుల జట్టును ఎంపిక చేశారు. టీమ్ఇండియా ఇప్పటికే యూకేకు చేరుకుంది. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ( ) రిటైర్మెంట్ ప్రకటించడంతో తుది జట్టు కూర్పు ఎలా ఉంటుందనే దానిపై ఆసక్తి నెలకొంది. కేఎల్ రాహుల్ , యశస్వి జైస్వాల్‌ను ఓపెనర్లుగా పంపుతారని వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌కు ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ () కొన్ని సూచనలు చేశాడు. సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్‌ను ఓపెనర్లుగా పంపాలని సూచించాడు.



‘సాయి సుదర్శన్ నాకు క్లాస్, టెక్నికల్ ప్లేయర్‌గా కనిపిస్తున్నాడు. ఇంగ్లాండ్‌లో అతను యశస్వి జైస్వాల్‌తో ఓపెనింగ్ చేస్తాడని భావిస్తున్నాను. సుదర్శన్ టెస్టుల్లో బాగా రాణిస్తాడని అనుకుంటున్నా. ఓపెనర్లుగా ఇద్దరు యువ ఆటగాళ్లు ఉంటే మూడో స్థానంలో అనుభవం ఉన్న కేఎల్ రాహుల్ లేదా కరుణ్ నాయర్‌ను ఆడించొచ్చు. ఇలా జరిగితే శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో వచ్చే అవకాశముంది. యువ కెప్టెన్ అయిన గిల్‌కు ఇది లాభం చేకూరుస్తుంది. ఎందుకంటే ఓపెనింగ్ లేదా మూడో స్థానంలో అతను బ్యాటింగ్ చేయాల్సిన అవసరం లేదు. ఇంగ్లాండ్ సిరీస్‌లో టీమ్ఇండియా టాప్-5 బ్యాటర్లలో సుదర్శన్, జైస్వాల్, రాహుల్, గిల్, కరుణ్ నాయర్ ఉండొచ్చు’ అని ఐసీసీ రివ్యూలో పాంటింగ్ పేర్కొన్నాడు.

జూన్ 13న ప్రారంభమయ్యే టీమ్ఇండియా ఇంట్రా-స్క్వాడ్ మ్యాచ్ తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌పై జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంటుందని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంగ్లాండ్‌కు బయలుదేరేముందు పేర్కొన్నాడు. ‘బ్యాటింగ్ ఆర్డర్‌పై మేము నిర్ణయం తీసుకోలేదు. మాకు ఇంకా కొంత సమయం ఉంది. మేము ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడతాము. లండన్‌లో 10 రోజుల శిబిరం ఉంటుంది. అక్కడికి వెళ్లిన తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌పై నిర్ణయం తీసుకోవచ్చని అనుకుంటున్నాను. టెస్టు జట్టుకు సారథ్యం వహించడం పెద్ద బాధ్యత. ఈ గొప్ప సవాలు (ఇంగ్లాండ్ సిరీస్) కోసం ఎదురుచూస్తున్నాము’ అని గిల్ అన్నాడు.

# ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్... టీమ్ఇండియా ఫైనల్ XIని ఎంపిక చేస్తారా?

ఇంగ్లండ్‌లో భారత క్రికెట్ జట్టు పర్యటన త్వరలో మొదలవుతుంది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ జూన్ 20న లీడ్స్‌లో మొదలవుతుంది. ఇప్పటికే భారత జట్టు ను సెలక్షన్ కమిటీ ప్రకటించింది. మరి ఫైనల్ %శ×%లో ఎవరుంటే బాగుంటుంది అనేది మీరు చెబుతారా? దిగువ పోల్‌లో మీ అభిప్రాయం తెలియజేయండి.



# ఫైనల్లో అల్కరాస్ సినర్

పారిస్: అల్కరాస్‌కు, టైటిల్‌కు ఒక మ్యాచే అడ్డు. ఫ్రెంచ్ ఓపెన్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడుతున్న ఈ రెండో సీడ్.. అదే జోరుతో ఆఖరి పోరుకు వచ్చేశాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అల్కరాస్ 4-6, 7-6 (7-3), 6-0, 2-0తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి లొరెంజో ముసెటి (ఇటలీ) గాయంతో వైదొలిగాడు. ఈ మ్యాచ్‌లో తొలి సెట్లో ముసెటి నుంచి అల్కరాస్‌కు గట్టిపోటీ ఎదురైంది. తొమ్మిదో గేమ్‌లో అతడి సర్వీస్ బ్రేక్ చేసిన ఎనిమిదోసీడ్ ముసెటి 5-4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే ఊపు కొనసాగించి తొలి సెట్ చేజిక్కించుకున్నాడు. ఆరంభ సెట్లో అల్కరాస్ 16 అనవసర తప్పిదాలు చేశాడు. మొదటి సెట్‌తో పోలిస్తే రెండో సెట్లో అల్కరాస్ మెరుగ్గా ఆడాడు. హోరాహోరీగా సాగిన ఈ సెట్ పదకొండో గేమ్‌లో ముసెటి సర్వీస్‌ను బ్రేక్ చేసిన అతడు 6-5తో ఆధిక్యంలోకి వెళ్లాడు. వెంటనే ముసెటి కూడా బ్రేక్ చేయడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో సర్వీసులతో అదరగొట్టిన అల్కరాస్..సెట్ గెలుచుకున్నాడు. ఇక అక్కడ నుంచి అల్కరాస్‌కు ఎదురులేకుండాపోయింది. మూడో సెట్లో ఈ స్పెయిన్ స్టార్ దూకుడు ముందు ముసెటి నిలవలేకపోయాడు. 16 నిమిషాల్లోనే 5-0తో ఆధిక్యంలోకి వెళ్లిన అల్కరాస్.. అదే దూడుకుతో అలవోకగా సెట్ నెగ్గి ఆధిక్యంలోకి వెళ్లాడు. నాలుగో సెట్లోనూ అల్కరాన్ అదే జోరు ప్రదర్శించాడు. అతడు 2-0తో ఆధిక్యంలోకి వెళ్లిన సమయంలో ముసెటి కాలి గాయంతో మ్యాచ్‌ను కొనసాగించలేక పోయాడు. అల్కరాస్‌తో కరచాలనం చేసి కోర్టు వీడాడు. “తొలి రెండు సెట్లు చాలా పోటాపోటీగా సాగాయి. రెండో సెట్ గెలిచాక కాస్త కుదుటపడ్డా. మూడో సెట్లో దూకుడుగా ఆడి తేలిగ్గా నెగ్గా. ముసెటి మెరుగైన ఆటగాడు. గాయం నుంచి త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నా” అని అల్కరాస్ చెప్పాడు.




ఆఖరిపోరుకు సినర్: రొలాండ్‌గారోస్‌లో టాప్‌సీడ్ యానెక్ సినర్‌కు ఎదురులేదు. దూకుడైన ఆటతో అతడు తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్లో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సెమీస్‌లో అతడు 6-4, 7-5, 7-6(7-3)తో మాజీ ఛాంపియన్, ఆరోసీడ్ జకోవిచ్‌ను ఓడించాడు. సినర్ అటాకింగ్ గేమ్ ముందు నొవాక్ నిలవలేకపోయాడు. ఈ సీజన్లో గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ సినర్ చేతిలో ఈ సెర్బియా స్టార్ ఓడిపోయాడు.

# పుజారాను ఎలా ఔట్ చేయాలని ఆలోచించేవాళ్లం

ముంబయి: చెతేశ్వర్ పుజారాను ఎలా ఔట్ చేయాలి? జూనియర్ క్రికెట్లో తనతో సహా ముంబయి జట్టు సహచరులందరికీ అంతుచిక్కని ప్రశ్న ఇదేనంటూ గతాన్ని గుర్తుచేసుకున్నాడు భారత వన్డే జట్టు సారథి రోహిత్‌శర్మ. అప్పట్లో సౌరాష్ట్ర బ్యాటర్ పుజారా రెండు, మూడు రోజులు నిరంతరాయంగా బ్యాటింగ్ చేస్తూ తమను మట్టికరిపిస్తుండటమే ఇందుకు కారణమని తెలిపాడు. పుజారా భార్య పూజ రాసిన ‘ది డైరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్’ పుస్తకాన్ని రోహిత్ ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ.. “నాకు ఇప్పటికీ గుర్తుంది. పుజారాను ఎలా ఔట్ చేయాలనే విషయం చుట్టూనే జట్టు సమావేశాలు జరిగేవి. అతడిని ఔట్ చేయకపోతే బహుశా మేం మ్యాచ్‌ను కోల్పోయినట్లే. నాకు 14 ఏళ్ల వయసు ఉన్నప్పుడు అనుకుంటా. ఉదయం మైదానానికి వెళ్లి సాయంత్రం తిరిగొచ్చేసరికి ఎండకు నా ముఖం రంగు మారిపోయేది. పుజారా రోజంతా బ్యాటింగ్ చేసేవాడు. మేం 2, 3 రోజులు ఎండలో ఫీల్డింగ్ చేసేవాళ్లం. ‘నువ్వు ఇంటి నుంచి వెళ్లినప్పుడు బాగానే ఉంటావు. వారం, 10 రోజుల తర్వాత ఇంటికి తిరిగొచ్చినప్పుడు భిన్నంగా ఎందుకు ఉంటావు?’ అని అమ్మ కొన్నిసార్లు నన్ను అడగడం ఇప్పటికీ గుర్తుంది. ‘అమ్మా నేనేం చేయాలి? పుజారా అని ఒక బ్యాటరున్నాడు.. 2, 3 రోజులు బ్యాటింగ్ చేస్తాడు’ అనేవాడిని. పుజారాపై నాకు కలిగిన మొదటి అభిప్రాయమది” అని రోహిత్ వివరించాడు.




# కదిలింది సైన్యం

ముంబయి: ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టు ఇంగ్లాండ్‌కు బయల్దేరింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని జట్టు శుక్రవారం తెల్లవారుజామున ముంబయిలో విమానం ఎక్కింది. ఈ నెల 20 నుంచి ఇంగ్లాండ్‌తో టీమ్ఇండియా అయిదు టెస్టుల సిరీస్ ఆడనున్న సంగతి తెలిసిందే. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రిటైరయ్యాక భారత జట్టు ఆడనున్న తొలి టెస్టు సిరీస్ ఇదే. కెప్టెన్ శుభ్‌మన్‌తో పాటు వైస్ కెప్టెన్ రిషబ్ పంత్.. ఫాస్ట్‌బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్.. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా.. స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్.. తొలిసారి భారత జట్టులో చోటు సంపాదించిన ఓపెనింగ్ బ్యాటర్ సాయిసుదర్శన్ ఇంగ్లాండ్‌కు బయల్దేరిన బృందంలో ఉన్నారు. టెస్టు జట్టులోని ఇతర సభ్యులు ఇప్పటికే ఇంగ్లాండ్‌కు వెళ్లారు. కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్, అభిమన్యు ఈశ్వరన్ తదితరులు ఇంగ్లాండ్ లయన్స్‌తో వార్మప్ మ్యాచ్ ఆడుతున్నారు. పటౌడీ ట్రోఫీ నుంచి తెందుల్కర్-అండర్సన్ ట్రోఫీగా పేరు మారిన టెస్టు సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు లీడ్స్ వేదికగా నిలవనుంది.



# గుకేశ్.. ప్రతిసారీ అలా వద్దు

స్టావెంజర్: ప్రత్యర్థి ఆటగాడు తప్పు చేసే వరకు ఎదురు చూసి ఆఖర్లో విజయం గేమ్‌లను మలుపు తిప్పడం, విజయాలు సాధించడంలో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌ది ప్రత్యేక నైపుణ్యమని చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ కొనియాడాడు. “గుకేశ్ గొప్ప రక్షణాత్మక ఆటగాడు. జనాలు అతడి మీద పూర్తిగా ఆశలు కోల్పోయిన స్థితిలో, ఓటమి ఖాయమైన స్థితిలోనూ అతను ఓపిగ్గా ఆడుతూ సాగిపోతుంటాడు. అలా ఆడడం అర్థరహితమేమీ కాదు. అతను చిన్న అవకాశం కోసం ఎదురు చూస్తుంటాడు. ప్రత్యర్థులు అలసిపోయి, నిర్లక్ష్యంతో తప్పు చేస్తుంటారు. కానీ గుకేశ్ ఎప్పుడూ అలాగే చేస్తున్నాడా? నార్వే చెస్‌లో రెండు గేమ్‌లు అలా సాగడం చూశా. కానీ ప్రతిసారీ ఇదే పద్ధతిని అనుసరిస్తుంటే హెచ్చరించాల్సిందే. అతను గొప్ప పోరాట యోధుడు. కానీ అన్నిసార్లూ ఇలాగే ఆడుతుంటే నేను హర్షించను” అని ఆనంద్ అన్నాడు.



# అల్లు అర్జున్ - అట్లీ ప్రాజెక్ట్.. హీరోయిన్‌గా ఈమె ఫిక్స్



అల్లు అర్జున్ () హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్‌కు సన్నాహాలు జరుగుతోన్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ పుట్టినరోజును పురస్కరించుకొని ఏప్రిల్ 8న టీమ్ దీనిని అధికారికంగా ప్రకటించింది. సన్ పిక్చర్స్ నిర్మాణసంస్థపై భారీ బడ్జెట్‌తో ఇది నిర్మితం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, టీమ్ తాజాగా ఒక ఆసక్తికర ప్రకటన విడుదల చేసింది. ఇందులో హీరోయిన్‌గా ఎవరు కనిపించనున్నారో టీమ్ ప్రకటించింది. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె (%ణవవజూఱఅఖ ౯ఖఒబనిశీఅవ%).. ఇందులో బన్నీకి జోడీగా కనిపించనున్నారని చెప్పింది. ఈ మేరకు స్పెషల్ వీడియో షేర్ చేసింది.

'పుష్ప' తర్వాత అల్లు అర్జున్ నటిస్తోన్న చిత్రమిదే. అల్లు అర్జున్ 22వ ప్రాజెక్ట్‌గా ఇది ప్రచారంలో ఉంది. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ సినిమాగా ఇది ముస్తాబు కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించే పనిలో ఉంది. హాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ ఈ సినిమా కోసం రంగంలోకి దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ బడ్జెట్‌తో నిర్మితం కానున్న ఈ సినిమా ఈయేడాది ద్వితీయార్ధంలోనే చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. దీపికా పదుకొణె విషయానికి వస్తే.. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆమె 'కల్కి 2898 ఏడీ'తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. గతేడాది విడుదలైన ఆ చిత్రంతో తెలుగు సినీ ప్రియులను ఆకట్టుకున్నారు. తాజాగా సన్ పిక్చర్స్ విడుదల చేసిన వీడియోను చూస్తే.. %ూూ%22లో ఈమె పాత్ర విభిన్నంగా ఉండనుందని తెలుస్తోంది. దీపికపై యాక్షన్ సన్నివేశాలు సైతం చిత్రీకరించనున్నట్లు అర్థమవుతోంది.

# 'హరిహర వీరమల్లు' @ రూ.250 కోట్ల బడ్జెట్: జ్యోతికృష్ణ



పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న పీరియాడికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'హరిహర వీరమల్లు' (. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఉద్దేశించి దర్శకుడు జ్యోతికృష్ణ మచిలీపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమా బడ్జెట్ గురించి ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సుమారు రూ. 250 కోట్లకు పైగా బడ్జెట్‌తో దీనిని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

''పవన్ కల్యాణ్‌తో వర్క్ చేసే అవకాశం నాకు ఈ సినిమాతో దొరికింది. అదృష్టవంతుడిగా ఫీలవుతున్నా. ఇతరుల టాలెంట్‌ను ఆయన ఎంతగానో గుర్తిస్తారు. ఒక్కసారి నమ్మారంటే ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారు. ఆయన నన్ను నమ్మారు. నాతో సినిమా చేశారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నా. ఇప్పటికే ఆయన సినిమా చూశారు. అది కూడా ఒక్కసారి కాదు మూడుసార్లు. దాదాపు గంటసేపు నన్నెంతో మెచ్చుకున్నారు. నాతో మరో సినిమా చేయాలని ఉందని చెప్పారు. ఆయన మాటలు నాకెంతో ఆనందాన్ని ఇచ్చాయి. బందరు పోర్ట్‌కు సంబంధించి మన సినిమాలో ఒక భారీ సీక్వెన్స్ ఉంది. కథకు తగిన విధంగా సీజీలో ఈ పోర్ట్ రీ క్రియేట్ చేయడానికి సుమారు రెండేళ్లు కష్టపడ్డాం. పోర్ట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను ప్రేక్షకులు ఫుల్ ఎంజాయ్ చేస్తారు. దీనికోసం ఆయన ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్‌లో ప్రాక్టీస్ చేశారు. మీకు మంచి చిత్రాన్ని ఇచ్చేందుకు ఆయన ఎంతో శ్రమించారు" అని జ్యోతికృష్ణ చెప్పారు.

హిస్టారికల్ యాక్షన్ మూవీగా ఈ సినిమా సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ కథానాయిక. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. రెండు భాగాల్లో దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. జూన్ 12న దీనిని విడుదల చేయాలని భావించినప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నామని శుక్రవారం టీమ్ ప్రకటించింది. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చెప్పింది.

# 'ఏది ఏమైనా నువ్వు యాక్ట్ చేయాల్సిందే'..: నెపోటిజంపై రానా



చిత్ర పరిశ్రమలో బంధుప్రీతి (నెపోటిజం) అనేది ఎప్పుడూ చర్చనీయాంశమే. దీనిపై తాజాగా తన అభిప్రాయాన్ని తెలియజేశారు నటుడు రానా దగ్గుబాటి (. 'రానా నాయుడు 2' ( ప్రమోషన్స్‌లో భాగంగా ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన నెపోటిజం గురించి మాట్లాడారు. చిత్ర పరిశ్రమకు చెందిన కుటుంబం నుంచి రావడం వల్ల ఇండస్ట్రీ గురించి మరింత ఎక్కువగా తెలుసుకునే వెసులుబాటు మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు. అవకాశాలు త్వరితగతిన వచ్చేందుకు ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఉపయోగపడుతుందని రానా అభిప్రాయం వ్యక్తం చేశారు.

"కుటుంబానికి చెందిన రంగంలోకి అడుగుపెట్టడం వల్ల ఇతరులతో పోలిస్తే ఆ పరిశ్రమ గురించి మరింతగా అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంది. సినీ పరిశ్రమలోనూ ఇదే పరిస్థితి ఉంటుంది. ఫిల్మ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న కుటుంబం నుంచి పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు అవకాశాలు త్వరితగతిన లభిస్తాయి. అంతకుమించి ఎలాంటి ఉపయోగం ఉండదు. ఎందుకంటే, ఫిల్మ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా లేకున్నా.. చివరకు నువ్వు మాత్రం కెమెరా ముందు నిల్చోవాల్సిందే. యాక్ట్ చేయాల్సింది. నువ్వు చేసే పని మీదే నీ కెరీర్ ఆధారపడి ఉంటుంది. మా అమ్మ ఫిల్మ్ లేబరేటరీలో వర్క్ చేశారు. నాన్న స్టూడియో నడిపిస్తున్నారు. బాబాయ్ నటుడు. దానివల్లే నాకు ఆ మూడు విభాగాలపై అవగాహన ఉంది" అని రానా తెలిపారు.

వెంకటేశ్, రానా ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. 2023లో నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది విడుదలై ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'రానా నాయుడు 2' సిద్ధమైంది. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే ఈసారి సినీ ప్రియులకు రెట్టింపు వినోదాన్ని పంచేందుకు టీమ్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్బంద, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినో మోరియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 13 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సిరీస్ తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రసారం కానుంది.

# సమంత కొత్త వీడియో.. ఆ టాటూ గురించే నెటిజన్ల కామెంట్స్



నటి, నిర్మాతగానే కాకుండా పలు బ్రాండ్‌లను ప్రమోట్ చేస్తూ ఫుల్ బిజీగా జీవితాన్ని గడుపుతున్నారు సమంత ( 'సీక్రెట్ ఆల్కమిస్ట్' సంస్థ ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం ఆమె ఒక స్పెషల్ వీడియో షేర్ చేశారు. 'నథింగ్ టు హైడ్' అని పేర్కొంటూ ఇందులో ఆమె నవ్వులు పూయిస్తూ కనిపించారు. "ఇదొక మంచి ఉద్దేశంతో మొదలైంది" అనే క్యాప్షన్‌ను జత చేశారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిని చూసిన పలువురు నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా ఆమె మెడపై టాటూ కనిపించకపోవడంపై వాళ్లు మాట్లాడుకుంటున్నారు. "వైఎంసీ (ఏమాయ చేసావె).. టాటూను సమంత తొలగించేశారా?'' అని సందేహం వ్యక్తంచేశారు. అలా జరిగి ఉండకపోవచ్చని.. మేకప్‌తో అది కనిపించకుండా కవర్ చేసి ఉండొచ్చని మరికొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సమంత కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన చిత్రమే 'ఏమాయ చేసావె'. గౌతమ్ వాసుదేవ్ మేనన్ దర్శకత్వం వహించిన ఈ ప్రేమకథా చిత్రం సామ్‌ను సినీప్రియులకు ఎంతగానో చేరువ చేసింది. తొలి చిత్రానికి గుర్తుగా సమంత తన మెడపై 'వైఎంసీ' అనే పచ్చబొట్టు వేయించుకున్నారు. ఇది తనకెంతో ప్రత్యేకమని ఆమె పలు సందర్భాల్లో చెప్పారు. సీక్రెట్ ఆల్కమిస్ట్ విషయానికి వస్తే.. ఇదొక బ్యూటీ, కాస్మొటిక్, పర్సనల్ కేర్ సంస్థ. ఈ సంస్థకు ఈమె సహ వ్యవస్థాపకురాలు. దీంతో ఈ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తూ సామ్ తరచూ వీడియోలు షేర్ చేస్తుంటారు.

ఇక సినిమాల విషయానికి వస్తే.. సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్' సిరీస్ కోసం వర్క్ చేస్తున్నారు. రాజ్, డీకే (%ఖుయి ఖఅఎ ణఖ%) దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆదిత్యరాయ్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఇది సిద్ధమవుతోంది. ఆమె నిర్మాతగా వ్యవహరించిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'శుభం' ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. తన నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై ఇప్పుడు ఆమె 'మా ఇంటి బంగారం' సినిమా చేయనున్నారు. సమంత కథానాయికగా ఇది సిద్ధం కానుంది.

# పవన్‌కల్యాణ్‌ను కలిసిన అర్జున్ దాస్.. ఫొటోలు వైరల్



హైదరాబాద్: పవన్ కల్యాణ్ (హీరోగా సుజీత్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఓజీ' . గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. కోలీవుడ్ నటుడు అర్జున్‌దాస్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. చిత్రీకరణలో భాగంగా పవన్‌కల్యాణ్‌తో దిగిన ఫొటోలను అర్జున్‌దాస్ అభిమానులతో పంచుకున్నారు. పవన్‌తో మరో సినిమా కోసం వర్క్ చేయాలని ఉందని చెప్పారు.

"పవన్ కల్యాణ్ గారు.. మిమ్మల్ని కలవడం నాకెంతో సంతోషంగా ఉంది. మీతో కలిసి వర్క్ చేసిన ప్రతి రోజునూ నేను గుర్తుపెట్టుకుంటా. మనం కలిసి షూట్‌లో పాల్గొన్నప్పుడు నాకోసం సమయాన్ని కేటాయించినందుకు ధన్యవాదాలు. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ వీలున్నప్పుడల్లా ఎన్నో గొప్ప విషయాల గురించి మీరు నాతో చర్చించారు. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ క్షణాలను నేను జీవితాంతం గుర్తు పెట్టుకుంటా. మీతో మరో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశిస్తున్నా" అని అర్జున్‌దాస్ పోస్ట్ పెట్టారు. పవన్ కల్యాణ్‌తో కలిసి సెల్ఫీకి పోజులిచ్చారు.

ప్రస్తుతం 'ఓజీ' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ప్రేమంటే గమ్యం కాదు.. ప్రయాణం: '8 వసంతాలు' టీజర్



అనంతిక సానిల్ కుమార్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న చిత్రం '8 వసంతాలు' ). ఫణీంద్ర దర్శకుడు. మైత్రీ మూవీస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం నుంచి సెకండ్ టీజర్ విడుదలైంది. హీరో పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఈ టీజర్‌ను పంచుకుంది. 'ఊటీకి కొత్తగా వచ్చిన తెలుగు రచయిత. తను పదాలను ప్రేమతో రాస్తే తడిసిన గులాబీ పూలలా ఉంటాయి. అదే కసితో రాస్తే, పిన్ పీకిన గ్రనేడ్‌లా ఉంటాయి' అంటూ మొదలైన టీజర్ హృద్యంగా సాగింది. 'ప్రేమంటే మనం చేరాల్సిన గమ్యం కాదు.. చేయాల్సిన ప్రయాణం' అంటూ హీరో సంభాషణతో టీజర్‌ను ముగించిన విధానం ఆకట్టుకుంది. అందమైన పెయింటింగ్‌లా సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

# మీ పిల్లలు వింటున్నారా?

వినికిడి లోపం పెద్ద సమస్య. దీనికి చిన్నా పెద్దా తేడా ఏమీ లేదు. మనదేశంలో ఏటా సుమారు లక్ష మంది పిల్లలు తీవ్ర వినికిడి లోపంతో పుడుతున్నారని అంచనా. ఇది పిల్లల శారీరక, మానసిక వికాసం మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. సమస్యను వీలైనంత త్వరగా గుర్తించి, సరైన చికిత్స చేయిస్తే మామూలు జీవితం గడిపేలా చేయొచ్చు. కాబట్టి వినికిడి లోపాన్ని ముందే పసిగట్టి, జాగ్రత్త పడటం అత్యవసరం.

మనం వినటంతోనే చిన్నప్పటి నుంచీ మాటలు నేర్చుకుంటాం. భాషా నైపుణ్యాలు సాధిస్తాం. నలుగురితో కలిసి మెలసి



గడపటం, జీవితంలో పైకి ఎదగటం వంటివన్నీ దీంతో ముడిపడినవే. వినికిడి ఏమాత్రం లోపించినా పిల్లల ఎదుగుదల కుంటుపడుతుంది. సాధారణంగా నెల, రెండు నెలల పిల్లలు గట్టి శబ్దానికి ఉలిక్కి పడతారు. మెడ నిలపటం వచ్చాక చప్పుడు వచ్చే వైపు తల తిప్పుతారు. ఆరేడు నెలలకు అత్తాత్తా అంటూ ముద్దు మాటలు మాట్లాడతారు. తొలి పుట్టినరోజు నాటికి అమ్మ, తాతా వంటి అర్థవంత పదాలు పలుకుతారు. రెండేళ్లు నిండేసరికి చిన్న చిన్న పద బంధాలు అబ్బుతాయి. మూడేళ్లకు మామూలు వాక్యాలు మాట్లాడతారు. నాలుగేళ్లు వచ్చేసరికి భాషను బాగా అర్థం చేసుకుంటారు. ఇలా క్రమంగా మాట్లాడే భాష అభివృద్ధి చెందుతూ వస్తుంది. వినికిడి సరిగా లేకపోతే ఇవన్నీ దెబ్బతింటాయి. మాటలు రావటం ఆలస్యమవుతుంది. కొందరికి రెండు, రెండున్నరేళ్లు దాటినా మాటలు రాకపోవచ్చు. ఇంట్లో పెద్దవాళ్లు దీన్ని సహజమేననీ పొరపడొచ్చు. ఇది సరికాదు. వినికిడి లోపిస్తే మాటలు ఆలస్యం కావటమే కాదు.. ప్రవర్తన సమస్యలూ తలెత్తొచ్చు. చెప్పేది సరిగా అర్థం కాక అటూఇటూ పరుగెత్తొచ్చు. టీవీ, మొబైల్ ఫోన్ సౌండ్ పెద్దగా పెడుతుండొచ్చు. రాయటం, చదవటంలో ఇబ్బంది పడతారు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గుతాయి. తరగతిలో వెనకపడతారు. ఉపాధ్యాయులు, తోటి పిల్లలతో అంతగా మాట్లాడరు. ఒకటి చెబితే మరోటి అర్థం చేసుకుంటారు. మిగతా పిల్లలతో సంబంధాలు దెబ్బతినటం వల్ల భావోద్వేగాలకూ లోనవుతారు. చిరాకు, కోపం, ఆందోళన తలెత్తుతాయి. వీలైనంత త్వరగా గుర్తించి చికిత్స చేస్తే రాణించటానికి అవకాశముంటుంది.

## పుట్టినప్పుడే స్క్రీనింగ్

అభివృద్ధి చెందిన దేశాల్లో పుట్టిన వెంటనే శిశువులందరికీ వినికిడి పరీక్షిస్తారు. మనదేశంలో ఇది తప్పనిసరి కాకపోవటం వల్ల కొన్ని ఆసుపత్రుల్లోనే చేస్తున్నారు. నిజానికి పుట్టిన తర్వాత వీలైనంత త్వరగా వినికిడి పరీక్ష చేస్తే లోపాన్ని ముందే గుర్తించొచ్చు. ఇందుకు ఏఏబీఆర్ (ఆటోమేటిక్ ఆడిటరీ బ్రెయిన్ స్టెమ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ), ఓఈఈ (ఆటో ఎకోస్టిక్ ఎమిషన్) స్క్రీనింగ్ పరీక్షలు ఉపయోగపడతాయి. వీటి ఫలితాలు నార్మల్‌గా ఉంటే వినికిడి బాగుందని చెప్పుకోవచ్చు. ఏదైనా తేడాగా అనిపిస్తే వారం, పది రోజుల తర్వాత మరోసారి పరీక్షించాల్సి ఉంటుంది. ఏబీఆర్ (ఆడిటరీ బ్రెయిన్‌స్టెమ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ) పరీక్షతో వినికిడి లోపాన్ని నిర్ధరిస్తారు.

## ఎందుకీ లోపం?

పిల్లల్లో వినికిడి లోపానికి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి. కొందరికి వంశపారం పర్యంగా రావొచ్చు. తల్లిదండ్రులకు లోపముంటే పిల్లలకు వచ్చే ప్రమాదముంది. గర్భధారణ సమయంలో తల్లికి రుబెల్లా, సైటోమెగాలే వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు.. తల్లి వేసుకునే మందులు వికటించటం కారణం కావొచ్చు. కాన్పు సమయంలో ఎదురు కాళ్లతో పుట్టటమూ ఇబ్బందే. దీంతో కొందరు శ్వాస సరిగా తీసుకోలేక, మెదడుకు తగినంత ఆక్సిజన్ అందదు. ఇలాంటి పరిస్థితుల్లో ముందు దెబ్బతినేది కాక్లియానే. దీంతో వినికిడి లోపించొచ్చు. ఇక పుట్టిన వెంటనే మెనింజైటిస్, మీజిల్స్, గవద బిళ్లల వంటి ఇన్‌ఫెక్షన్లు కూడా హాని చేయొచ్చు. పొరపాటున జారి, కిందపడి తలకు దెబ్బలు తగలటమూ కారణం కావొచ్చు. వీటితోనూ క్లాకియాలోని సూక్ష్మ కేశాలు దెబ్బతినే అవకాశముంది. కొందరికి శ్రవణనాడిలోనే సమస్య తలెత్తొచ్చు. కొన్నిసార్లు ఎలాంటి కారణం లేకుండానూ లోపం తలెత్తొచ్చు.

## సమస్య రకరకాలు

బయటి, మధ్య చెవి కారణాలతో తలెత్తే వినికిడి లోపాన్ని కండక్టివ్ రకంగా భావిస్తారు. గులిమి పేరుకొని మార్గం పూర్తిగా మూసుకోవటం, కర్ణభేరికి రంధ్రం పడటం, చీము రావటం వంటివి దీనికి కారణమవుతుంటాయి. లోపలి చెవిలో కాక్లియా, శ్రవణనాడి వద్ద సమస్య ఉంటే సెన్సొరీ న్యూరల్ వినికిడి లోపం అంటారు. కొన్నిసార్లు మధ్య, లోపలి చెవి రెండింటిలోనూ సమస్య ఉండొచ్చు. దీన్ని మిశ్రమ వినికిడి లోపంగా భావిస్తారు.

## తీవ్రత ఎంత?

శబ్దాల స్థాయిని డెసిబుల్స్‌లో లెక్కిస్తారు. చేతి గడియారంలో సెకండ్ల ముల్లు 35-40 డెసిబుల్స్ చప్పుడు చేస్తుంది. గుసగుసలు 45-50, మీటరు దూరం నుంచి మామూలుగా మాట్లాడే వ్యక్తి మాటలు సగటున 65, గట్టి శబ్దాలు 80-90, విమానం రన్‌వే నుంచి గాల్లోకి ఎగురుతున్నప్పుడు 120 డెసిబుల్స్‌లో ఉంటాయి. పిల్లలకు ఏ స్థాయి శబ్దాలు వినిపిస్తున్నాయనే దాన్ని బట్టి లోపాన్ని నిర్ణయిస్తారు. నార్మల్- 0-15 డెసిబుల్స్, స్వల్ప లోపం- 16-25 డెసిబుల్స్. ఒక మాదిరి లోపం- 26-40 డెసిబుల్స్. మధ్యస్థ లోపం- 41-55 డెసిబుల్స్. మధ్యస్థ నుంచి కాస్త తీవ్రం- 56-70తీవ్ర లోపం- 71-90 డెసిబుల్స్. అతి తీవ్ర లోపం- 91 కన్నా ఎక్కువ డెసిబుల్స్.

## ఎలా వినిపిస్తుంది?

చెవిని బయటి, మధ్య, లోపలి భాగాలుగా విభజించుకోవచ్చు. బయటి భాగంలోని చెవి దొప్ప శబ్దాలను సంగ్రహించి, వాటిని మార్గం ద్వారా లోపలికి పంపిస్తుంది. ఈ శబ్దాలు ముందుగా మధ్య చెవిలోని కర్ణభేరిని, తర్వాత దానికి అనుసంధానంగా ఉండే మూడు చిన్న ఎముకలను కంపింపజేస్తాయి. దీంతో శబ్ద తరంగాలు యాంత్రిక తరంగాలుగా మారతాయి. ఇవి చివరి గొలుసు ఎముక ద్వారా లోపలి చెవిలోని కాక్లియాను చేరతాయి. నత్తలాగా ఉండే ఇది చాలా సున్నితమైంది. దీనిలోపల ద్రవం, ఆ ద్రవంలో కేశాల వంటి రోమకణాలు తేలియాడుతూ ఉంటాయి. లోపలికి వచ్చే యాంత్రిక తరంగాలకు కాక్లియా ద్రవంలో అలలు రేగి, రోమకణాలు ఊగుతాయి. అప్పుడు యాంత్రిక తరంగాలు విద్యుత్ ప్రచోదనాలుగా మారి, శ్రవణ నాడి ద్వారా మెదడుకు చేరుకుంటాయి. దీంతో శబ్దం వినిపిస్తుంది. చెవిలో ఏ భాగంలో సమస్య తలెత్తినా లోపానికి దారితీస్తుంది.

## చికిత్స- రెండు రకాలు

కండక్టివ్, మిశ్రమ వినికిడి లోపాలు మందులు, శస్త్రచికిత్సలతో నయమవుతాయి. సెన్సొరీ న్యూరల్ వినికిడి లోపానికి వినికిడి సాధనాలు, కాక్లియర్ ఇంప్లాంట్ మాత్రమే పరిష్కార మార్గాలు.

వినికిడి సాధనాలు: ఇవి శబ్దాల తీవ్రతను పెంచి మాటలు వినిపించేలా చేస్తాయి. వీటిల్లో మైక్రోఫోన్, యాంప్లిఫయర్, రిసీవర్ అని మూడు భాగాలుంటాయి. బయటి నుంచి వచ్చే శబ్దాన్ని మైక్రోఫోన్ గ్రహించి, యాంప్లిఫయర్‌కు చేరవేస్తుంది. యాంప్లిఫయర్ శబ్దం స్థాయిని పెంచి రిసీవర్‌కు పంపిస్తుంది. రిసీవర్ దాన్ని కర్ణభేరికి అందిస్తుంది. వినికిడి లోపం తీవ్రతను బట్టి శబ్దం స్థాయి ఎంత మేరకు పెరగాలో సాధనంలో సెట్ చేస్తారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డిజిటల్ వినికిడి సాధనాలు వాటంతటవే సర్దుకుంటాయి. చిన్న శబ్దాలను పెంచుతాయి, పెద్ద శబ్దాలనైతే తగ్గిస్తాయి. కొన్ని సాధనాలు చుట్టుపక్కల రణగొణధ్వనులనూ నిలువరించి, స్పష్టంగా వినిపించేలా చేస్తాయి కూడా. ఇప్పుడు కృత్రిమ మేధతో కూడిన సాధనాలూ వస్తున్నాయి. ఇవి ఆయా పరిస్థితులను గుర్తించి, తమకు తామే మార్పులు చేసుకుంటాయి.

కాక్లియర్ ఇంప్లాంట్: వినికిడి లోపం 80 డీబీ కన్నా ఎక్కువ గలవారికి సాధనాలు ఉపయోగపడవు. శబ్దాన్ని ఎంత పెద్దగా చేసినా వినిపించదు. ఇలాంటివారికి కృత్రిమ కాక్లియర్ పరికరం మేలు చేస్తుంది. దీన్ని శస్త్రచికిత్స చేసి లోపలి చెవిలో అమర్చుతారు. ఇది సహజ కాక్లియా మాదిరిగా పనిచేస్తుంది. ఇందులో రెండు భాగాలుంటాయి. బయట ఉండేది ప్రాసెసర్. లోపల అమర్చేది ఇంప్లాంట్. బయటి నుంచి వచ్చే శబ్దాలను ప్రాసెసర్ గ్రహించి, రేడియో ఫ్రీక్వెన్సీ సంకేతాలుగా మార్చి ఇంప్లాంట్‌కు అందిస్తుంది. ఇది సంకేతాలను విద్యుత్ ప్రచోదనాలుగా మార్చి, నాడీ పోచలకు అందిస్తుంది. అవి మెదడుకు చేరి, మాటలు, శబ్దాలు స్పష్టంగా వినిపిస్తాయి.

పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చాకే అసలు చికిత్స మొదలవుతుంది. భాషా నైపుణ్యాలు అలవడేంతవరకూ ఆడిటరీ వర్బల్ చికిత్స అవసరం. అలాగే క్రమం తప్పకుండా ప్రాసెసర్‌ను ప్రోగ్రామింగ్ చేయాల్సి ఉంటుంది. కృత్రిమ కాక్లియాను అమర్చిన వయసును బట్టి ఫలితాలు ఆధారపడి ఉంటాయి. పిల్లల్లో ఏడాది లోపు అమర్చితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. వయసు పెరుగుతున్నకొద్దీ భాషా నైపుణ్యాలు అబ్బటం కొరవడతాయి. కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స ఖరీదైనది. దీన్ని భరించగలిగేవారైతే పిల్లల రెండు చెవులకూ అమర్చటం మంచిది.

# చిగుళ్ల నొప్పి తగ్గదేం?

: నాకు 55 ఏళ్లు. మధుమేహం ఉంది. పంటి చిగుళ్ల నొప్పికి ఇటీవల డెంటిస్ట్‌కు చూపించుకుంటే రూట్ కెనాల్ చికిత్స చేశారు. కానీ చిగుళ్ల నొప్పి తగ్గలేదు. రక్తం కూడా వస్తోంది. దీనికి పరిష్కారమేంటి?

చిగుళ్ల నొప్పికి, రక్తం రావటానికి ప్రధాన కారణం ఇన్‌ఫెక్షన్. పంటి నుంచి



చిగురుకు ఇన్‌ఫెక్షన్ వ్యాపిస్తే ఒక్క రూట్ కెనాల్ చికిత్స సరిపోదు. పిప్పి పన్ను, పంటి ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలకు దంతమూలం నుంచి శుభ్రం చేస్తారు (రూట్ కెనాల్). అదే చిగుళ్ల ఇన్‌ఫెక్షన్‌ను తొలగించటానికైతే పళ్లను లోతుగా శుభ్రం చేయాల్సి ఉంటుంది (స్కేలింగ్). కొన్నిసార్లు లేజర్ చికిత్స కూడా అవసరమవుతుంది. ఇన్‌ఫెక్షన్ తొలగిపోతే చిగుళ్ల నొప్పి తగ్గుతుంది. ఒకవేళ చిగుళ్ల జబ్బు రెండో దశ గానీ మూడో దశ గానీ దాటితే శుభ్రం చేసినా తగ్గకపోవచ్చు. ఇలాంటి సమయంలో పంటిని తొలగించటం లేదా చిగుళ్ల శస్త్రచికిత్స అవసరమవుతుంది. ఎక్స్‌రే తీసి చూస్తారు. పన్ను కదులుతోందా? ఎముక క్షీణించిందా? అనే దాన్ని బట్టి చికిత్సను నిర్ణయిస్తారు. పన్ను కదులుతుంటే దాన్ని తొలగిస్తారు. ఎముక క్షీణించి, ఇన్‌ఫెక్షన్ లోపలికి పాకితే చిగురును తెరచి, లోపలి భాగాన్ని పూర్తిగా శుభ్రం చేసి.. తిరిగి కుట్టేస్తారు. రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉంటే ఇన్‌ఫెక్షన్ త్వరగా తగ్గదు. వేగంగా వ్యాపిస్తుంది కూడా. కాబట్టి మధుమేహాన్ని కచ్చితంగా నియంత్రణలో ఉంచుకోవాలి.

# పార్శ్వనొప్పి పని పట్టండి

పార్శ్వనొప్పి (మైగ్రేయిన్) అన్నిసార్లూ అనివార్యం కాకపోవచ్చు. కొన్నిసార్లు అది వస్తున్న సంగతి ముందే తెలియొచ్చు. ఒకవేళ వచ్చినా తీవ్రం కాకుండా చూసుకోవచ్చు. దీనికి సిద్ధంగా ఉండటం, శరీరంలో ఏయే మార్పులు జరుగుతున్నాయో గమనించుకోవటం అన్నింటికన్నా ముఖ్యం.

## హెచ్చరికలను గమనించండి

కొందరికి పార్శ్వనొప్పి వచ్చే ముందు మలబద్ధకం లేదా నీళ్ల విరేచనాలు, మూడ్ మారటం, మెడ బిగుసుకోవటం, కొన్ని పదార్థాలు, పానీయాలు ఎక్కువగా



తీసుకోవటం వంటి హెచ్చరిక లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇవి కొద్ది గంటల నుంచి రెండు రోజుల ముందు వరకూ ఎప్పుడైనా తలెత్తొచ్చు. మరికొందరికి కళ్ల చుట్టూ కాంతి వలయాలు (ఆరా) కనిపించొచ్చు. ఈ సమయంలో ఆకారాలు, మిరుమిట్లు గొలిపే కాంతులు, ప్రకాశవంతమైన మచ్చల వంటివి గోచరించొచ్చు. చూపు తగ్గొచ్చు. చెవిలో శబ్దాలు లేదా సంగీతం వినిపించొచ్చు. కాళ్లు, చేతుల మీద సూదులతో పొడుస్తున్నట్టు అనిపించొచ్చు.

## ఏం చేయాలి?

వెంటనే డాక్టర్లు సూచించిన మందులు వేసుకోవాలి.

వీలుంటే విశ్రాంతి తీసుకోవాలి. ప్రశాంతమైన, చీకటి గదిలో పడుకోవాలి.

కొందరికి కాఫీ, టీ తాగితే ఉపశమనం కలగొచ్చు. అయితే మరీ ఎక్కువగా తాగొద్దు.

చిన్న ప్లాస్టిక్ బ్యాగులో ఐస్ ముక్కలు వేసి తల లేదా మెడ మీద పెట్టుకోవచ్చు. కొందరికి వేడి కాపు హాయిగా ఉండొచ్చు.

తగినంత నీరు తాగాలి.

## ఏం చేయొద్దు?

మరీ అతిగా మందులు వాడొద్దు. నెలకు 10 రోజుల కన్నా ఎక్కువగా నొప్పి మందులు వేసుకుంటున్నట్టయితే అతిగా వాడుతున్నట్టే. ఇది తలనొప్పి మళ్లీ మళ్లీ వచ్చేలా చేయొచ్చు.

భోజనం మానెయ్యొద్దు. అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు వేళకు తినాలి. భోజనానికీ భోజనానికీ మధ్య మరీ ఎక్కువసేపు ఖాళీ ఇవ్వద్దు.

# వంగొద్దు.. కుంగొద్దు..

కంప్యూటర్, ల్యాప్‌టాప్ ముందు కూర్చున్నప్పుడు తెలియకుండానే వెన్నెముక ముందుకు వంగిపోతుంటుంది. దీంతో ఎముకలు, కండరాలు, కీళ్ల మీద ఒత్తిడి పెరుగుతుంది. ఎప్పుడో అప్పుడంటే ఏమో గానీ తరచూ ముందుకు వంగుతుంటే లోపలి అవయవాల మీదా ప్రభావం పడుతుంది. ఊపిరితిత్తులు, పేగులు సరిగా పనిచేయవు. చివరికి శ్వాస తగినంత తీసుకోకపోవటం, అజీర్ణం వంటి సమస్యలకు దారితీస్తుంది.




మరి భంగిమ దెబ్బతినకుండా చూసుకోవటమెలా? దీనికి ఒక మంచి మార్గం నిటారుగా నిల్చోవటం. దీంతో ఆకర్షణీయంగా, ఆత్మ విశ్వాసంతో ఉన్నట్టూ కనిపిస్తారు. తలను తిన్నగా పెట్టి, చుబుకాన్ని వెనక్కి లాక్కోవాలి. చెవులు భుజాల మీద మధ్యలో ఉండాలి. భుజాలను వెనక్కి వంచి, మోకాళ్లను తిన్నగా ఉంచాలి. కడుపును లోపలికి తీసుకోవాలి.

కుర్చీలో కూర్చున్నప్పుడు వీపు పూర్తిగా వెనకాల ఆనేలా చూసుకోవాలి. సహజ వంపు దెబ్బతినకుండా వీపు వద్ద తువ్వాలును పెట్టుకోవాలి. పాదాలను నేలకు తాకించి, మోకాళ్లను 90 డిగ్రీల కోణంలో వంచి, ఒకే ఎత్తులో లేదా తుంటి కన్నా కాస్త ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి.

అదేపనిగా స్మార్ట్‌ఫోన్‌ను చూస్తుంటే వెన్నెముక మీద ఒత్తిడి పడుతుంది. దీన్ని తగ్గించుకోవటానికి ఫోన్‌ను ఎదురుగా, కాస్త ఎత్తి పట్టుకోవాలి. తలను కాకుండా కళ్లను కదల్చాలి.

# గుండె బైపాస్‌కు 3డీ రక్తనాళాలు

3డీ ముద్రణ పద్ధతితో కృత్రిమ రక్తనాళాలను సృష్టించటంలో ఎడిన్‌బరో యూనివర్సిటీ పరిశోధకులు గొప్ప విజయం సాధించారు. జిగురు ద్రవం గొట్టాల మాదిరిగా కనిపించే ఇవి మనుషుల సిరలను పోలి ఉండటం విశేషం. గుండె బైపాస్ శస్త్రచికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలవని ఆశిస్తున్నారు. ఖర్చు తగ్గుతుందని, ఎక్కువమందికి శస్త్రచికిత్సలు చేయటానికి తోడ్పడగలవని భావిస్తున్నారు. ఆయా వ్యక్తుల అవసరాలకు అనుగుణంగా ఈ కృత్రిమ రక్తనాళాలను తయారుచేసే వీలుండటం గమనార్హం. ఇవి 1 నుంచి 40 మి.మీ. మందం కలిగుంటాయి. మృదువుగా, ఎటైనా



వంగేలా ఉండటం వల్ల శరీరంలో తేలికగా ఇమిడిపోతాయని పరిశోధకులు చెబుతున్నారు. గుండె రక్తనాళాల్లో పూడికలు ఏర్పడినవారికి బైపాస్ సర్జరీ చేస్తుంటారు. అయితే ఈ ప్రక్రియలో మచ్చ ఏర్పడటం, నొప్పి, ఇన్‌ఫెక్షన్ ముప్పు వంటి ఇబ్బందులు పొంచి ఉంటాయి. చిన్న కృత్రిమ నాళాలు ప్రత్యామ్నాయ మార్గంగా కనిపించినా అవి శరీరంలో ఇమిడిపోవటం పెద్ద సమస్య. కొన్నిసార్లు విఫలం కావొచ్చు. ఇలాంటి సమస్యలకు కొత్త 3డీ ముద్రిత రక్తనాళాలు మంచి పరిష్కారంగా కనిపిస్తున్నాయి. వాడుకోవటానికి సిద్ధంగా ఉండటం వల్ల వేరే చోటు నుంచి రక్తనాళాన్ని తేవటానికి సర్జరీ చేయటం తప్పుతుంది. శరీరంలో తేలికగా ఇమిడి పోవటం వల్ల దీర్ఘకాలం పనిచేసే అవకాశముంటుంది.

# ఒక్క రక్తపరీక్షతో 60 జబ్బుల జాడ

ఒక్క రక్తపరీక్షతోనే పలు జబ్బుల ముప్పును గుర్తించగలిగితే? అలాంటి పద్ధతినే కనుగొన్నారు క్వీన్‌మేరీ యూనివర్సిటీ ఆఫ్ లండన్ పరిశోధకులు. దాదాపు 60కి పైగా జబ్బుల ముప్పును అంచనా వేయగల ప్రొటీన్ సంకేతాలను కనుగొన్నారు. సాధారణంగా డాక్టర్లు ఇప్పటికే తెలిసిన జబ్బులకు సంబంధించిన ప్రొటీన్లను రక్తంలో పరిశీలిస్తుంటారు.



ఉదాహరణకు- గుండెపోటును గుర్తించటానికి ట్రొపోనిన్ ఉపయోగపడుతుంది. అయితే ఆయా ప్రొటీన్ల సంకేతాలతో రకరకాల తెలియని జబ్బులను, అదీ లక్షణాలు ఆరంభం కావటానికి ముందే అంచనా వేయొచ్చని తాజా పరిశోధన సూచిస్తోంది. వ్యక్తులకు అనుగుణంగా నివారణ చర్యలు తీసుకోవటానికి, ముందుగానే చికిత్సలు ఆరంభించటానికిది ఉపయోగపడగలదని భావిస్తున్నారు. ఈ అధ్యయనంలో అధునాతన పద్ధతుల సాయంతో రక్తంలోని ప్లాస్మా ద్రవంలో ఉండే సుమారు 20 వరకూ అత్యంత ముఖ్యమైన ప్రొటీన్లను శాస్త్రవేత్తలు కచ్చితంగా వర్గీకరించగలిగారు. వీటితో మల్టిపుల్ మైలోమా, నాన్-హాడ్కిన్ లింఫోమా, మోటార్ న్యూరాన్ డిసీజ్, గుండె కండరం వాపు వంటి 67 రకాల జబ్బులను అంచనా వేయొచ్చు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy